www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 12
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 327

మంగళవారం | 12-3-2024

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: విదియ ఉ. 7.15, తదియ తె. 4.03 వరకు; నక్షత్రం: రేవతి రా. 8.30 తదుపరి అశ్వని వర్జ్యం: ఉ. 9.47-11.12; దుర్ముహూర్తం: ఉ. 8.52-9.39, రా. 10.20-11.07; అమృతఘడియలు: రా. 6.21-7.47; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.29; సూర్యాస్తమయం: 6.21

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆశీర్వదించండి

రాష్ట్రం కోసం 'కలిసి' వస్తున్నాం: చంద్రబాబు.. సీట్ల లెక్కలు ఖరారు

బీజేపీ-టీడీపీ-జనసేన చర్చలు కొలిక్కి

కమలానికి 6 లోక్‌సభ, 10 అసెంబ్లీ

జనసేనకు 21 అసెంబ్లీ.. 2 పార్లమెంటు



చంద్రబాబు నివాసంలో ఆయనతోపాటు చర్చల్లో పాల్గొన్న పవన్, షెకావత్, పాండా

144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీ

1 అసెంబ్లీ సీటు బీజేపీకి ఇచ్చేసిన తెలుగుదేశం

1 ఎంపీ, 3 అసెంబ్లీ సీట్లు త్యాగం చేసిన జనసేన

8 గంటలపాటు మూడు పార్టీల నేతల భేటీ

బీజేపీ దూతలుగా షెకావత్, వైజయంత్ పాండా

రాష్ట్ర పరిస్థితులు, సర్వే వివరాలు తెలిపిన బాబు

ఏపీ తీవ్రంగా నష్టపోయిందన్న షెకావత్

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో ఎవరికి ఎన్ని సీట్లు అనే అంశంపై టీడీపీ, జనసేన, బీజేపీ తుది నిర్ణయానికి వచ్చాయి. సోమవారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ ప్రతినిధులుగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, మాజీ ఎంపీ వైజయంత్ పాండా

మిగతా 11వ పేజీలో...

మిత్ర ధర్మం

పార్టీ	లోక్‌సభ	అసెంబ్లీ
టీడీపీ	17	144
బీజేపీ	6	10
జనసేన	2	21

ప్రజల ఆకాంక్షల మేరకు సర్దుబాటు

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

టీడీపీ, బీజేపీ, జనసేన సంయుక్త ప్రకటన

బీజేపీకి విజయనగరం, అరకు?

అనకాపల్లి, రాజమండ్రి, నరసాపురం, తిరుపతి కూడా

పొత్తులో వచ్చే లోక్‌సభ సీట్లు, అభ్యర్థులపై స్పష్టత?

అసెంబ్లీ సీట్లపై కసరత్తు.. రెండ్రోజుల్లో అభ్యర్థుల ప్రకటన

బాబుపై మరో కేసు

అసైన్డ్ భూముల కేసులో ఏ-40గా చేర్చిన సీఐడీ

ఏసీబీ కోర్టులో మెమో, చార్జిషీటు దాఖలు

17న రాష్ట్రానికి మోదీ రాక



చిలకలూరిపేటలో ఉమ్మడి సభకు హాజరు

సభ విజయవంతానికి ఉమ్మడి కమిటీలు

నిడదవోలు అభ్యర్థిగా కందుల దుర్గేశ్

జనసేనాని పవన్ అధికారిక ప్రకటన

11

వైసీపీ 'ఆపరేషన్ ఆకర్ష్' ధమాల్

టికెట్లు రాని టీడీపీ, జనసేన నేతలకు వల

పార్టీ మారాలంటూ ప్రలోభాలు

వారి ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు

వైసీపీలోకి వెళ్లేందుకు వారు ససేమిరా

ఆ పార్టీ మళ్లీ గెలవదనే! అధికార పక్షం ఆశలపై నీళ్లు!

త్వరలో టీడీపీలోకి మా కుటుంబం

ఒంగోలు లోక్‌సభ బరిలో నా కుమారుడు

రాజకీయాల నుంచి రిటైరవుతున్నా: మాగుంట

తిరుగులేని 'దివ్యాస్త్రం'!

భారత్ అమ్ముల పొదిలో ఎంఐఆర్వీ టెక్నాలజీ

తల్లి వార్‌హెడ్, పిల్ల వార్‌హెడ్లకు వేర్వేరు లక్ష్యాలు

అన్నింటికీ గైడెడ్, కంట్రోలింగ్ సాంకేతికత

అగ్ని-5 క్షిపణితో విజయవంతంగా పరీక్ష

అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా సరసన

ఎంఐఆర్వీ టెక్నాలజీలో భారత్‌కు చోటు

ఎంఐఆర్వీలో పూర్తిస్థాయి స్వదేశీ సాంకేతికత

తొలి ప్రయత్నంలోనే డీఆర్‌డీవో విజయం

వరుసగా క్షిపణి ప్రయోగాలకు సన్నాహాలు!

12

మిషన్ దివ్యాస్త్ర



జనవరిలో జరిగిన అగ్ని-5 క్షిపణి పరీక్ష ఫైల్ ఫొటో

ఒక దెబ్బకు రెండు పిట్టలు..! ఇది పాత మాట..! ఇప్పుడు ఒకే దెబ్బకు ఏకకాలంలో రెండు కంటే ఎక్కువ పిట్టలు అని చెప్పుకోవాలి. భారత అమ్ముల పొదిలోకి మల్టీ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికిల్(ఎంఐఆర్వీ) సాంకేతికత చేరింది. అంటే.. ఒకే మిసైల్‌తో పలు వార్‌హెడ్‌లను ఏకకాలంలో ప్రయోగించి, వేర్వేరు లక్ష్యాలను ఒకేసారి ఛేదించవచ్చు. అంతేకాదు.. పూర్తిస్థాయిలో స్వదేశీ పరిజ్ఞానంతో ఆత్మ నిర్భర్ భారత్, 'మిషన్ దివ్యాస్త్ర'లో భాగంగా డీఆర్‌డీవో ఈ సాంకేతికత సాధించింది. వార్‌హెడ్‌లు ఒక్కసారి రీ-ఎంట్రీ అయ్యాయంటే, వాటిని గుర్తించడం శత్రు దేశాలకు దాదాపు అసాధ్యమే..! అణు వార్‌హెడ్లను మోసుకెళ్లగల అగ్ని-5 ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ మిసైల్‌తో భారత్ సోమవారం ఎంఐఆర్వీ సాంకేతికతను విజయవంతంగా పరీక్షించింది.



జగన్ పర్యటనతో కడప రోడ్డులో నాలుగు గంటల పాటు నిలిచిన వాహనాలు. కారులో నుంచి జగన్ అభివాదం



సొంతూరుకూ 'సీఎం' సెగ!

4 జగన్ పర్యటనతో గంటలు నరకం

బారికేడ్లతో పులివెందుల అష్టదిగ్బంధం

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

కడప, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పర్యటన అంటేనే జనం భయపడుతున్నారు. చివరకు ఆ సెగ సొంతూరు పులివెందుల వాసులకు కూడా తగిలింది. గంట రెండు గంటలు కాదు.. నాలుగు గంటలకు పైగా పులివెందుల ప్రజలు అల్లాడిపోయారు. జగన్ పర్యటనలో నరకం అనుభవించారు. జగన్ సోమవారం పులివెందుల పర్యటనకు వచ్చారు. వైఎస్సార్ మెడికల్ కాలేజీ, నర్సింగ్

మిగతా 12వ పేజీలో...

అమల్లోకి సీఏఏ

పౌరసత్వ సవరణ చట్టం నిబంధనలు నోటిఫై చేస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు

పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ నుంచి వలస వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వాన్ని ప్రసాదించే చట్టం

ఎలాంటి పత్రాలూ లేకున్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చాన్స్

రాజ్యాంగ నిర్మాతల వాగ్దానాన్ని మోదీ నెరవేర్చారు: అమిత్‌షా

ఒక వర్గాన్ని ఏకీకృతం చేసేందుకే సీఏఏ అమలు: విపక్షాలు

న్యూఢిల్లీ, మార్చి 11: సరిగ్గా సార్వత్రిక ఎన్నికలకు ముందు మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఎప్పుడో 2019లో ఆమోదించిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ).. ఇప్పుడు అమల్లోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లో మత మైనారిటీలుగా హింసకు గురై.. ఎలాంటి పత్రాలూ లేకుండా 2014 డిసెంబరు 31కి ముందు మనదేశానికి వలస వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం ఇచ్చే చట్టమిది. ఆయా దేశాల నుంచి

మిగతా 2వ పేజీలో...



"ఎన్నికల బాండ్ల వివరాలు సమర్పించాలంటూ మేం ఫిబ్రవరి 15న తీర్పు ఇచ్చాం. ఇప్పటివరకు దీనిపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పలేదు. 'ఇదిగో మేం ఈ పని చేశాం. మాకు మరికొంత సమయం కావాలి' అని చెప్పి ఉండాల్సింది. ఎస్‌బీఐ నుంచి మేం ఆ నిష్పాక్షికతను ఆశిస్తాం."

- సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం వ్యాఖ్యలు

గడువు పెంచం!

ఎన్నికల బాండ్ల వివరాలు నేడు ఈసీకి ఇవ్వండి

2

ఎస్‌బీఐని ఆదేశించిన సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం

గడిచిన 26 రోజుల్లో ఏం చర్యలు తీసుకున్నారని నిలదీత

గడువు పొడిగింపు కోరుతూ వేసిన పిటిషన్ కొట్టివేత

ఎస్‌బీఐ ఇచ్చిన వివరాల్ని 15 సాయంత్రం 5 గంటల్లోగా అధికారిక సైట్‌లో పెట్టాలని ఈసీకి ఆదేశం

మోదీ అసలు స్వరూపం బయటపడబోతోంది: రాహుల్



కమిషనర్ల నియామకంపై కమిటీ భేటీ ఒక రోజు ముందే!

ఎల్లుండి ప్రధాని నేతృత్వంలో భేటీ

రాష్ట్రపతికి పేర్లు సిఫారసు.. ఆమోదానికి అవకాశం!

2

ఈసీల నియామకంపై కేంద్రం జోక్యాన్ని ఆపండి

సుప్రీంలో పిటిషన్.. విచారణకు స్వీకరణ

2

నేటి నుంచే రంజాన్

భారత్‌లో నెలవంక దర్శనం

2

జగన్‌ను చూస్తే జాలేస్తోంది!



ముఖంలో భయం, టెన్షన్: లోకేశ్

టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తుతో ఆయన పనైపోయింది

సిద్ధం సభలో డ్రోన్‌ను చూసి సింహం భయపడిందెందుకో

జనం రాకపోయినా గ్రాఫిక్స్ గిమ్మిక్.. ఈ సీఎంకు ప్రచార పిచ్చి

మరుగుదొడ్లపైనా స్టిక్కర్లే.. గ్రూప్-2 పేపర్‌లోనూ సొంత డబ్బా

బాబాయిని లేపేసిందెవరో అడగాల్సింది.. అమలు చేయని హామీలపై ప్రశ్నలిస్తే పిల్లలు చక్కగా బదులిచ్చేవారు

లోకేశ్ విసుర్లు.. ఉమ్మడి అనంతలో ముగిసిన శంఖారావం

అనంతపురం మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌ను చూస్తే తనకు జాలేస్తోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ అన్నారు. ఆయన ముఖంలో భయం.. టెన్షన్ కనబడుతున్నాయని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పొత్తు కుదరడంతో ఆయన పనైపోయిందని అన్నారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా సోమవారం అనంతపురం జిల్లా అనంతపురం అర్బన్, తాడిపత్రి

మిగతా 12వ పేజీలో...

చార్జీలు పెరగవు

గృహ విద్యుత్తు టారిఫ్ మామూలే

రైల్వేకు యూనిట్‌కు రూ.1 పెంపు

ఆదాయ అంచనా, టారిఫ్‌కు మధ్య 13,624 కోట్ల వ్యత్యాసం

కొత్త టారిఫ్ ప్రకటించిన ఈఆర్‌సీ

ట్రూఅప్, వ్యత్యాసంపై వ్యూహాత్మకం

డిస్కమ్‌లు అడగలేదన్న చైర్మన్

3

బిల్లులే పెరుగుతాయ్!

సర్దుబాటు పేరుతో వినియోగదారులపై భారం

పెండింగ్‌లో రూ.7,200 కోట్ల ట్రూఅప్ చార్జీలు

ఆదాయ, వ్యయ వ్యత్యాసం 15,299 కోట్లు



వీటిని పట్టించుకోని ఈఆర్‌సీ

పరిష్కారం చూపని డిస్కమ్‌లు

విద్యుత్ చార్జీలు పెంచలేదంటూనే ఈ మొత్తాన్ని బిల్లుల్లో చేర్చే వ్యూహం

యూపీఎస్సీ, ఆర్‌ఆర్‌బీలో భారీగా కొలువులు

న్యూఢిల్లీ, మార్చి 11: వివిధ విభాగాల్లో 2,280 ఉద్యోగాల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో అత్యధికంగా 1,930 నర్సింగ్ ఆఫీసర్, 323 పర్సనల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. యూపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రైల్వే నియామక బోర్డు (ఆర్‌ఆర్‌బీ) అన్ని రీజియన్లలో 9,144 టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. ఏప్రిల్ 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

భారత్‌లో నెలవంక దర్శనం

» నేటి నుంచే ముస్లింల ఉపవాస దీక్షలు

చార్మినార్/యాకుత్‌పురా, మార్చి 11(ఆంధ్రజ్యోతి): భారత్‌లో సోమవారం నెలవంక దర్శనంతో దేశవ్యాప్తంగా మంగళవారం నుంచి ముస్లింల ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. ఇస్లామిక్ సంవత్సరంలో రంజాన్ మాసానికి చాలా ప్రత్యేకత ఉంది. ఈ మాసంలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని ముస్లింలు భావిస్తారు. దేవునిపై విశ్వాసాన్ని, భయభక్తులను, భక్తిశ్రద్ధలను తెలుపుకునేందుకు ముస్లింలు రోజా(ఉపవాస దీక్షలు) పాటిస్తారు. చివరి పది రోజులలో ఎతేకాఫ్ పాటిస్తారు. అలాగే ధనవంతుడైన ప్రతి ముస్లిం దానధర్మాలకు అధిక ప్రాధాన్యమిస్తారు. తమ ఆస్తిలో రెండున్నర శాతం తీసి పేదలకు పంచిపెడతారు. నెల రోజుల అనంతరం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించి రంజాన్ జరుపుకొంటారు.

చూపు లేకున్నా.. మానవతా సాయం

» క్యాన్సర్ బాధితురాలికి లక్ష ఇచ్చిన తిరుపతి వాసి

» 'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన


శ్రీనివాసులు నాయుడు

తిరుపతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న యువతికి రెండు కళ్లూ కనిపించని ఓ వ్యక్తి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు. విజయవాడలోని కేదారేశ్వరపేటకు చెందిన కొర్లగంటి దేవి అమృత(20) బీటెక్ విద్యార్థిని. ఇటీవల ఆమె బ్లడ్ క్యాన్సర్ బారిన పడ్డారు. బోన్ మ్యారో చికిత్సకు రూ.60 లక్షల వరకు ఖర్చు పెట్టే స్తోమత లేక ఆ పేద కుటుంబం తల్లడిల్లుతోంది. దీనిపై 'అమృత' హస్తం అందించండి! శీర్షికన ఈ నెల 9వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైంది. తిరుపతి నగరం మంగళం క్వార్టర్స్‌లో నివాసముంటున్న శ్రీనివాసులు నాయుడు కుటుంబీకుల ద్వారా ఈ వార్తను తెలుసుకుని చలించిపోయారు. సుమారు నలభై ఏళ్లపాటు రేషన్ షాపు డీలరుగా పనిచేసి పొదుపు చేసిన మొత్తం నుంచి లక్ష రూపాయలను సోమవారం బాధితురాలి బ్యాంకు ఖాతాకు ఆయన జమ చేశారు. కాగా, శ్రీనివాసులు నాయుడు పదేళ్ల వయసులో చెట్టుపై నుంచి కింద పడడంతో తలలో నరాలు దెబ్బతిని రెండు కళ్లూ కనిపించకుండా పోయాయని ఆయన కుమారుడు జ్యోతికృష్ణ చెప్పారు. చూపు లేకపోయినప్పటికీ తన తండ్రి మానవతా సాయానికి ముందుంటారని, ఎవరికి ఏ కష్టం వచ్చినా తోచిన సాయం చేస్తుంటారని వివరించారు.

'కోటా' ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): 6వ, 7వ, 8వ, 9వ, 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్స్ సిద్ధం చేసినట్లు కోటా పేజెస్ వెల్లడించింది. మరింత సమాచారం కోసం IIT F, MED F అని 9849016661 నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ చేయవచ్చు.


తిరుపతి ఎంపీ అభ్యర్థిగా విజయ్‌కుమార్ పోటీ

తిరుపతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఏపీ యునైటెడ్ ఫ్రంట్(ఏపీయూఎఫ్) నుంచి తిరుపతి ఎంపీ అభ్యర్థిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ పోటీ చేస్తున్నారు. జైభారత్ నేషనల్ పార్టీ, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ, ఆల్ తెలుగు ప్రజా పార్టీ, ఏటీపీ పార్టీ, వీసీకే పార్టీ కలసి ఏపీయూఎఫ్‌గా ఏర్పడిన విషయం తెలిసిందే. సోమవారం తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో కూటమి నేతలు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ తిరుపతి నుంచి ఎంపీగా పోటీ చేయాలని తీర్మానం చేశారు. అనంతరం విశ్రాంత ఐపీఎస్ లక్ష్మీనారాయణ మీడియాతో మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్‌తో రాష్ట్రంలో యువతను పక్కదారి పట్టిస్తున్నారన్నారు.

అమల్లోకి సీఏఏ

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడికి వచ్చినవారిలో ముస్లింలు మినహా మిగతా మతాలవారికి.. హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవులకు ఈ చట్టం కింద మన పౌరసత్వం ఇస్తారు. దీనికి దరఖాస్తు ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుందని.. ఇందుకోసం ఒక వెబ్‌సైట్‌ను రూపొందించామని కేంద్ర హోం శాఖ అధికార ప్రతినిధి తెలిపారు. ఈ చట్టం కింద మన పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునేవారిని ఎలాంటి పత్రాలూ అడగబోమని ఆయన వెల్లడించారు. మతప్రాతిపదికన పౌరసత్వాన్ని ఇచ్చే ఈ వివాదాస్పద చట్టం 2019 డిసెంబరులో.. ఉభయ సభలతోపాటు, రాష్ట్రపతి ఆమోదం కూడా పొందిన సంగతి తెలిసిందే. అయితే, నిబంధనలు నోటిఫై చేయనందున ఇన్నాళ్లుగా అమల్లోకి రాలేదు. నిజానికి ఏదైనా చట్టం రాష్ట్రపతి ఆమోద ముద్ర పొందాక.. ఆరునెలల లోపే దానికి సంబంధించిన నిబంధనలను రూపొందించి విడుదల చేయాలని పార్లమెంటరీ వర్క్ మాన్యువల్ చెబుతోంది. అలా కాని పక్షంలో మరింత గడువు కావాలని సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని కోరాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే కేంద్ర హోం శాఖ 2020 నుంచి పొడిగింపులు కోరుతూ వస్తోంది. సోమవారం విడుదల చేసిన నిబంధనలు.. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లో మత మైనారిటీలుగా ఉన్నవారు మనదేశ పౌరసత్వాన్ని పొందడానికి ఉపకరిస్తాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఆయా దేశాల్లో నివసించే హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రిస్టియన్లకు





సీఏఏ అమల్లోకి రావడంతో భోపాల్‌లో బీజేపీ కార్యకర్తల సంబరాలు

మన రాజ్యాంగ నిర్మాతలు చేసిన వాగ్దానాన్ని ప్రధాని మోదీ నెరవేర్చారని కొనియాడారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందే ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చి తీరుతామని ఆయన ఇటీవలికాలంలో పలు సందర్భాల్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా.. ఒక వర్గాన్ని ఏకీకృతం చేసేందుకే సరిగ్గా లోక్‌సభ ఎన్నికలకు ముందు మోదీ సర్కారు ఈ ఉత్తర్వులు జారీ చేసిందని కాంగ్రెస్ సహా పలు పార్టీలు మండిపడ్డాయి. ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాల వెల్లడికి ఎస్‌బీఐకి మరింత గడువు ఇవ్వడానికి సుప్రీంకోర్టు తిరస్కరించడంతో.. పత్రికల్లో దానిపై పతాక శీర్షికల్లో వచ్చే వార్తలను ఆపడానికే మోదీ సర్కారు హుటాహుటిన సీఏఏ నిబంధనలను విడుదల చేసిందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్ ఆరోపించారు. నిబంధనలు నోటిఫై చేయడానికి తొమ్మిదిసార్లు పొడిగింపులు కోరి.. ఇప్పుడు సరిగ్గా ఎన్నికల ముందు విడుదల చేయడమంటే, అది ఎన్నికల్లో ఒక వర్గాన్ని.. ప్రత్యేకించి పశ్చిమబెంగాల్, అసోంలో ఒక వర్గాన్ని పోలరైజ్ చేయడం కోసమేనని జైరామ్ రమేశ్ దుయ్యబట్టారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ చట్టాన్ని.. మతపరంగా విభజించే చట్టంగా అభివర్ణించారు. తమ రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు కానీయబోమని స్పష్టం చేశారు. కాగా.. 2019లో ఉభయసభల ఆమోదం పొందాక ఈ చట్టాన్ని నిరసిస్తూ వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో, పోలీసు చర్యల్లో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో.. సోమవారం ఢిల్లీలోని షాహీన్ బాఘ్, జామియా తదితర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

కీలకాంశాలు

పాక్, అఫ్ఘాన్, బంగ్లాదేశ్ నుంచి.. 2014 డిసెంబరు 31కి ముందు ఇక్కడికి వలస వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం ఇచ్చే లక్ష్యంతో రూపొందించిన చట్టమిది. దీని ప్రకారం..

- అలా వచ్చి మన దేశ పౌరసత్వం కోరేవారు గడిచిన ఏడాది మొత్తం భారత్‌లో నివసించి ఉండాలి. గత పద్నాలుగేళ్లలో కనీసం ఐదేళ్ల ఇక్కడ గడిపి ఉండాలి. గతంలో ఈ వ్యవధి 11 సంవత్సరాలుగా ఉండేది.
- రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో పొందుపరచిన.. అసోం, మేఘాలయ, మిజోరాం, త్రిపురలోని గిరిజన ప్రాంతాలను ఈ చట్టంలో మినహాయించారు.
- ఏ భారతీయుడి పౌరసత్వాన్నీ ఈ చట్టం కింద తొలగించరు. పైన పేర్కొన్న మూడు దేశాల్లో మతపరమైన అణచివేతకు గురవుతూ.. భారత్‌కు తప్ప వేరే ఏ దేశానికీ వెళ్లే దిక్కులేని ముస్లిమేతరులకు మన పౌరసత్వం కల్పించడమే ఈ చట్టం లక్ష్యం.

లోకం తీరు



ముస్లిమేతర శరణార్థుల హర్షం

సీఏఏ చట్టాన్ని అమల్లోకి తెస్తూ నిబంధనలు విడుదల చేయడం పట్ల దీనివల్ల లబ్ధి పొందే ముస్లిమేతర శరణార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. ఇలా పాక్ నుంచి శరణార్థులుగా వచ్చి ఢిల్లీ, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో తలదాచుకుంటున్న 500 కుటుంబాలకు దీంతో భారత పౌరసత్వం లభించనుందని వారిలో ఒకరైన పాక్ హిందూ శరణార్థి ధరమ్ వీర్ సోలంకి అన్నారు. "నేను, నా కుటుంబం ఈ నిర్ణయం కోసమే దశాబ్దకాలానికి పైగా వేచిచూస్తున్నాం. ఎట్టకేలకు.. భారతీయులం అనిపించుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. 2013లో పాక్ నుంచి నా మాతృదేశానికి (భారత్‌కు) రావాలన్న నిర్ణయం తీసుకున్నందుకు ఎంతగానో ఆనందిస్తున్నా" అని సోలంకీ తెలిపారు. సీఏఏ అమలు తమకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుందని మరో శరణార్థి సోనాదాస్ అన్నారు. మరోవైపు.. బంగ్లాదేశ్ నుంచి ఎన్నో ఏళ్ల క్రితం పశ్చిమబెంగాల్‌కు వలస వచ్చిన మటువా తెగ హిందువులు కూడా సీఏఏ అమలుపై సంతోషం వెలిబుచ్చారు. ఈ వార్త వినగానే డప్పులు మోగిస్తూ వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు 30 లక్షల మంది ఉండే మటువాలు.. బెంగాల్‌లో 30 అసెంబ్లీ స్థానాల్లో ఫలితాలను తారుమారు చేయగలరు.

1414 మందికి పౌరసత్వం

ఈ చట్టం కింద.. పాక్, అఫ్గాన్, బంగ్లాదేశ్ నుంచి వలసవచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం ఇవ్వడానికి వీలుగా గత రెండేళ్లుగా 30 జిల్లాల మేజిస్ట్రేట్లకు, తొమ్మిది రాష్ట్రాల (గుజరాత్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, పంజాబ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర) హోం శాఖల కార్యదర్శులకు కేంద్రం అధికారాలు ఇచ్చింది. కేంద్ర హోం శాఖ వార్షిక నివేదిక 2021-22 ప్రకారం.. 2021 ఏప్రిల్ 1 నుంచి 2021 డిసెంబరు 31 దాకా ఆ మూడు దేశాలకు చెందిన 1414 మంది ముస్లిమేతరులకు భారత పౌరసత్వం ఇచ్చారు.

ప్రజలను రెచ్చగొట్టడానికే ఎన్నికల ముందు సీఏఏ

» ఎలక్షన్ బాండ్ల నుంచి దృష్టి మళ్లించడానికే...

» విపక్షాల విమర్శలు.. అసోంలో నిరసనలు

» కేరళలో అమలు చేయబోమని సీఎం ప్రకటన



న్యూఢిల్లీ, మార్చి 11: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) నిబంధనలను నోటిఫై చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విపక్షాలు తప్పుపట్టాయి. రాజకీయ కారణాలతోనే ఈ నిర్ణయాన్ని తీసుకొందని విమర్శించాయి. కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలను కావాలని రెచ్చగొట్టడానికే ఈ నోటిఫికేషన్ ఇచ్చిందని ఆరోపించారు. పార్లమెంటు ఆమోదించిన నాలుగేళ్లకు నోటిఫై ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నిబంధనలు వివక్షపూరితంగా ఉన్నాయని అనిపించినా, ఉన్న హక్కులను హరించేవిగా ఉన్నా తీవ్రంగా వ్యతిరేకిస్తామని చెప్పారు. సీఏఏ పశ్చిమ బెంగాల్‌తో పాటు, ఈశాన్య రాష్ట్రాలకు చాలా కీలకమని అంశమని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు ఎలాంటి ఆందోళనలు జరగాలని కోరుకోవడం లేదని చెప్పారు. ఎన్‌సీపీ (శరద్ పవార్) అధికార ప్రతినిధి క్లైడ్ క్రాస్టో ముంబైలో మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే మోదీ ప్రభుత్వం ఈ నోటిఫికేషన్ ఇచ్చిందని ఆరోపించారు. ముస్లింలను ద్వితీయ శ్రేణుల పౌరులుగా మార్చాలన్న గాడ్సే సిద్ధాంతాన్ని అమలు చేయడానికే ఈ నోటిఫికేషన్ ఇచ్చిందని హైదరాబాద్‌లో ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఉపాధి లేక లక్షలాది మంది దేశాన్ని విడిచి వెళ్లిపోతుంటే పక్క దేశాల వారికి పౌరసత్వం ఇస్తామనడం అర్థం లేని మాట అని అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు.

సీఏఏ.. అసోంపై ఢిల్లీ జరిపిన దాడి

అసోం నాయకులు సీఏఏను తీవ్రంగా వ్యతిరేకించారు. అస్సాంకు వలస వచ్చిన హిందువులు సహా, ఇతర ప్రాంతాలవారందర్నీ పంపించి వేయాలని గతంలో తాము ఆందోళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నోటిఫికేషన్ కారణంగా అస్సాంలో అక్రమంగా నివసిస్తున్న 15-20 లక్షల మంది బంగ్లాదేశీ హిందువులకు పౌరసత్వం వచ్చే ప్రమాదం ఉందని రైజోర్ దళ్ అధ్యక్షుడు అఖిల్ గొగోయ్ ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో ఉంటున్న 1.7 కోట్ల మంది హిందువులు అస్సాంకు వలస వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇది అస్సాంపై ఢిల్లీ జరిపిన దాడి అని విమర్శించారు. దాదాపు 30 సంఘాల ప్రతినిధులు సీఏఏ ప్రతులను దహనం చేశారు. సీఏఏ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధం అని ఆమ్నెస్టీ పేర్కొంది.

మహిళా సాధికారతలో.. కొత్త అధ్యాయం లిఖిస్తాం

ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన సంస్థలో డ్రోన్‌ను పరిశీలిస్తున్న మోదీ



మూడోసారీ విజయం మాదే: మోదీ

» దేశవ్యాప్తంగా రూ.లక్ష కోట్ల విలువైన హైవే ప్రాజెక్టులకు శంకుస్థాపన

» ఇందులో రూ.14 వేల కోట్లతో బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే

న్యూఢిల్లీ, మార్చి 11: తాను మూడోసారి ప్రధానిగా వచ్చాక మహిళా సాధికారతలో కొత్త అధ్యాయం లిఖిస్తామని ప్రధాని మోదీ అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. సోమవారం ఆయన రూ.లక్ష కోట్ల వ్యయంతో దేశవ్యాప్తంగా తలపెట్టిన హైవేల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అలాగే హరియాణా-ఢిల్లీ నడుమ విస్తరించిన ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించారు. 'సశక్త్ నారీ-వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రసంగించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు రుణాల కింద రూ.8 వేల కోట్లు విడుదల చేశారు. అలాగే ఆయా సంఘాలకు మూలధన మద్దతు నిధిగా రూ.2,000 కోట్లు పంపిణీ చేశారు. ఇప్పటివరకు మహిళల కోసం తన ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావించారు. 'మరుగుదొడ్లు లేకపోవడం.. శానిటరీ ప్యాడ్ల వినియోగం, కట్టెలు, బొగ్గు పొయ్యిలతో మహిళల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం.. వారికి బ్యాంకు ఖాతాల అవసరం గురించి మాట్లాడిన ప్రథమ ప్రధానిని నేనే. కాంగ్రెస్ తదితర పార్టీలు నన్ను హేళన చేశాయి. అవమానించాయి. నా ఇంట్లో, పొరుగిళ్లలో, గ్రామాల్లో చూశాక మహిళల కోసం పథకాలు రూపొందించాను. వివిధ ప్రభుత్వ స్కీంల కింద ఇప్పటివరకు రూ.8 లక్షల కోట్లను వారికి పంపిణీ చేశాం. కోటి మందికిపైగా మహిళలు లక్షాధికారులు (లఖ్‌పతీ దీదీ) అయ్యారు' అని వ్యాఖ్యానించారు. వ్యవసాయం, ఇతర అవసరాలకు ఉపయోగించేందుకు 'నమో డ్రోన్ దీదీ' పథకం కింద వెయ్యి మందికి డ్రోన్లను అందజేశారు. రూ.లక్షల కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు చేపట్టడం చూసి కాంగ్రెస్, దాని అహంకార ఇండీ కూటమి తట్టుకోలేకపోతున్నాయని మోదీ అన్నారు. వాటికి నిద్ర పట్టడం లేదన్నారు. 'పదేళ్లలో దేశం పరివర్తన చెందింది. అయినా వ్యతిరేకత దృష్టితోనే విపక్షాలు చూస్తున్నాయి. మీ (ప్రజలు) అందరికీ నా గురించి తెలుసు. చిన్న చిన్న కలలు కనను. నేనేది కోరుకున్నా భారీగా ఉంటుంది. శరవేగంగా జరిగిపోవాలి. 2047లోపు నా దేశం వికసిత్ భారత్‌గా ఆవిర్భవించడం చూడాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

లక్ష కోట్ల ప్రాజెక్టులు!

రూ.లక్ష కోట్ల విలువ చేసే 114 జాతీయ హైవే ప్రాజెక్టులకు ప్రధాని సోమవారం శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.14 వేల కోట్లతో తలపెట్టిన బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే కూడా ఉంది. హరియాణాలోని గురుగ్రామ్-ఢిల్లీ మధ్య ప్రయాణ దూరాన్ని బాగా తగ్గించే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేను ఆయన ప్రారంభించారు. దీని నిడివి 29 కిలోమీటర్లు. ఇందులో హరియాణాలో 18.9 కిమీ, 10.1 కిమీ ఢిల్లీలో ఉంది. దేశంలోని మొట్టమొదటి 8 లైన్ల జాతీయ రహదారి ఇది. దీనితో పాటు ఏపీలో రూ.2,950 కోట్ల వ్యయంతో 16వ నంబర్ జాతీయ రహదారిపై నిర్మించిన ఆనందపురం-పెందుర్తి-అనకాపల్లి రోడ్డును కూడా ఆయన ప్రారంభించారు.

గడువును పెంచం!



ఎన్నికల బాండ్ల వివరాలు మంగళవారం సాయంత్రంలోగా ఈసీకి ఇవ్వండి

» ఎస్‌బీఐకి సుప్రీం ధర్మాసనం ఆదేశం

» 'గడువు పొడిగింపు' పిటిషన్ కొట్టివేత

» మోదీ అసలు స్వరూపం బయటపడబోతోంది: రాహుల్


ఎస్‌బీఐ పిటిషన్‌పై విచారణ జరుపుతున్న ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం

న్యూఢిల్లీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్ బాండ్ల వివరాల వెల్లడికి సమయం కావాలంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. మంగళవారం (మార్చి 12) సాయంత్రంకల్లా ఆ వివరాలన్నింటినీ ఎన్నికల కమిషన్‌కు సమర్పించి తీరాల్సిందేనని.. ఎన్నికల కమిషన్ ఆ వివరాలను వచ్చే శుక్రవారం (మార్చి 15) సాయంత్రం 5 గంటలకల్లా తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఆదేశించింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను మార్చి 13లోగా ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలంటూ ఫిబ్రవరి 15న తాము ఇచ్చిన ఆదేశాలను పాటించకపోతే.. 'ఉద్దేశపూర్వక ఉల్లంఘన'గా భావించి ఎస్‌బీఐపై తగినచర్యలు చేపడతామని హెచ్చరించింది. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని ఫిబ్రవరి 15న సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. 2019 ఏప్రిల్ 12 నుంచి ఎన్నికల బాండ్లను కొన్నవారి వివరాలు, వాటి విలువ, వాటిని ఎవరు స్వీకరించారు? అనే వివరాలను మార్చి 6లోగా ఈసీకి తెలపాలని ఎస్‌బీఐకి.. మార్చి 13లోగా ఆ వివరాలను తన వెబ్‌సైట్‌లో పెట్టాలని ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఎస్‌బీఐ నిర్ణీత గడువులోపు ఆ వివరాలను ఈసీకి సమర్పించకపోగా.. అందుకు ఇచ్చిన గడువును జూన్ 30 దాకా పొడిగించాలని సుప్రీంను కోరింది. దీంతో ఎస్‌బీఐపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఎస్‌బీఐ తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. దాతలు, గ్రహీతలకు సంబంధించిన వివరాలు ఎస్‌బీఐ శాఖల్లోని రెండు చోట్ల ఉంచినందున.. వాటన్నింటినీ సేకరించి, సరిచూసుకోవడానికి మరింత సమయం కావాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. సరిచూసే ప్రక్రియ వద్దంటేగనక.. మూడువారాల్లో వివరాలు సమర్పించగలమన్నారు. ఇందుకు ధర్మాసనం.. అలా సరిపోల్చాలని తాము ఆదేశించలేదని గుర్తుచేసింది. కేవలం ఆ వివరాలను ఈసీకి ఇవ్వాలని చెప్పినట్టు వివరించింది. అంతేకాదు.. ఫిబ్రవరి 15నాటి తీర్పులో తాము ఇచ్చిన ఆదేశాల అమలుకు ఎస్‌బీఐ తీసుకున్న చర్యలు ఏంటని కూడా ధర్మాసనం నిలదీసింది. "గడిచిన 26 రోజుల్లో మీరు ఏమేం చర్యలు తీసుకున్నారు? మీరు దాఖలు చేసిన అప్లికేషన్‌లో ఆ వివరాలేవీ లేవు" అని ప్రశ్నించింది. దీనికి సాల్వే.. కోర్టు ఆదేశాల మేరకు బాండ్ల జారీని నిలిపివేసినట్టు తెలిపారు. తమ ఆదేశాల అమలుకు తీసుకున్న చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ ఛైర్మన్, ఎండీని ఆదేశించారు.

మోదీ విరాళాల వ్యాపారం..

ఎస్‌బీఐ వినతిని సుప్రీంకోర్టు తిరస్కరించడంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. మోదీ సర్కారు కుటిల తంత్రాల నుంచి ప్రజాస్వామ్యాన్ని సుప్రీంకోర్టు మరోసారి కాపాడిందని కొనియాడింది. "నరేంద్రమోదీ విరాళాల వ్యాపారం బయటపడబోతోంది" అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. "పగ్గాలు చేపట్టిన 100 రోజుల్లోగా.. స్విస్‌బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెనక్కి తెస్తామంటూ అధికారంలోకి వచ్చిన (మోదీ) సర్కారు.. సొంత బ్యాంకులో సమాచారాన్ని దాచడానికి ఆపసోపాలు పడింది" అని ఎద్దేవా చేశారు. ఎన్నికల బాండ్లు భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణంగా నిలవబోతున్నాయని.. అవినీతి పారిశ్రామికవేత్తలతో సర్కారు మిలాఖత్‌ను బయటపెట్టడం ద్వారా నరేంద్రమోదీ అసలు స్వరూపాన్ని దేశ ప్రజలకు చూపబోతున్నాయని రాహుల్ ట్వీట్ చేశారు.

సాయిబాబాకు ఊరట



న్యూఢిల్లీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మావోయిస్టులతో ఆయనకు సంబంధాలున్నాయన్న అభియోగాలను ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందంటూ ఇటీవల బాంబే హైకోర్టు నాగపూర్ బెంచ్ సాయిబాబాతోపాటు మరో ఐదుగురిని నిర్దోషులుగా విడుదల చేసింది. అయితే, హైకోర్టు తీర్పును మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీకోర్టులో సవాల్ చేసింది. హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని అభ్యర్థించింది. ఈ పిటిషన్‌పై సోమవారం ప్రాథమికంగా విచారణ జరిపిన సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును సమర్థించింది. అన్ని కోణాల్లోనూ పరిశీలించే హైకోర్టు తీర్పు చెప్పిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో సదరు తీర్పుపై స్టే ఇవ్వాల్సిన అవసరం లేదని మౌఖికంగా తేల్చి చెప్పింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌పై విచారణ చేస్తామని, నిర్ణీత సమయంలో దీనిని పరిశీలిస్తామని పేర్కొంది. ఈ నెల 5న బాంబే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై మహారాష్ట్ర వేసిన పిటిషన్‌ను సాధ్యమైనంత త్వరగా లిస్టింగ్ చేయాలన్న అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ సందర్భంగా రాజు స్పందిస్తూ ఈ కేసులో కొన్ని పత్రాలు దాఖలు చేయాల్సి ఉందని, ముఖ్యంగా ఉగ్రవాద నిరోధక చట్టం(ఉపా) కింద సాయిబాబాను విచారించేందుకు అనుమతి పొందిన పత్రాలను సమర్పించాల్సి ఉందని తెలిపారు. ధర్మాసనం జోక్యం చేసుకుని.. "చట్టం ఎప్పుడూ అమాయకుల పక్షానే ఉంటుంది. నిర్దోషిగా విడుదల ఆదేశాలు పొందాక.. వారి అమాయకత్వం మరింత బలపడుతుంది" అని వ్యాఖ్యానించింది.

అలాంటి క్రూరమైన వ్యాఖ్యలు ఎలా చేస్తారు?

» చిన్నారుల అశ్లీల వీడియోల వీక్షణ నేరం కాదన్న తీర్పుపై సుప్రీం ఆగ్రహం

చెన్నై, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చిన్నారుల అశ్లీల వీడియోలు(చైల్డ్ పోర్నోగ్రఫీ) డౌన్‌లోడ్ చేసుకోవడం, వాటిని వీక్షించడం తప్పు కాదని, మరొకరికి ఫార్వర్డ్ చేస్తేనే నేరమన్న మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఒక అదనపు న్యాయమూర్తి ఇలాంటి క్రూరమైన అభిప్రాయాన్ని ఎలా వ్యక్తం చేస్తారని నిలదీసింది. ఈ వ్యాఖ్యలను మూడు వారాల్లోగా ఉపసంహరించుకోవాలని సూచించింది. చెన్నైకి చెందిన హరీశ్(28) చిన్నారుల అశ్లీల వీడియోలు చూస్తున్నాడని గతంలో కేసు నమోదైంది. దీనిపై హరీశ్ మద్రాస్ హైకోర్టుకు వెళ్లగా.. అతని చర్య పోక్సో, ఐటీ చట్టాల కింద నేరం కాదని జడ్జి తీర్పునిచ్చారు. ఆ తీర్పును రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించింది.

కేంద్రం జోక్యంపై విచారిస్తాం వెంటనే లిస్టింగ్ చేయండి

ఎన్నికల కమిషనర్ల నియామకంపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 11: కేంద్ర ఎన్నికల సంఘానికి కొత్త సభ్యుల నియామకంలో కేంద్రం జోక్యాన్ని నివారించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు పరిశీలనకు స్వీకరించింది. గతంలో ఎప్పుడో దాఖలయిన ఈ పిటిషన్‌ను సత్వరం లిస్టింగ్ చేయాలని ఆదేశించింది. ఎన్నికల కమిషనర్లను నియమించే కమిటీ నుంచి సుప్రీంకోర్టు సీజేను మినహాయిస్తూ 2023లో కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు ప్రస్తుతం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా అరుణ్ గోయల్, గతంలో అనూప్ చంద్ర పాండేల రాజీనామాలతో రెండు ఎన్నికల కమిషనరు పోస్టులు ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గతంలో తాను వేసిన పిటిషన్ విషయాన్ని కాంగ్రెస్ నేత జయ ఠాకూర్ కోర్టు దృష్టికి తెచ్చారు. తమపిటిషన్ సత్వరం లిస్ట్ అయ్యేలా చూడాలని ఆమె తరఫున సీనియరు న్యాయవాదులు వికాస్ సింగ్, వరుణ్ ఠాకూర్ కోరగా, 'మెయిల్ చేయండి.. మేం చూస్తాం' అని జస్టిస్ డీవై చంద్రచూడ్ బెంచ్ తెలిపింది.

కమిషనర్ల నియామకంపై కమిటీ భేటీ ఒక రోజు ముందే!

న్యూఢిల్లీ, మార్చి 11: ఎన్నికల సంఘంలో ఖాళీగా ఉన్న ఇద్దరు కమిషనర్ల నియామకంపై ప్రధాని మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల కమిటీ సమావేశం ఒక రోజు ముందుకు జరిగింది. తొలుత 15న సాయంత్రం 6 గంటలకు కమిటీ భేటీ ఉంటుందని ప్రకటించారు. ఇప్పుడు దానిని గురువారం (ఈ నెల 14న) నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు ప్రధాని, కేంద్ర మంత్రి, లోక్ సభలో ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ సమావేశమై.. ఎన్నికల కమిషనర్ల నియామకంపై రాష్ట్రపతికి పేర్లను సిఫారసు చేయనున్నట్లు తెలుస్తోంది. తరువాతి కొద్దిసేపటికి రాష్ట్రపతి నిర్ణయం వెలువడనుందని చెబుతున్నారు. లేదంటే మరుసటి రోజు జరిగే వీలుందని పేర్కొంటున్నారు. సమావేశం మార్పుపై కమిటీలోని సభ్యులకు కేంద్ర న్యాయ మంత్రిత్వ సమాచారం చేరవేసింది. కాగా, గత శనివారం ఒక ఈసీ నియామకానికి సంబంధించి భేటీపై కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఇంతలో శుక్రవారం కమిషనర్ గోయల్ రాజీనామా చేశారు. ఇప్పుడు ఇద్దరు కమిషనర్లను ఒకేసారి నియమించనున్నారు.

ఈడీపై దాడి కేసు సీబీఐకి ఇవ్వడం సబబే

న్యూఢిల్లీ, మార్చి 11: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో ఈడీ అధికారులపై జరిగిన దాడి ఘటనపై దర్యాప్తును సీబీఐకి అప్పగించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ విషయమై కలకత్తా హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. జనవరి 5న జరిగిన ఈ దాడిపై దర్యాప్తును రాష్ట్ర సీఐడీకి బదులు కేంద్రం ఆధ్వర్యంలోని సీబీఐకి అప్పగించాలని ఈ నెల 5న హైకోర్టు ఆదేశించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అదే రోజున అప్పీలు చేయగా, అత్యవసర విచారణ జరపడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. సోమవారం జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం కేసును చేపట్టింది. దాడికి పాల్పడ్డ టీఎంసీ నేత షాజహాన్‌ను ఎందుకు వెంటనే అరెస్టు చేయలేదని ప్రశ్నించింది.



వంశధార నదీ తీరంలో శ్రీముఖలింగేశ్వరుడి చక్రతీర్థస్నాన వేడుకకు తరలివచ్చిన భక్తులు

వైభవంగా శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానం

శ్రీముఖలింగం, మార్చి 11 : శివరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీకాకుళం జిల్లా శ్రీముఖలింగేశ్వర చక్రతీర్థ స్నానం వైభవంగా సాగింది. పార్వతీ సమేతంగా శ్రీముఖలింగేశ్వరుడు ఎల్.ఎన్.పేట మిరియాపల్లి రేవులో చక్రతీర్థ స్నానమాచరించాడు. ఈ వేడుకను తిలకించేందుకు జిల్లావాసులతో పాటు, ఉత్తరాంధ్ర, ఒడిశా నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



అశ్వవాహనంపై విహరిస్తున్న మల్లికార్జునస్వామి, భ్రమరాంబిక అమ్మవారు

శ్రీశైలంలో ముగిసిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం, మార్చి 11: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పంచాహ్నిక దీక్షతో 11 రోజులు నిర్వహించిన ఈ బ్రహ్మోత్సవాల చివరి రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం నిర్వహించారు.

పోలీసు కుటుంబాన్నీ వదలని ఖాకీలు

- 498 కేసులో పేర్లు తొలగించేందుకు రూ.25 వేలు డిమాండ్
- హెడ్‌కానిస్టేబుల్ కొడుకు ఫిర్యాదుతో ఏసీబీ దాడి
- ఎస్ఐ, డ్రైవర్, రైటర్ పరుగో.. పరుగు!

నరసాపురం, మార్చి 11: కుటుంబ తగాదా కేసులో పేర్లు తొలగించేందుకు ఓ హెడ్ కానిస్టేబుల్ కుటుంబాన్ని లంచం డిమాండ్ చేసిన నర్సాపురం పోలీసులు ఏసీబీకి దొరికిపోయారు. ఈ కేసులో ఎస్ఐ, రైటర్‌ను ఏసీబీ అరెస్టు చేయగా, డ్రైవర్ పరారీలో ఉన్నాడు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి సోమవారం ఏలూరు ఏసీబీ డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు విజయసాగర్‌పై నరసాపురం టౌన్ స్టేషన్‌లో 498 కేసు నమోదైంది. తనపై, తన కుటుంబ సభ్యులపై తప్పుడు కేసు నమోదు చేశారని, న్యాయం చేయాలంటూ విజయసాగర్ పోలీసుల్ని వేడుకున్నాడు. కేసు నుంచి తన కుటుంబ సభ్యుల పేర్లు తొలగించాలని కోరాడు. ఇందుకోసం నరసాపురం ఎస్సై ప్రసాద్, రైటర్ నాగేశ్వరరావు రూ.25వేలు డిమాండ్ చేశారు. దీంతో విజయసాగర్ ఏలూరు ఏసీబీని ఆశ్రయించాడు. కేసును విచారించిన ఏసీబీ పోలీసులు అతనికి రూ.25వేలు ఇచ్చి పోలీస్‌స్టేషన్ వద్ద మాటేశారు. ఎస్సై నేరుగా లంచం తీసుకోకుండా జీపు డ్రైవర్ ప్రసాద్‌కు ఆ మొత్తాన్ని ఇవ్వమన్నాడు. డ్రైవర్ సొమ్ము తీసుకుని జీపులో పెట్టగానే, అక్కడే మాటేసిన పోలీసులు దాడి చేశారు. దీంతో డ్రైవర్ ఉలిక్కిపడ్డ పరుగులు తీయగా, స్టేషన్‌లో ఉన్న ఎస్సై, రైటర్‌లు కూడా ఏసీబీ పోలీసులకు చిక్కకుండా పరుగులు తీశారు. ఏసీబీ పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. సొమ్ము తీసుకున్న జీపు డ్రైవర్ దొరకలేదు.

అగ్ని... ఓ దివ్యాస్త్రం

- డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలకు అభినందనలు: పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): దేశానికి అగ్ని - 5 క్షిపణి రూపంలో దివ్యాస్త్రాన్ని అందించిన డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణి పని తీరు తెలుసుకుంటే దేశం గర్వించదగిన ఆవిష్కరణగా చెప్పక తప్పదు. ఐదు వేల కిలోమీటర్ల సుదూర లక్ష్యాలను సునాయాసంగా ఈ అస్త్రం ఛేదించడం మన దేశ రక్షణ వ్యవస్థకు అనితరమైన బలాన్ని అందిస్తుందనడంలో సందేహం లేదు. ఇప్పటి వరకూ అమెరికా, ఇంగ్లాండ్, రష్యా, ఫ్రాన్స్, చైనా మాత్రమే ఇటువంటి ఆయుధ వ్యవస్థ కలిగి ఉండగా ఇప్పుడు భారత్ వీటి సరసన చేరింది. ఇది మన శాస్త్రవేత్తల నైపుణ్యానికి నిదర్శనం. అంతరిక్ష ప్రయోగాల్లో అనేక విజయాలు సొంత చేసుకుంటున్న మన దేశం ఇప్పుడు క్షిపణి పరిజ్ఞానంలో మరో మెట్టు పైకి వెళ్లింది. దీని వెనుక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ, ప్రధాని మోదీ దార్శనికత, అవిరాళ కృషి దాగి ఉన్నాయి. ఈ విజయాన్ని దేశ ప్రజలకు అందించిన శాస్త్రవేత్తలకు అభినందనలు' అని పవన్ అన్నారు.

వెలిగొండపై సీఎం బూటకపు ప్రచారం: లంకా దినకర్

పెద్దదోర్నాల, మార్చి 11: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుపై సీఎం చేస్తున్న బూటకపు ప్రచారాన్ని ప్రజలకు తెలియజేసి రానున్న ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. ప్రాజెక్టు వాస్తవ స్థితిని పరిశీలించాలంటూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశారు. లంకా దినకర్ నేతృత్వంలోని ఆ బృందం సోమవారం ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలంలోని కొత్తూరు వద్ద నిర్మిస్తున్న వెలిగొండ ప్రాజెక్టులో కీలకమైన రెండవ సొరంగాన్ని, అప్రోచ్ కాలువను, పైలాన్‌ను పరిశీలించింది. ఆయన మాట్లాడుతూ... 'పూర్తికాని ప్రాజెక్టును సీఎం ఎలా ప్రారంభిస్తారు? ఇది ప్రజలను మోసం చేయడమే. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన జగన్ పెండింగులో ఉన్న ప్రాజెక్టును పూర్తిచేశామని, జాతికి అంకితం చేశామని పేర్కొనడం హాస్యాస్పదం. ప్రాజెక్టు ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.1,800ల కోట్లు ఇవ్వలేదు. పునరావాసం కల్పించలేదు. ప్రాజెక్టులో ఎన్నో చేయాల్సిన పనులు ఉన్నాయి. ఐదేళ్ల కాలంలో ప్రాజెక్టుకు రూ.1,000 కోట్లు కూడా కేటాయించలేదు. నిర్వాసితులను కలిసి ప్రభుత్వం చెప్పే మాయ మాటలను తెలియజేస్తాం' అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిరసనగుండ్ల శ్రీనివాసులు, కల్యాణచక్రవర్తి, జాతీయ కౌన్సిల్ సభ్యురాలు శాసనాల సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఆఫీసుకు వైసీపీ నేత తాళం

- తాగునీటి బిల్లులు ఇవ్వట్లేదని ఉపసర్పంచ్ ఆగ్రహం



వాల్మీకిపురం, మార్చి 11: తాగునీటి సరఫరా బిల్లులు చెల్లించలేదంటూ అధికార వైసీపీ నాయకుడే ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామానికి చెందిన ఉపసర్పంచ్, వైసీపీ నాయకుడు ద్వారకానాథరెడ్డి సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి చేరుకుని తనకు రావాల్సిన తాగునీటి సరఫరా బిల్లుల విషయమై అధికారులతో చర్చించారు. బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో అధికారులు సరిగ్గా బదులివ్వలేదు. దాంతో సిబ్బందిని బయటకు పంపేసిన ద్వారకానాథ రెడ్డి కార్యాలయానికి తాళం వేశారు. తాను 2020 నుంచి చింతపర్తి, మద్దెల చెరువుపల్లెలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశానని, అయితే తనకు రావాల్సిన రూ.3 లక్షల బిల్లులను చెల్లించలేదని ద్వారకానాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత వైసీపీ నాయకులు రంగంలోకి దిగి నాలుగు రోజు ల్లో బిల్లులు చెల్లించే చూస్తామని హామీ ఇవ్వడంతో ఆయన తన నిరసన విరమించారు.

చార్జీలు పెరగవు

గృహ విద్యుత్తు టారిఫ్ మామూలే..

- రైల్వేకు యూనిట్‌కు రూ.1 పెంపు
- కానీ, ఆదాయ అంచనా, టారిఫ్‌కు మధ్య రూ.13,624 కోట్ల వ్యత్యాసం
- 2024-25 టారిఫ్ ప్రకటించిన ఈఆర్‌సీ
- ట్రూఅప్, వ్యత్యాసంపై వ్యూహాత్మకం.. డిస్కమ్‌లు అడగలేదన్న చైర్మన్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వార్షిక ఆదాయ వ్యయ నివేదిక(ఏఆర్‌ఆర్) అంతా అంచనాలేనని.. వాస్తవిక లెక్కలు కాదని ఏపీ విద్యుత్తు నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) స్పష్టం చేసింది. 2024-25 వార్షిక ఆదాయ వ్యయ నివేదికలో భాగంగా గృహ విద్యుత్తు చార్జీలలో మార్పు లేదని పేర్కొంది. అయితే, ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీలు ఇకపై ఉండబోవన్న గ్యారెంటీ మాత్రం ఇవ్వలేదు. సోమవారం విజయవాడలో ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి.. 2024-25 విద్యుత్తు టారిఫ్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఏఆర్‌ఆర్ వాస్తవిక నివేదిక కాదన్నారు. ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్ మూడు పంపిణీ సంస్థలూ ఏఆర్‌ఆర్‌లో రూ.56,573.03 కోట్ల మేర ఆదాయం ఉంటుందని ప్రతిపాదించాయన్నారు. దీనిలో రూ.71.22 కోట్లను కుదించి.. రూ.56501.81 కోట్లకు ఆమోదం తెలిపామన్నారు. ఆదాయ అంచనా, టారిఫ్‌కు మధ్య వ్యత్యాసం రూ.13,624.67 కోట్లు ఉన్నట్టు డిస్కమ్‌లు ప్రతిపాదించాయని వివరించారు. వినియోదారుల టారిఫ్ రాయితీలతో కలిపి ఆదాయంలోని వ్యత్యాసం రూ.15,299.18 కోట్లుగా ఉందని కమిషన్ గుర్తించిందన్నారు. అదే సమయంలో డిస్కమ్‌ల ప్రతిపాదనలకు, వాస్తవ పరిశీలనకు మధ్య రూ.1,674.51 కోట్లు తేడా ఉన్నట్టు కమిషన్ గుర్తించిందని పేర్కొన్నారు. ఈ రూ.15,299 కోట్ల లోటును ఎలా భర్తీ చేసుకుంటాయో డిస్కమ్‌లు వెల్లడించలేదన్నారు. ఈ లోటును ట్రూఅప్ చార్జీల పేరుతో వినియోగదారులపై పడుతుందేమోనని ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయని పేర్కొన్నారు. అయితే.. ఏఆర్‌ఆర్‌లను సమర్పించే నాటికి డిస్కమ్‌ల నుంచి ఎలాంటి ప్రతిపాదనలు లేనందున.. ఇంధన సర్దుబాటుకు గానీ, ట్రూఅప్ చార్జీలకుగానీ తాము అనుమతించేది లేదన్నారు. 2024-25లో విద్యుత్తు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నేరుగా జమచేసే సబ్సిడీ మొత్తం రూ.13,589.18 కోట్లుగా ఉందని, ఈ మొత్తాన్ని సకాలంలో చెల్లిస్తామని ప్రభుత్వం లేఖ రాసినట్టు చైర్మన్ తెలిపారు. ఈ మొత్తం సకాలంలో చెల్లించకపోతే వడ్డీ వసూలు చేస్తామన్నారు. రైల్వే శాఖకు ప్రస్తుతం యూనిట్‌కు వసూలు చేస్తున్న విద్యుత్తు టారిఫ్ రూ.5.50 నుంచి 6.50కు పెంచాలని నిర్ణయించినట్టు చెప్పారు. క్యాప్టివ్ విద్యుత్తు ఉత్పత్తిదారులకు ఉదయం పూటమాత్రమే గ్రిడ్ చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. విద్యుత్తు వాహనాల చార్జింగ్ పాయింట్ల టారిఫ్‌లో మార్పులు లేవన్నారు.

బిల్లులు పెరుగుతాయ్!

సర్దుబాటు పేరుతో వినియోగదారులపై భారం

- పెండింగ్‌లో రూ.7200 కోట్ల ట్రూఅప్ చార్జీలు
- ఆదాయ, వ్యయ వ్యత్యాసం రూ.15,299 కోట్లు
- పరిష్కారం చూపని డిస్కమ్‌లు
- విద్యుత్ చార్జీలు పెంచలేదంటూనే ఈ మొత్తాన్ని బిల్లుల్లో చేర్చే వ్యూహం
- ఎన్నికల తర్వాత బాదుడే బాదుడు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విజయవాడలో సోమవారం ఏపీ విద్యుత్తు నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ).. వార్షిక ఆదాయ వ్యయ నివేదిక(ఏఆర్‌ఆర్) ప్రతిపాదనలు వెల్లడించింది. విద్యుత్తు చార్జీలను పైసా కూడా పెంచలేదు. కానీ, పరోక్షంగా రూ.వేల కోట్ల బాదుడుపై మాత్రం సమాధానం చెప్పకుండా మౌనం వహించింది. దీంతో వినియోగదారుల్లో కొత్త భయాలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఈఆర్‌సీ వద్ద పెండింగులో ఉన్న రూ.7200 కోట్ల ట్రూఅప్‌తో పాటు, గతేడాది ఏర్పడిన లోటు రూ.15,299 కోట్లు వెరసి రూ.22,499 కోట్ల భారం తమపై ఉందని డిస్కమ్‌లు పేర్కొన్నాయి. సహజంగా ఇలాంటి సందర్భాల్లో అవి పరిష్కార మార్గాలను కూడా పేర్కొంటాయి. కానీ, ఈ దఫా ఎన్నికల నేపథ్యంలో పరిష్కార మార్గాలను ప్రస్తావించలేదు. అంటే, ఎన్నికల వరకు వేచి చూసి.. తర్వాత చెలరేగి పోవడం, నెలనెలా విద్యుత్తు బిల్లుల్లో చాప కింద నీరులా వాటిని చేర్చేసి వసూలు చేయడం ఖాయమనే భయం వినియోగదారుల్లో నెలకొంది. దీనిపై ఇటు ప్రజాసంఘాలు, అటు వినియోగదారులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల వ్యూహం?

2022-23వ సంవత్సరం ఆదాయ, వ్యయ వ్యత్యాసం రూ.7200 కోట్లకు సంబంధించి ట్రూఅప్‌కు అవకాశం ఇవ్వాలంటూ ఏపీఈఆర్‌సీకి డిస్కమ్‌లు ప్రతిపాదనలు పంపాయి. వీటిపై ఈఆర్‌సీ నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికే వినియోగదారులపై భారం వేసినందున ఈ రూ.7200 కోట్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత నెలకొంటుందన్న భయం ప్రభుత్వ వర్గాల్లో ఉంది. దీంతో, డిస్కమ్‌లు పంపిన ఈ ప్రతిపాదనలను అమలు చేయాలంటూ ప్రభుత్వంపై ఈఆర్‌సీ ఒత్తిడి చేయలేదు. అదేవిధంగా డిస్కమ్‌లు ఈఆర్‌సీకి సమర్పించిన 2024-25 వార్షిక ఆదాయ వ్యయ నివేదికలలో రూ.15,299 కోట్లు లోటు ఉన్నట్లుగా తేలింది. ఈ లోటును ఎలా పూడ్చుకుంటాయో డిస్కమ్‌లు వివరించలేదు. సహజంగా లోటు భర్తీపై డిస్కమ్‌లు ఈఆర్‌సీకి తమ ప్రణాళికలను వివరించాలి. కానీ, దీనిని లోటుగా చూపిస్తూనే డిస్కమ్‌లు పరిష్కారం చూపకుండా వదిలేశాయి. ఈ పద్దుపై ఈఆర్‌సీ ఖచ్చితమైన నిర్ణయం తీసుకోలేదు. ప్రణాళికలు ఇవ్వాలని డిస్కమ్‌లను కూడా కోరలేదు. దీంతో, దీనిని నష్టాల ఖాతాలోకి వేస్తారా? ఈ నష్టాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పిస్తారా? అనే చర్చ సాగుతోంది. అయితే, వినియోగదారులు, విద్యుత్తు రంగ నిపుణులలో మాత్రం రూ.15,299 కోట్ల భారం ట్రూఅప్ చార్జీల కింద వసూలు చేసుకునేందుకు ఈఆర్‌సీ ఆమోదం తెలుపుతుందనే భయం వెంటాడుతోంది. మొత్తంగా ఏఆర్‌ఆర్ ప్రకటనల్లో చార్జీలకు సంబంధించి ఎలాంటి మార్పులు, చేర్పులు ఉండటం లేదు. నెలనెలా విద్యుత్ బిల్లులు మాత్రం మోత మోగుతుండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్త మవుతోంది.

ఏం జరుగుతోంది?

గృహ విద్యుత్తు చార్జీలు పెంచకుండానే గత కొన్నేళ్లుగా ఏపీఈఆర్‌సీ.. ఏఆర్‌ఆర్‌ను విడుదల చేస్తోంది. అంతేకాదు, గత ఏడాది తరహాలో యథాతథంగా చార్జీలు కొనసాగుతాయని ప్రకటిస్తోంది. కానీ, నెలవారీ బిల్లును చూస్తే ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట మోతమోగుతోంది. విద్యుత్తు చార్జీలను పెంచలేదంటూ ఈఆర్‌సీ ప్రకటన చేశాక.. ఈ సర్దుబాటు చార్జీల బాదుడేంటని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేయడం గడచిన ఐదేళ్లుగా కనిపిస్తూనే ఉంది. ఇక, ఈ ఏడాది ప్రకటించిన వార్షిక టారిఫ్‌లో రైల్వేలకు యూనిట్ రూ.5.50 నుంచి రూ.6.50కు పెంచడం మినహా ఎలాంటి మార్పులు కనిపించలేదు. అయితే, ఎన్నికలకు ముందు అన్ని ధరల తరహాలోనే విద్యుత్తు చార్జీల విషయంలోనూ ఇలా వ్యవహరించి ఉంటారని వినియోగదారులు భావిస్తున్నారు. కానీ, ఎన్నికల తర్వాత ట్రూఅప్ చార్జీల మోత ఒక్కసారిగా మోపే అవకాశం ఉందని ప్రజా సంఘాలు, విద్యుత్తు రంగ నిపుణులు భావిస్తున్నారు.

వివేకా హత్య కేసులో..శివశంకర్‌రెడ్డికి బెయిల్

- సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ఆంధ్రలో అడుగుపెట్టొద్దు
- ప్రతివారం హైదరాబాద్ సీసీఎస్‌లో రిపోర్ట్ చేయాలి
- పాస్‌పోర్ట్ అప్పగించాలి.. తెలంగాణ హైకోర్టు షరతులు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక నిందితుడు (ఏ-5) దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అధిక సాక్షులున్న ఆంధ్ర రాష్ట్రంలోకి సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ప్రవేశించరాదని స్పష్టం చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని.. ప్రతి సోమవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. పిటిషనర్ సీబీఐ కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని.. దర్యాప్తునకు సహకరించాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం ఆదేశాలిచ్చారు. సీబీఐ, వివేకా కుమార్తె సునీతారెడ్డి తరఫు న్యాయవాదులు అనిల్ తన్వర్, టి.స్వేచ్ఛ వాదనలు వినిపిస్తూ.. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి (ఏ-8)కి, సీఎం జగన్‌కు శివశంకర్‌రెడ్డి అత్యంత సన్నిహితుడని.. ఆయనకు బెయిల్ ఇస్తే ఆధారాలను తారుమారు చేస్తారని.. సాక్షులంతా ఏపీకి చెందిన వారే కాబట్టి వారిని భయభ్రాంతులకు గురిచేస్తారని తెలిపారు. ఆయన గతంలో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను సీబీఐ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు సైతం కొట్టివేశాయని గుర్తుచేశారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తే సీబీఐ లేదా సునీతారెడ్డి ఆయన బెయిల్ రద్దుచేయాలని కోరవచ్చంటూ విచారణను ముగించింది.

మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు ఊరట

- జైలు శిక్ష సస్పెండ్ చేస్తూ టీ-హైకోర్టు ఉత్తర్వులు. ఎన్నికల పోటీకి లైన్‌క్లియర్!

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేసిన కేసులో ఐదేళ్ల జైలుశిక్ష పడిన మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు తెలంగాణ హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఆమెకు సీబీఐ కోర్టు విధించిన జైలుశిక్షను సస్పెండ్ చేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం తాజాగా మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. ఈ జైలుశిక్షపై హైకోర్టు 2022లోనే స్టే విధించింది. అయితే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీచేస్తున్నానని.. ట్రయల్ కోర్టు విధించిన జైలుశిక్షను సస్పెండ్ చేయాలని.. లేనిపక్షంలో ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8 ప్రకారం తనపై అనర్హత వేటు పడుతుందని గీత మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ట్రయల్ కోర్టు విధించిన శిక్షను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రధాన పిటిషన్లపై విచారణను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేసింది.

15న విశాఖకు రేవంత్‌రెడ్డి

- ఉక్కు కార్మికుల దీక్షకు సంఘీభావం తెలపనున్న తెలంగాణ సీఎం

కూర్మన్నపాలెం/ఉక్కునగరం (విశాఖపట్నం), మార్చి 27: విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను నిరసిస్తూ మూడేళ్లుగా కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలపడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 15వ తేదీన కూర్మన్నపాలెం విచ్చేస్తున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జే.అయోధ్యరామ్ తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పాల్గొన్న బ్లాస్ట్ ఫర్నేస్ కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తమకు మద్దతు పలికేందుకు పక్క రాష్ట్ర సీఎం రావడం శుభపరిణామమన్నారు. కాగా, ఉక్కు టౌన్‌షిప్‌లోని తృష్ణా మైదానంలో ఈ నెల 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించనుంది.

కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేయలేదు:షర్మిల

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధికారికంగా ప్రకటించలేదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'కొందరు తామే అభ్యర్థులమని నియోజకవర్గాల్లో ప్రచారం చేసుకుంటున్నారని మా దృష్టికి వచ్చింది. అలా చెప్పుకుంటున్న నేతలపై చర్యలు తీసుకుంటాం. వారిని అనర్హులుగా ప్రకటిస్తాం' అని షర్మిలరెడ్డి హెచ్చరించారు.

ఉద్యానశాఖ ఏడీలకు పదోన్నతులు

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ఉద్యానశాఖలో 9 మంది అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా తాజాగా పదోన్నతి కల్పించారు. 2023-24 ప్యానల్ సంవత్సరం కింద పదోన్నతులు కల్పించి, తాత్కాలిక పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందుకు సంబంధించిన గెజిట్ ఉత్తర్వులు సోమవారం విడుదలయ్యాయి. కాగా రాష్ట్రంలో బాపట్ల, కడప, నెల్లూరు, కృష్ణా జిల్లాల్లో 24 మండలాలకు ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కూలీలపైకి దూసుకెళ్లిన రైలు

- ఇద్దరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు
- ట్రాక్‌పై మరమ్మతులు చేస్తుండగా ఘటన
- కర్నూలు జిల్లా రాంపల్లిలో ఘోరం



మృతులు కిష్టన్న, ఓబులేసు (ఫైల్)

మద్దికెర/తుగ్గలి, మార్చి 11: రైల్వే ట్రాక్‌పై మరమ్మతుల పనులు చేస్తున్న దినసరి కూలీలపై రైలు దూసుకురావడంతో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరొకరు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని రాంపల్లిలో జరిగిందీ ఘోరం. రాంపల్లి గ్రామానికి చెందిన బోయ కిష్టన్న(64), ఓబులేసు(42) కొప్పుల కాశీలతో పాటు మరికొందరు మద్దికెర-తుగ్గలి మధ్య రైల్వేట్రాక్‌పై సోమవారం మధ్యాహ్నం పనులు చేస్తుండగా మొదటి లైనులో గూడ్స్ వెళ్లింది. ఆ శబ్దానికి రెండో లైనులో రైలు వస్తున్న విషయాన్ని వీరు గమనించలేకపోయారు. గుంతకల్లు నుంచి డోన్‌కు వెళ్తున్న రైలు వారిపై నుంచి దూసుకెళ్లింది. దీంతో కిష్టన్న, ఓబులేసు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి కాలు విరిగిపోవడంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. సీఆర్పీఎఫ్ డీఎస్పీ మురళీకృష్ణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. బయటి కూలీలతో ట్రాక్ మరమ్మతులు చేయిస్తున్న సమయంలో రైళ్ల రాకపోకలపై అప్రమత్తం చేసేందుకు రైల్వే ఉద్యోగులు ఎవరూ అక్కడ లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు.

జగన్ రాజధాన్నే కాదు... రాష్ట్రాన్నీ నాశనం చేశాడు

- మరో 64 రోజులు భరించండి చంద్రబాబు సీఎం అవుతారు
- అమరావతికి బంగారు భవిష్యత్ వస్తుంది: రఘురామరాజు
- తుళ్లూరు శిబిరంలో రైతులకు మద్దతు ప్రకటించిన ఎంపీ



రఘురామరాజుకు కష్టాలు చెప్పి విలపిస్తున్న రాజధాని మహిళ

తుళ్లూరు, మార్చి 11: 'మరో 64 రోజులు కష్టాలను భరాయించండి. చంద్రబాబు సీఎం అవుతారు. అమరావతి రైతులకు బంగారు భవిష్యత్ వస్తుంది' అని ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. సోమవారం తుళ్లూరు రైతు ధర్నా శిబిరానికి ఆయన వచ్చి రైతులకు, మహిళలకు సంఘీభావం తెలిపారు. ఎప్పటి నుంచో అమరావతి రైతులను కలవాలని అనుకున్నానని అన్నారు. 'మీ పరిపాలన ప్రజలకు నచ్చడం లేదు. మనం సేవ చేసే దృక్పథంతో ఉండాలి' అని సీఎం జగన్‌రెడ్డికి చెప్పాను. అది ఆయనకు నచ్చలేదు. నాపై అక్రమ కేసులు బనాయించి నన్ను పోలీసుల చేత కొట్టించాడు. 4 సంవత్సరాలు రాష్ట్రానికి రానివ్వలేదు. అందుకే మిమ్మల్ని కలవలేకపోయా. ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి వెసులుబాటు చేసుకున్నా' అని రైతులతో రఘురామరాజు అన్నారు. సత్కార శిబిరంలో రైతు నాయకులు, రైతులను, రైతు కూలీలను, మహిళలను రఘురామకృష్ణరాజు పేరు పేరున పరిచయం చేసుకొని పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బర్మా, ఆఫ్రికా వంటి దేశాలలో పోరాటలు సుదీర్ఘంగా జరిగిన సందర్భాలున్నాయన్నారు. కానీ అమరావతి రైతుల పోరాటం అంతకన్నా సుదీర్ఘమైనదన్నారు. సీఎం జగన్‌రెడ్డి నియంత పాలనపై మొట్ట మొదట పోరాటం మొదలు పెట్టింది అమరావతి ధీర మహిళలేనని అన్నారు. అమరావతినే కాదు రాష్ట్రాన్నే జగన్‌రెడ్డి నాశనం చేశాడన్నారు. వందకు వంద శాతం వైసీపీ ప్రభుత్వం కుప్పకూలుతుందన్నారు. తనకు టీడీపీ, జనసేన, బీజేపీలతో సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. ఆయా పార్టీలు తనకు టికెట్ రిజర్వు చేసి ఉంచాయని రఘురామ ధీమా వ్యక్తం చేశారు.

ఈహెచ్‌ఎస్‌లో అందని వైద్యం

- ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు
- ఆస్పత్రులకు డబ్బు చెల్లించకపోవడమే కారణం: బొప్పరాజు

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీం(ఈహెచ్‌ఎస్)ను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈహెచ్‌ఎస్ ద్వారా సరైన చికిత్సలు అందాలంటే నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలకు ప్రభుత్వం సకాలంలో డబ్బులు చెల్లించాలన్నారు. ఈహెచ్‌ఎస్ కోసం ఉద్యోగులు, పెన్షనర్లు నెల వారీ చందా చెల్లిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని మంత్రివర్గ ఉప సంఘం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. హెల్త్ కార్డులపై సీఈవో వద్ద సోమవారం జరిగిన సమావేశంలో బొప్పరాజు మాట్లాడుతూ ఈహెచ్‌ఎస్ అమలుపై సీఎం సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయాలని, జిల్లాస్థాయిలో మూడు నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేయాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ గడువు పొడిగించాలని కోరారు. ఈ సమావేశంలో రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రమేష్‌కుమార్, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, క్లాస్ ఫోర్ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లయ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'పౌరసత్వ' ఉపద్రవం

ఈ సార్వత్రక ఎన్నికలకు ముందే 'పౌరసత్వ సవరణచట్టం–2019'ని అమలులోకి తీసుకువస్తామని హోంమంత్రి అమిత్‌షా నెలక్రితమే చెప్పారు. తదనుగుణంగానే, నాలుగేళ్ళనాటి ఈ చట్టాన్ని ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటానికి కాస్తంత ముందు ఆచరణలోకి తెచ్చారు. అసలు ఆ చట్టం రూపకల్పనలోనే రాజకీయ లక్ష్యాలు, దురుద్దేశాలున్నాయని విపక్షాలు భావిస్తున్నప్పుడు, వాటిని మరింత బాగా నెరవేర్చుకొనే సమయాన్ని అధికారపక్షం ఎంచుకుంటే ఎందుకంత ఆగ్రహిస్తున్నాయో అర్థంకాదు. గత సార్వత్రక ఎన్నికల్లో ఒక ప్రధాన అస్త్రంగా ఉపకరించిన అంశాన్ని నాలుగేళ్ళుగా దాచివుంచింది మరో పుణ్యకాలం కోసమే కనుక, సమయం, సందర్భం చూసి అధికారపక్షం దానిని ప్రయోగించింది, ఎందుకైనా మంచిదని దానికి ఓ గ్యారంటీ ట్యాగ్ కూడా వేలాడదీసింది.

ఎన్నికల బాండ్ల గుట్టు ఇప్పట్లో విప్పేది లేదని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్నందుకు, సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టి, మంగళవారం లోగా వివరాలు ఇవ్వాల్సిందేనని ఆదేశించిన నాడే పాలకులు సీఏఏని ఆచరణలోకి తేవడం కూడా కొందరికి విచిత్రంగా అనిపించింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌ల నుంచి వలసవచ్చిన ముస్లిమేతర శరణార్థులకు తగినపత్రాలు లేకున్నా ఈ దేశ పౌరసత్వాన్ని కల్పించేందుకు ఈ చట్టంలోని నిబంధనలున్నాయి. 2014 డిసెంబరు 31 కంటే ముందు ఈ మూడుదేశాల నుంచి మనదేశానికి వచ్చిన ఒక మతంవారు మినహా మిగతా మతస్థులంతా భారత పౌరసత్వాన్ని సునాయాసంగా స్వీకరించవచ్చు. దేశచరిత్రలో తొలిసారిగా భారత పౌరసత్వ అర్హత పరీక్ష మతం ప్రాతిపదికన జరగబోతున్నదని అర్థం. మూడు ముస్లిం దేశాల్లో మతపరమైన హింస దౌర్జన్యాలను తట్టుకోలేక తరలివచ్చిన అక్కడి మైనారిటీలకు ఈ సవరణ చట్టం ఉపకరిస్తుందని పాలకులు అంటున్నప్పటికీ, మతమే పునాదిగా ఒకరికి పౌరసత్వాన్ని కల్పించడం రాజ్యాంగ ఆశయాలకు భిన్నంగా వ్యవహరించడమేనని ఈ దేశంలోని మేధావుల ఆవేదన. కులం, మతం ఇత్యాది భావనలతో, వ్యక్తిగత నమ్మకాలతో నిమిత్తం లేకుండా ఈ దేశంలో నివసించేవారంతా భారత పౌరులేనని రాజ్యాంగం ప్రవచిస్తుంటే, మూడు ఇస్లామిక్ దేశాలనుంచి తరలివచ్చిన ఆయా మతాలవారు అంటూ కొందరిని ప్రత్యేకించి, ఒకమతం వారిని వేరుపరచడం రాజ్యాంగాన్ని అవమానించడం, భారతదేశ లౌకిక స్వరూప స్వభావాలకు పూర్తి భిన్నంగా నడుచుకోవడమే. మతపరమైన ఊచకోతలు, దాడులతో ఈ మూడు దేశాల నుంచి పారిపోయి వచ్చి భారత్‌లో నివాసం ఉంటున్నవారికి పౌరసత్వాన్ని కట్టబెట్టడంలో తప్పేమీ లేదనుకుంటే, పాకిస్థాన్‌లోనే చాలా ముస్లిం తెగలు వీరితో సమానమైన తీవ్ర మతవివక్షను ఎదుర్కొంటున్నాయి.

దీని అమలుతో తక్షణంగా లబ్ధిపొందేది ఓ ముప్పై[?] మందికి మించి ఉండకపోవచ్చు. కానీ, ఎన్నికల తరుణంలో ఇది అందించే సందేశం బలమైనది. 2020లో సుదీర్ఘకాలం సాగిన ఉద్యమాలు, వాటిని అణచివేసేందుకు పాలకులు ప్రయోగించిన హింసను గుర్తుచేసుకుంటే, రాబోయే రోజులు ఎలా ఉండబోతున్నాయో అర్థమవుతుంది. యూనివర్సిటీల్లో ఇప్పటికే నిరసనలు జోరందుకున్నాయి, దేశ రాజధాని భయపడుతోంది, అసోం మళ్ళీ వేడెక్కుతున్నది. అసోంలో ముప్పై[?]విద్యార్థి సంఘాలు నిరసనకార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. అక్రమ వలసదారుల ఏరివేత కోసం దశాబ్దాలుగా ఈశాన్యం పోరాడుతూంటే, బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా చొరబడినవారిలో హిందువులను మాత్రం ఈ చట్టంతో స్థిరపరచే ప్రయత్నం జరుగుతోందని వారందరి భయం. ఇక, కొన్ని రాష్ట్రాలు ఈ సవరణ చట్టాన్ని అమలు చేసేది లేదని ఇప్పటికే ప్రకటించినప్పటికీ, పశ్చిమబెంగాల్ రాజకీయాన్ని ఇది మరింత తీవ్రంగా ప్రభావితం చేయబోతున్నది. సవరణ చట్టం అమలుకు నిబంధనలను నోటిఫై చేయడమే ప్రధానం కనుక, అతిముఖ్యమైన ఆ పని ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్దిరోజుల ముందు కాక, ఎన్నడో జరిగివుంటే ఉన్నతంగా ఉండేది. 'మోదీ గ్యారంటీ'లన్నీ అధికారపక్షానికి రాజకీయంగా ప్రయోజనం చేకూర్చేరీతిలోనే అమలు జరుగుతాయని, మిగతావన్నీ అమిత్ షా 'జుమ్లా'లుగా మిగిలిపోతాయని పాలకులే తమ చర్యలతో తేల్చేస్తున్నారు.

ఆఖరి అంకంలో జగన్ పాలన

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలతో కలిసి పనిచేయాలని భారతీయ జనతా పార్టీ ఎందుకు నిర్ణయించింది? ఈ రెండు పార్టీలతో కలిసి పనిచేయడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని, వారి అభ్యున్నతికి ఈ నిర్ణయం దోహదం చేస్తుందని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనలోనే ఈ ప్రశ్నకు సమాధానం ఉన్నది. 2047 నాటికి భారత్‌కు ఈ అగ్రరాజ్య స్థాయిని సాధించేందుకు అతి వేగవంతమైన నిర్ణయాలను ప్రధాని మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. అగ్రరాజ్యంగా మారాలంటే భారత్ దాదాపు 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాల్సి ఉంటుంది. ఇప్పటికే భారతదేశం ప్రపంచంలో అయిదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందింది. మరో మూడేళ్లలోనే



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

భారత్ మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారేందుకు అవసరమైన చర్యలను మోదీ ఇప్పటికే తీసుకున్నారు. రానున్న సంవత్సరాల్లో భారతదేశం ఏడు శాతానికి పైగా అభివృద్ధి రేటు సాధించేందుకు సమాయత్తం కావల్సివున్నది. ఇప్పటికే అసాధారణమైన రీతిలో లక్షల కోట్ల మేరకు మూలధన వ్యయాన్ని కేటాయించడం ద్వారా భారతదేశం మౌలిక సదుపాయాలను నిర్మిస్తోంది. ఈ నిర్మాణ క్రమం మరింత వేగవంతం అయ్యేందుకు నిర్మాణాత్మక సంస్కరణలను కూడా చేపట్టాల్సి ఉన్నది.

గడచిన అయిదేళ్లలో దేశంలో అనేక రాష్ట్రాలు అభివృద్ధి చెందుతుంటే ఆంధ్రప్రదేశ్ మాత్రం కొన్ని దశాబ్దాలు అభివృద్ధిలో వెనుకబడిపోయింది. ప్రధానమంత్రి అన్ని రాష్ట్రాల మాదిరే ఆంధ్రప్రదేశ్‌లో కూడా భారీ ఎత్తున ప్రాజెక్టులు అమలు కావాలని, రాజధానితో పాటు అనేక నగరాలు ఏపీలో అధునాతనంగా అభివృద్ధి చెందాలని ఆశించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అవసరమైన నిధులను కేటాయించారు. ఢిల్లీ ఎప్పుడు వచ్చినా సాదరంగా మాట్లాడి ఆర్థిక తోడ్పాటుకు సహకారం అందించారు. కాని జగన్‌కు అభివృద్ధే ప్రధాన ఎజెండా కానప్పుడు కేంద్రం ఏమి చేయగలదు? ఏడాదికి 341 రోజులు ఏపీ అప్పులు చేస్తూనే ఉన్నదని, సగం రోజులకు పైగా ఓవర్ డ్రాఫ్ట్‌లపై ఆధారపడుతోందని కాగ్ నివేదికలు చెబుతున్నాయి. 55కు పైగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రూపాయి కేటాయించకపోగా వాటి పేరుతో కూడా అప్పులు చేశారు. గడచిన అయిదేళ్లలో దాదాపు రూ. పదిలక్షల కోట్ల మేరకు రుణాలు చేశారు. కేంద్రం ఇస్తున్న నిధులు వివిధ అవసరాలకు మళ్లిస్తున్నారు. ఆఖరుకు పంచాయితీ నిధులను, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను కూడా మళ్లించారు. కేంద్రం ఇస్తున్న రాయితీలు, సబ్సిడీలు ప్రజలకు చేరడం లేదు. వివిధ సంక్షేమ పథకాలకు రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్లను విడుదల చేయకపోవడంతో అవి నత్తనడక నడుస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేసిన రాజధానిని కూడా గాలికి వదిలేసి మూడు రాజధానులంటూ తుగ్లక్ నిర్ణయాలు తీసుకుని వేలాది రైతుల నోళ్లలో మట్టి కొట్టారు. ప్రతి రోజూ జగన్ నొక్కుతున్న బటన్ల ద్వారా, అసంపూర్తి ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా ప్రజలను మోసగిస్తున్నారు. అప్పుల ఊబిలోకి రాష్ట్రాన్ని నెట్టివేయడం తప్ప జగన్ ఈ అయిదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదు. ఆఖరుకు ప్రభుత్వ కార్యాలయాల్ని కూడా తాకట్టు పెట్టారు. పేరుకు మద్య నిషేధం అమలు చేస్తామని ప్రకటించినా రకరకాల బ్రాండ్లతో మద్యాన్ని ప్రవహింపచేసి వేల కోట్లు లూటీచేశారు. భారీ ఎత్తున విద్యుత్ ఛార్జీలను పెంచారు. జాబ్ క్యాలెండర్ అని బూటకపు ప్రకటనలుచేసి లక్షలాది యువతీ యువకులు ఉద్యోగాలు లేక పక్క రాష్ట్రాలకు తరలివెళ్లేలా చేశారు.



రాష్ట్రాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించే కేంద్రానికి, బీజేపీ నాయకత్వానికి ఏ నిర్ణయం ఎప్పుడు తీసుకోవాలో బాగా తెలుసు. జగన్ ప్రభుత్వం పట్ల తీవ్ర ప్రజా వ్యతిరేకతను కూడా కేంద్రం గమనించింది. అందుకే అభివృద్ధిని ఆశించే శక్తులతో చేతులు కలపాలని బీజేపీ నిర్ణయించుకుంది. అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిపోకుండా చూడడమే ప్రధాని మోదీ ప్రధాన లక్ష్యం.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో భాగంగా కేంద్రం లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను ఏపీకి మంజూరు చేసింది. కాని జగన్ హయాంలో ఈ ప్రాజెక్టులన్నీ నత్తనడక నడుస్తున్నాయి. అనేక ప్రాజెక్టులు భూమి కేటాయించకపోవడంతో ముందుకుసాగలేకపోతున్నాయి. లోటు బడ్జెట్‌ను పూరించడం నుంచి, ప్రత్యేక ప్యాకేజీ వరకు కేంద్రం తోడ్పాటు నందిస్తోంది. ప్రతి జిల్లాలోనూ కేంద్ర ప్రభుత్వ సంస్థలకు నిధులు మంజూరు చేసింది. అనేక ఉన్నత విద్యాసంస్థలను ప్రారంభించింది కాని కేంద్రం ఇచ్చిన తోడ్పాటును ఉపయోగించుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచనే జగన్ ప్రభుత్వానికి లేకుండా పోయింది.

ఇవన్నీ కేంద్రానికి ఎప్పటికప్పుడు తెలిసినందువల్లే జగన్ పాలన నుంచి ఆంధ్రప్రదేశ్‌కు విముక్తి కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయించారు. విద్యుత్ పీపీఏల రద్దు నుంచి ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని దాటడం వరకు కేంద్రం ఎన్నోసార్లు జగన్ ప్రభుత్వ ఆర్థిక అరాచకత్వం గురించి హెచ్చరికలు చేసింది. ఇసుక, మద్యం, మైనింగ్ మొదలైన అనేక రంగాల ద్వారా జరుగుతున్న భారీ అవినీతి గురించి కేంద్రానికి అనేక నివేదికలు అందాయి. గ్రీన్ ట్రిబ్యునల్‌లోనూ, కోర్టుల్లోనూ జగన్ అరాచకాలు, అవినీతిపట్ల చేస్తున్న వ్యాఖ్యలూ కేంద్రం దృష్టిలో ఉన్నాయి. రాజకీయ ప్రత్యర్థులను అణిచివేసేందుకు జగన్ సర్కార్ పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం, తప్పుడు కేసులు పెట్టడం, పార్టీ గూండాల ద్వారా భయభ్రాంతులకు గురిచేయడం, అక్రమ ఆక్రమణలకు పాల్పడడం, దొంగ ఓట్లను చేర్చడం వంటి దుర్మార్గాలూ కేంద్రం దృష్టికి వచ్చాయి. బాబాయి హత్యకేసులో సీబీఐ విచారణ కోరి తర్వాత దానిపై వెనక్కి తగ్గడం, సీబీఐపైనే ఆరోపణలు చేయడం కూడా బీజేపీ గమనించింది. తనపై పెండింగ్‌లో ఉన్న అనేక కేసుల్లో విచారణ ముందుకు సాగకుండా రకరకాల సాకులతో న్యాయవిచారణను జాప్యం చేయడం కూడా బీజేపీకి తెలియని విషయంకాదు. జగన్ హయాంలో దేవాలయాలపై దాడులు మాత్రమే కాదు, చాప క్రింద నీరులాగా క్రైస్తవ మత వ్యాప్తికి తోడ్పడుతున్న విషయమూ క్రింది స్థాయిలో బీజేపీ కార్యకర్తలు కనిపెడుతున్నారు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే జగన్ చేస్తున్న దుర్మార్గాలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఉన్నట్లు ప్రచారం చేసుకోవడం. కోర్టుల్లో కేసులు కదలినప్పుడల్లా, తన దుర్మార్గాల గురించి ప్రజలకు తెలిసినప్పుడల్లా ఢిల్లీ వచ్చి ఏదోసాకుతో ప్రధానమంత్రిని, ఇతర కేంద్రమంత్రులను కలుసుకోవడం ద్వారా ఇన్నాళ్లూ జగన్ తనకు కేంద్రం ఆశీర్వాదాలు ఉన్నాయంటూ మభ్యపెడుతూ వచ్చారు. తన రాజకీయ ప్రత్యర్థులను అణిచివేయడానికి, ప్రతిపక్ష నేతలను జైళ్లపాలు చేసేందుకు కూడా కేంద్రం తోడ్పడుతుందనే దుష్ప్రచారానికి జగన్ తెరలేపారు. కాని రాష్ట్రాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించే కేంద్రానికి, బీజేపీ నాయకత్వానికి ఏ నిర్ణయం ఎప్పుడు తీసుకోవాలో బాగా తెలుసు. జగన్ ప్రభుత్వం పట్ల తీవ్ర ప్రజా వ్యతిరేకతను కూడా కేంద్రం గమనించింది. అందుకే అభివృద్ధిని ఆశించే శక్తులతో చేతులు కలపాలని నిర్ణయించుకుంది. అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడి పోకుండా చూడడమే ప్రధానమంత్రి మోదీ ప్రధాన లక్ష్యం.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

ఐదేళ్ల పీడకల నుంచి మేల్కొనే తరుణం!

మార్చి 31, 2024 నాటికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఐదు బడ్జెట్‌ల కాలం ముగుస్తున్నది. ఎన్నికల ప్రక్రియ మొదలై ఫలితాలు వెలువడే మరో రెండు నెలల వ్యవధి వరకు మధ్యంతర బడ్జెట్‌తో ఈ ప్రభుత్వం నడుస్తుంది. ఈ రెండు నెలలకు కూడా మరో రూ.20వేల కోట్లు అప్పు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైపోయింది.

రాష్ట్ర ప్రజలను మరోసారి తీర్పు కోరుతున్న జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలోని ఇటువంటి ఘోర వైఫల్యాలను, పాపాలను కప్పిపుచ్చి నవరత్నాలు అమలు చేశామని, ఎన్నికల మేనిఫెస్టోలో 99శాతం హామీలు నెరవేర్చామని బొంకుతున్నారు. వైసీపీ వారి కాకిలెక్కల ప్రకారం మొత్తం కుటుంబాలలో 45శాతం మందికి ఏదో ఒక రూపంలో నగదు బదిలీ చేశామని, అంచేత వారందరూ తమకే ఓట్లేస్తారని, దాంతో మరోమారు అధికారపీఠం అధిష్ఠించవచ్చునన్నది వారి దింపుడు కళ్లం ఆశగా ఉంది.

వాస్తవాలను గమనిస్తే జగన్ ఇన్నాళ్లు నొక్కింది సంక్షేమ బటన్ కాదు, ప్రజలపై మోయలేని భారం మోపే బటన్ మాత్రమే! ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయిలో 51 పైసల అప్పు ఉందని ప్రతియేటా రాష్ట్ర బడ్జెట్‌లను ఆడిట్ చేస్తున్న కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వెల్లడించింది. ఈ ఐదేళ్లల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం దారుణమైన దుర్మార్గపు పనులెన్నో చేసింది. అన్నింటికంటే ఎక్కువగా ఆర్థిక నిర్వహణలో జగన్ ప్రభుత్వం దుర్మార్గమైన తప్పులు చేసిందని 'కాగ్' ఎండగట్టింది. యథేచ్ఛగా సాగిన రాజ్యాంగ ఉల్లంఘనలు, కోర్టు ధిక్కరణలు, మానవ హక్కుల హననాలు, విచ్చలవిడి అవినీతి, పారదర్శకతకు వేసిన పాతరలు, వీటన్నింటికీ మించి చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని ఘోరాలకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఒడిగట్టింది. భారత రాజ్యాంగం అధికరణ 266 ప్రకారం బడ్జెట్ అనుమతి లేకుండా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడానికి వీల్లేదు. అలాగే ద్రవ్య వినిమయానికి చట్టసభ ఆమోదం లేకుండా కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులు వినియోగించకూడదు. కానీ, ఈ రెండు రాజ్యాంగ బాధ్యతల్ని జగన్ సర్కార్ బేఖాతరు చేసిందని 'కాగ్' వెల్లడించింది. బడ్జెట్‌లో చూపకుండా ఆర్థిక లావాదేవీలు జరపడం మరో నేరం. కార్పొరేషన్ల ద్వారా సేకరించే రుణాలకు సంబంధించిన సమాచారాన్ని తొక్కిపెడుతూ వస్తున్నారు. కేంద్రం అందించే నిధులను నిర్దేశిత రంగాలలో ఖర్చు చేయకుండా ఇతర అవసరాలకు వాడటం కూడా రాజ్యాంగ ఉల్లంఘనే.

ఇక, జగన్ ప్రభుత్వం ఆర్థిక నిర్వహణలో చేసిన పాపాలు అన్నీ ఇన్నీ కావు. మొత్తం 5 బడ్జెట్‌లలో ప్రతిపాదించిన మొత్తం రూ.12,19,048 కోట్లు. ఇదే కాలంలో చేసిన మొత్తం అప్పులు రూ.8,10,000 కోట్లు. వెరసి ఈ ప్రభుత్వం ఐదేళ్లల్లో దాదాపు రూ.20లక్షల కోట్లు వ్యయం చేసినట్లు లెక్క. బడ్జెట్ అంచనాలకు అందుకోలేకపోయిన మొత్తాన్ని తీసివేసినప్పటికీ ఏడాదికి సగటున మూడున్నర లక్షల కోట్లు వ్యయం చేసి సాధించిన ఫలితాలేమిటో సమీక్షించాల్సిన అవసరం ఉంది.

2014–19 మధ్య చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) సగటు వృద్ధిరేటు 14.99శాతం ఉండగా, 2019–24 మధ్య జీఎస్‌డీపీ సగటు వృద్ధిరేటు 10.93శాతానికి పడిపోయింది. అంటే, రెండు ప్రభుత్వాల మధ్య వృద్ధిరేటులో 4శాతం వ్యత్యాసం ఉంది. తెలుగుదేశం సాధించిన వృద్ధిరేటును కనీసం కొనసాగించి ఉంటే రాష్ట్ర ప్రజల ఆదాయం గణనీయంగా పెరిగి ఉండేది. భారీగా అప్పులు తేవడం వల్ల కోశలోటు అదుపు తప్పింది. ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టం ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో కోశలోటు 3శాతం మించకూడదు. కోవిడ్ అనంతరం రాష్ట్రాలు కొన్ని రంగాలలో పన్నులు అదనంగా విధించాలనే నిబంధనతో కేంద్రం ఎఫ్ఆర్ఎంబీ పరిమితిని సడలించి 3.5శాతం మేరకు అప్పులు చేసుకొనేందుకు వెసులుబాటు కల్పించింది. అయితే, దీనిని మించి రాష్ట్ర ప్రభుత్వం 2022–23లో జీఎస్‌డీపీలో 3.6శాతం మేర, 2023–24లో 3.8శాతం మేర అప్పులు చేసింది. ఈ అప్పులపై వడ్డీలు చెల్లింపుకే ప్రతియేటా బడ్జెట్‌లో 14శాతం నిధుల్ని జమ చేస్తున్నారు.

ఎంతో ఘనంగా చాటింపు వేసుకొంటున్న విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ కేటాయింపులు 12.6శాతం కాగా, దేశంలోని ఇతర రాష్ట్రాల సగటు వ్యయం 14.8శాతం. ఇంధన రంగంలో ఏపీ కేటాయింపులు 2.1శాతం అయితే, మిగతా రాష్ట్రాల సగటు 4.8శాతం. రోడ్లు, భవన నిర్మాణ రంగంలో ఏపీ కేటాయింపులు 2.9శాతం కాగా, ఇతర రాష్ట్రాల సగటు కేటాయింపులు 4.5శాతం. రాజకీయ ప్రత్యర్థులపై వేధింపులకు ఉపయోగించుకొంటున్న రాష్ట్ర పోలీసు వ్యవస్థపై చేస్తున్న కేటాయింపులు 2.9శాతం కాగా, జాతీయ సగటు 4.3 శాతంగా ఉంది. పట్టణాభివృద్ధిలో కేటాయింపులు 3.1శాతంగా ఉంటే, జాతీయ సగటు 3.5శాతం. రాష్ట్రంలో పోలవరంతో సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులు పడకేశాయి. కొన్ని ప్రాజెక్టుల గేట్లకు గ్రీజు పూయడానికి కూడా నిధులు లేక అధికారులు జేబులు తడుముకొంటున్న దారుణ పరిస్థితి నెలకొంది.


ఈ ప్రభుత్వంలో చిన్న చిన్న పనులు చేపట్టేందుకు కూడా కాంట్రాక్టర్లు భయపడిపోతున్నారు. సర్వీస్ ప్రొవైడర్లు ఏ పనికీ ముందుకు రావడం లేదు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం కాంట్రాక్టర్లకు, సర్వీసు ప్రొవైడర్లకు చెల్లించవలసిన రూ.95వేల కోట్ల మేర బిల్లుల్ని రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ముందుగా పెట్టుబడి పెట్టి పనులు చేశాక, ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో అప్పులపాలైన కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకొన్న దురదృష్ట సంఘటనలు ఈ ఐదేళ్లలో అనేకం జరిగాయి. సాధారణంగా కాంట్రాక్టర్లను ప్రభుత్వాలు బ్లాక్ లిస్ట్‌లో పెడతాయి. కానీ ఇక్కడంతా రివర్స్ కాంట్రాక్టర్లే ప్రభుత్వాన్ని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. మౌలిక రంగాలలో పనులు మందగించడం వల్ల లక్షలాది మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. వారందరూ పొరుగు రాష్ట్రాలకు వలసలు పోయారు.

1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2014 వరకు, ఆ తర్వాత ఐదేళ్ల విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారందరూ 66 ఏళ్ళల్లో చేసిన మొత్తం అప్పు రూ.3,62,375 కోట్లు కాగా, ఈ ఐదేళ్లలో జగన్ మోహన్‌రెడ్డి ఒక్కడే చేసిన అప్పు రూ.8,00,810 కోట్లు. రాష్ట్రానికి ఈ దుర్గతి పట్టిందని ప్రశ్నించుకొంటే, రాష్ట్ర ఖజానాకు దఖలుపడాల్సిన ఆదాయ వనరులలో సింహభాగం అధికార పార్టీకి చెందిన కొందరు పెద్దల జేబుల్లోకి పోవడమేనన్న జవాబు లభిస్తుంది. ఉదాహరణకు డిజిటల్ చెల్లింపులు లేకపోవడం వల్ల మద్యం అమ్మకాల ద్వారా లభించే ఆదాయంలో రాష్ట్ర ఖజానాకు భారీగా గండిపడుతోంది. ఇసుక వేలం పాటల ద్వారా, మైనింగ్ కాంట్రాక్టుల ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రావడం లేదు. మరోపక్క పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో ఒక్కో ఎకరా రూ.5–10లక్షలు ఖరీదు చేసే భూముల్ని రూ.60–70లక్షల చొప్పున కొన్నారు. ప్రజల సొమ్మును రైట్‌రాయల్‌గా దోచుకోవడంలో ప్రభుత్వ పెద్దలు కొత్త పుంతలు తొక్కుతున్నారు. మరోపక్క ప్రభుత్వంలో మితిమీరిన దుబారా. ఈ ఐదేళ్లల్లో కేవలం కోర్టు కేసుల వాదనలకి సంబంధించి రూ.5000కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ఇక, సలహాదారులకు, సొంత పత్రిక, ఛానల్‌లో ప్రకటనలకు, వాలంటీర్ల జీతాలు, వారి గిఫ్ట్‌లకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇలా బయటకు తెలిసేవి కొన్ని, తెలియనివి ఎన్నో.

ప్రతియేటా పెరుగుతున్న బడ్జెట్ పరిమాణం వెనుకనున్న అసలు గుట్టు ఏమిటంటే.. ప్రజల మీద అధిక భారం మోపి వారి ముక్కుపిండి పన్నులు వసూలు చేయడమే. ఈ ఐదేళ్లల్లో విద్యుత్ ఛార్జీలు, ఆర్టీసీ ఛార్జీలు, యూజర్ ఛార్జీలు, వాహనాల రిజిస్ట్రేషన్ ఛార్జీలు, భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలు మొదలైనవి పెంచడమే కాక చెత్తపన్ను, ఖాళీ స్థలాలపై పన్ను వంటి 24 రకాల పన్నుల బాదుడుతో ఏటా రూ. 50,000 కోట్ల భారం మోపారు.

కొన్ని వర్గాల ప్రజలను ఓటు బ్యాంకులుగా మలుచుకోవడానికి సమాజంలోని ఇతర వర్గాల ప్రయోజనాలను దెబ్బతీయడం స్వతంత్ర భారతదేశంలో ఎప్పుడూ లేదు. ఏ ప్రభుత్వమైనా సమ్మిళిత అభివృద్ధి కోసం పాటుపడటమే లక్ష్యంగా పెట్టుకొంటుంది. కానీ సీఎం జగన్ స్టయిల్ వేరు. పేదలు, పెత్తందార్లు అంటూ సమాజాన్ని విడదీశారు. దిగువ మధ్యతరగతి, మధ్య తరగతి వర్గాలను శత్రువులుగా పరిగణిస్తున్నారు. పోనీ పేదలనైనా ఉద్ధరిస్తున్నారా? అంటే అదీ లేదు. పేదరికాన్ని రూపుమాపేందుకు, పేదవర్గాలను సాధికారుల్ని చేసే పథకం ఒక్కటీ ప్రభుత్వం అమలు చేయడం లేదు.

ఈ ఐదేళ్ల పాలనలో జగన్ మార్క్ దేనిలో కన్పిస్తోందంటే కరప్షన్‌లో, క్రిమినల్ పాలిటిక్స్‌లో, క్రూయాలిటీలో, కోర్టుల కంటెమ్ట్‌లో సీఎం జగన్‌కు బాధ్యత లేదు. బాంధవ్యాలు అసలే లేవు. సొంత బాబాయి హత్య కేసులో ముద్దాయిని రక్షించటానికి ప్రయత్నించడం, సొంత చెల్లెలిపై సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేస్తుంటే నిర్వికారంగా తనకేమీ పట్టనట్లు జగన్ చిరునవ్వులు చిందించడం చూసే వారికి ఆశ్చర్యం కలుగుతుంది. జగన్‌కు చట్టాల పట్ల గౌరవం లేదు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం లేదు. రాష్ట్ర ప్రజానీకానికి ఈ ఐదేళ్ల పాలన ఓ పీడకల! ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రజలదే!



1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2014 వరకు, ఆ తర్వాత ఐదేళ్ల విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారందరూ 66 ఏళ్లల్లో చేసిన మొత్తం అప్పు రూ.3,62,375 కోట్లు కాగా, ఈ ఐదేళ్లలో జగన్ మోహన్‌రెడ్డి ఒక్కడే చేసిన అప్పు రూ.8,00,810 కోట్లు. రాష్ట్రానికి ఎందుకీ దుర్గతి పట్టిందని ప్రశ్నించుకొంటే, రాష్ట్ర ఖజానాకు దఖలుపడాల్సిన ఆదాయ వనరులలో సింహభాగం అధికార పార్టీకి చెందిన కొందరు పెద్దల జేబుల్లోకి పోవడమేనన్న జవాబు లభిస్తుంది.

● సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు

ఆ చమురు, గ్యాస్ మన హక్కు

కాకినాడ సముద్ర తీరానికి ముప్పై[?] కి.మీ దూరంలో కేంద్రం ప్రభుత్వరంగ చమురు, సహజ వాయువు సంస్థ ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో కృష్ణా–గోదావరి బేసిన్ డీప్ వాటర్ బ్లాక్ డి–5 నుంచి 2024, జనవరి 7న చమురు ఉత్పత్తి ప్రారంభమవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్[?] కేజీ డి–6 బావి చెంత దేశం మొత్తం ఉత్పత్తిలో ఇది 7 శాతం చమురు, 7శాతం గ్యాస్ అని.. 2024 జూన్ నాటికి ఇది చమురు 11శాతం, గ్యాస్ 15శాతం స్థాయికి చేరి రోజుకు 45,000 బ్యారెల్స్ చమురు, పది మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ వాణిజ్య ఉత్పత్తి జరిగి భారత ఇంధన రంగంలో ఇది అద్భుతమైన మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

కృష్ణా–గోదావరి నదుల మధ్య ప్రాంతంలోని ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల భూ ఉపరితలంలో 28 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలోనూ, ఈ ప్రాంత సముద్ర తీరం వెంబడి ప్రాదేశిక జలాల్లో 24 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలోనూ అపార చమురు, గ్యాస్ నిక్షేపాలు విస్తరించి ఉన్నాయి. ప్రభుత్వ రంగంలోని చమురు, సహజవాయు సంస్థ (ఓఎన్‌జీసీ) దశాబ్దాల పరిశోధనల కృషి ఫలితంగా ఈ ప్రాంతంలో చమురు, గ్యాస్ నిక్షేపాలు బయటపడ్డాయి. 1978 సంవత్సరంలో మొదటి బావిని తవ్వి గ్యాస్ కనుగొన్నారు. 2001–2002లో కేజీ బేసిన్ నుంచి ఓఎన్‌జీసీ 2.82 లక్షల టన్నుల ఆయిల్, 1.769 బిలియన్ క్యూబిక్ లీటర్ల గ్యాస్ అమ్మకం చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 550 కోట్ల రూపాయల రాయల్టీ చెల్లించింది.



తమ ముంగిట్లో లభిస్తున్న సహజ వాయువును స్థానిక ప్రజల గృహావసరాలు, రవాణా, పారిశ్రామిక, వాణిజ్య ప్రయోజనాలకు అందించిన తరువాతే ఇతర రాష్ట్రాలకు తరలించాలని ఎప్పటినుంచో ప్రజలు కోరుతున్నారు. కేజీ బేసిన్ విషయంలో 12వ ఆర్థిక సంఘం సిఫార్సును గౌరవించి ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలి. అఖిలపక్షం, ప్రజా సంఘాలతో కేజీ బేసిన్ హక్కుల సాధనకై కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి.

అయితే 1997లో కేంద్రం నూతన అన్వేషణ, లైసెన్సింగ్ విధానం (ఎనఇఎల్‌పి) ప్రవేశపెట్టిన ఫలితంగా ప్రభుత్వ అజమాయిషీ నుంచి 1990 దశకం నాటికి చమురు, గ్యాస్ నిక్షేపాల అన్వేషణలో ప్రైవేటురంగ సంస్థలు హక్కు సంపాదించాయి. ఈ విధానంలో వేలంపాటలో 161 బావులపై ఒప్పందాలు జరిగాయి. ఈ వేలంపాటలో ఓఎన్‌జీసీ, ఆర్ఐఎల్ సమాన విస్తీర్ణంలో వాటా లభించినా ఉత్పత్తులు అత్యధికంగా ఆర్ఐఎల్ ఖాతాకు దక్కడం ఒకింత అనుమానం, ఆశ్చర్యం కలిగించేదే. ధరల నిర్ణయంలోను రిలయన్స్‌దే పైచేయిగా మారింది. ఆ విధంగా దేశంలో, రాష్ట్రంలో చమురు, గ్యాస్ నిక్షేపాలపై రిలయన్స్ ఏకఛత్రాధిపత్యం సాధించింది. ప్రభుత్వరంగ సంస్థ ఓఎన్‌జీసీ మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి గత ఐదేళ్లలో రెండు వేల కోట్ల రూపాయలను, 2023–24లో 305.62 కోట్లు, 134.34 కోట్ల రూపాయలు రాయల్టీ, టాక్స్ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించింది.

సముద్ర గర్భం నుంచి వెలికి తీసిన గ్యాస్, చమురు లాభాలు మొత్తం కేంద్రానికే దఖలౌతున్నాయి. ప్రభుత్వం రిలయన్స్ ఇండస్ట్రీస్[?] మధ్య కుదిరిన ప్రొడక్షన్ షేరింగ్ కాంట్రాక్టులో అవకతవకలు జరిగాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రిపోర్ట్ తప్పుపట్టింది. పెట్రోలియం మంత్రిత్వ శాఖ సైతం దీనిని అంగీకరించింది. కాంట్రాక్టర్‌కు తొంభై శాతం లాభాలు ముడుతుండగా, ప్రభుత్వానికి కేవలం పది శాతమే దక్కుతున్నాయి. గుజరాత్ పెట్రోలియం–సహజ వాయువు సంస్థను నెలకొల్పిన గుజరాత్ ప్రభుత్వం రెండు లక్షల కోట్ల విలువైన కేజీ బేసిన్ గ్యాస్‌ను స్వంతం చేసుకుని లాభాలు గడించి, ఆ ప్రాంత పారిశ్రామిక, వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతున్నది. కానీ మన రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు ముడుచుకుని చోద్యం చూస్తున్నాయి.

ఎనఇఆర్‌ఎల్‌పి ప్రకారం సముద్ర గర్భంలోనూ, భూ ఉపరితలంలోనూ ప్రైవేటు కార్పొరేట్ సంస్థలు తాము పెట్టిన పెట్టుబడిని లాభాలతో సహా త్వరగా రాబట్టుకోవడానికి వీలుగా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ఉత్పత్తుల ధర నిర్ణయించే వెసులుబాటును పొందాయి. గ్యాస్‌ను అన్వేషించి వెలికి తీయడానికి అయ్యే ఖర్చు, పెట్టుబడిపై రికవరీ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను, రాయల్టీల మొత్తం ఖర్చుగా భావించి గ్యాస్‌ను అమ్మగా వచ్చిన పైకం నుంచి ఈ ఖర్చును మినహాయిస్తే మిగిలే లాభం నుంచి కేంద్ర ప్రభుత్వం తన వాటాను నగదు లేదా వస్తు రూపంలో తీసుకోవచ్చు.

ప్రముఖ ఆర్థికవేత్త, రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రంగరాజన్ నేతృత్వంలో ఏర్పడిన 12వ ఆర్థిక సంఘం ఏ ప్రాంతంలో లభ్యమయ్యే సహజవనరులపై ఆ ప్రాంతానికి ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించింది. ఈ నివేదిక ననుసరించి కృష్ణా–గోదావరి బేసిన్ గ్యాస్, చమురు లాభాల్లో ఆంధ్రప్రదేశ్‌కి ఏభై శాతం ఇవ్వడం ద్వారా విభజన గాయాల నుంచి రాష్ట్రానికి ఉపశమనం లభిస్తుంది. సిబ్బంది జీతాలకు, తెచ్చిన ఋణాలపై వడ్డీల చెల్లింపుల కోసం మళ్ళీ అధిక వడ్డీలకు ఋణాలు తెస్తూ అభివృద్ధి ఊసే లేని ఆర్థిక సంక్షోభంలో రాష్ట్ర భవిష్యత్తు నాశనమయింది. కనీస మౌలిక సదుపాయాలకూ వ్యయం చేయలేని దుస్థితిలో చివరకు ఆర్థిక ఎమర్జెన్సీ దిశగా రాష్ట్ర పరిస్థితులు మారుతున్నాయి. ఈ దుస్థితి నుంచి బయటపడాలంటే రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. మన రాష్ట్రంలో లభ్యమౌతున్న గ్యాస్, చమురు సహజ సంపదలో రాష్ట్రం వాటాకై డిమాండ్ చేసి సాధించడం ద్వారా అనేక విధాల రాష్ట్రాన్ని ప్రగతిపథంలో పయనింపజేయవచ్చు.

12వ ఆర్థిక సంఘం సిఫార్సు అమలైతే కేంద్రానికి రాయల్టీగా లభిస్తున్న నేచురల్ గ్యాస్‌లో ఏభై శాతం స్థానిక రాష్ట్రంగా మనకు దక్కాలి. ఈ సహజ న్యాయసూత్రాన్ని విస్మరించి గ్యాస్ ధర నిర్ణయంలో రిలయన్స్ ఇండస్ట్రీస్[?] వాణిజ్య ప్రయోజనాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. సహజ న్యాయానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా యథేచ్ఛగా 1500 కి.మీల దూరంలో ఉన్న గుజరాత్‌కు లక్షల కోట్ల విలువైన కేజీ బేసిన్ గ్యాస్ కేంద్రం తరలించుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రం వాటా కోసం కేంద్రానికి 29 లేఖలు రాశారు. జగన్ ప్రభుత్వం కేజీ బేసిన్ లాభాల్లో రాష్ట్ర వాటాకై కేంద్రాన్ని గట్టిగా డిమాండ్ చేయాలి.

ఆయిల్, సహజ వాయువు ఉన్న ప్రాంతం నుంచి అదనంగా రవాణా ఖర్చులు వెచ్చించి సుదూర రాష్ట్రాలకు, అక్కడి పరిశ్రమలకూ తరలించడం ఏపీకి అన్యాయం చేయడమే కాదు ఆర్థికంగా అశాస్త్రీయమైనదని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అభిప్రాయపడింది. అంతేకాక తన నివేదికలో ఏపీకి రాయల్టీ చెల్లిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ ఓఎన్‌జీసీ కన్నా రిలయన్స్‌కి కేటాయించిన డి–6 బ్లాక్‌లో ఎన్నో రెట్లు గ్యాస్ ఉత్పత్తి జరుగుతున్నా ఆ సంస్థ ఆంధ్రప్రదేశ్‌కు రాయల్టీ చెల్లించకపోవడం సరికాదని తప్పుపట్టింది. న్యాయబద్ధమైన ఈ సూచనలలో దేనినీ కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదు.

రాష్ట్రంలో గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తితో సిమెంట్, సిరామిక్, రసాయనిక, అల్యూమినియం, ఫ్యాబ్రికేషన్ వంటి అనేక నూతన పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. విశాఖ ఉక్కు కర్మాగారానికి ఈ గ్యాస్ సరఫరా ద్వారా ఖర్చు తగ్గి, ఏడాదికి 1200 కోట్ల రూపాయల ఆదా అవుతుంది. వ్యవసాయం కోసం రైతులకు ఉచితంగా కరెంటు ఇవ్వవచ్చు. కాకినాడ నుంచి విశాఖపట్నం వరకూ కాలుష్య రహిత రసాయనిక పారిశ్రామిక కారిడార్ నెలకొల్పవచ్చు. రవాణా రంగంలో మోటారు వాహనాలకు సీఎన్‌జి గ్యాస్ వాడకం ద్వారా ఖర్చు ఆదా అవడమే కాక పర్యావరణ పరిరక్షణకూ మేలు జరుగుతుంది.

తమ ముంగిట్లో లభిస్తున్న సహజ వాయువును స్థానిక ప్రజల గృహావసరాలు, రవాణా, పారిశ్రామిక, వాణిజ్య ప్రయోజనాలకు అందించిన తరువాతే ఇతర రాష్ట్రాలకు తరలించాలని ఎప్పటినుంచో ప్రజలు కోరుతున్నారు. కేజీ బేసిన్ విషయంలో 12వ ఆర్థిక సంఘం సిఫార్సును గౌరవించి ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలి. అఖిలపక్షం, ప్రజా సంఘాలతో కేజీ బేసిన్ హక్కుల సాధనకై కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి.


■ అవధానుల హరి
కార్యదర్శి, జైఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం

సిపిఎస్ రద్దు ఉత్తమాటేనా?

కచ్చితంగా దాదాపు 5 ఏళ్ల క్రితం పాదయాత్రలో జగన్ అన్న మాటలు గుర్తుకొస్తున్నాయి. అధికారం వచ్చిన వారం లోగా సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న మాటలతో సంబరపడిన సీపీఎస్ ఉద్యోగులు ఆనందంతో అందలం ఎక్కడానికి పాటుపడ్డారు. ఐదు సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న సీపీఎస్ కొనసాగుతూనే ఉన్నది. ధర్నాలు, ర్యాలీలు, పికెటింగులు, నిరాహార దీక్షలు చేసిన ఫలితం లేదు. పాత పింఛను ఇక వచ్చే అవకాశమే లేదని తేలిపోయింది. ఇచ్చేవారు వస్తారా అని ఎదురుచూపులే కానీ ఓదార్పు ఇచ్చేవారు ఎవరూ కనిపించడం లేదు. రాజకీయ నాయకుల మాటలు నీటి మూటలేనా అనిపిస్తున్నది. పాత పింఛను విధానమే మా అంతిమ లక్ష్యం అంటూ చిత్తశుద్ధితో ఉద్యమాలకు సంఘాలు శ్రీకారం చుట్టలేకపోతున్నాయి. పింఛను సాధన సమితి, పింఛను పోరాట సమితి అంటూ ప్రత్యేక వేదికలు ఏర్పడినా ఐదేళ్లలో సాధించింది ఏమీ లేదు. ప్రభుత్వం ప్రతిపాదించిన జీపీఎస్‌కు బలమైన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలపడం వల్లే సీపీఎస్ రద్దు కాకపోవడానికి ప్రధాన కారణం. నిజంగా సీపీఎస్ రద్దు కోసమే ఉద్యమాలు జరిగి ఉంటే ఇదే ప్రధాన డిమాండ్‌గా సమ్మె జరిగి ఉండేది. సీపీఎస్ఈఎస్, సీపీఎస్ యుఎస్ అంటూ ఏర్పడ్డ వర్గాలు ఎక్కడో ఒకచోట ప్రభుత్వ కనుసన్నల్లో ఉన్న ఆర్గనైజేషన్స్‌కు భక్తి చూపడం వల్లే సీపీఎస్ కొనసాగుతూ ఉన్నది. 2007లో 2004 సెప్టెంబర్ తర్వాత రెగ్యులర్ వేతనాలు తీసుకున్న వారందరూ కూడా సీపీఎస్ పరిధిలోకి వస్తారని పీఎఫ్ ఖాతాలు తెరవలేమని భీష్మించి కూర్చున్న జిల్లా పరిషత్ అధికారులు పై, నాటి ప్రభుత్వ మెమో 1440పై సకాలంలో ఉద్యమానికి శ్రీకారం చుట్టడం వల్లే 2002 నియామకపు ఉపాధ్యాయులకు న్యాయం జరిగి ఓపీఎస్‌లోకి రావడం జరిగింది. ఆ స్ఫూర్తికి అన్ని సంఘాలు మద్దతు తెలపకపోవడం వల్లే నేడు సీపీఎస్ కొనసాగడానికి ఒక కారణంగా కూడా చెప్పవచ్చు.

2003లో ఎన్డీఏ ప్రభుత్వం కొత్త పింఛన్ విధానానికి శ్రీకారం చుడితే, 2004 తర్వాత యూపీఏ ప్రభుత్వం పీఎఫ్ఆర్‌డీఏ చట్టంతో కొత్త పింఛన్ విధానాన్ని విస్తృతపరిచింది. రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం 1-0 సెప్టెంబర్, -2004 నుంచి అమలులోకి తెచ్చింది. సీపీఎస్‌ను సమీక్షించాలని 2008లో ప్రభుత్వ ఉత్తర్వులు 319 వెలువడిన ఫలితం లేదు. ప్రస్తుత ప్రభుత్వం అనేక కమిటీలతో చివరికి గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీయస్)ను ప్రభుత్వ ఉత్తర్వులు 116 ద్వారా తీసుకురావడం జరిగింది. సీపీఎస్ రద్దు కానే కాదని తేల్చేసింది. వాగ్దానాలు ఉత్త మాటలే అయినవి. ప్రతి ఎన్నికల్లో ఇది రాజకీయ అస్త్రంగా మారుతున్నది తప్ప ఏపీలో పరిష్కారమైన పరిస్థితి లేదు. ఏప్రిల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో దీని ప్రభావం తీవ్రతరమయ్యే పరిస్థితి ఉంది. నూతన ప్రభుత్వం ఏర్పాటులో సీపీఎస్ అంశం కీలక భూమిక పోషించనున్నది. రాజకీయ పార్టీలన్నీ కూడా సీపీఎస్‌పై తమవైఖరి ఏమిటో తెలపాల్సిన బాధ్యత ఉన్నది. తమ ప్రభుత్వం వస్తే సీపీఎస్ సమస్యను పరిష్కరించే విధి విధానాల గురించి ముందస్తుగా ప్రకటిస్తే ఓట్ ఫర్ ఓపీఎస్‌గా పరిస్థితి మారనున్నది. అదే మాదిరిగా రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు ఒకే వేదిక ద్వారా ఓట్ ఫర్ ఓపీఎస్ ప్రకటిస్తే కానీ పరిస్థితి మారే అవకాశం లేదు. తూతూ మంత్రంగా ముందుకు వెళితే సీపీఎస్ రద్దు కానే కాదు.


– -సి.వి.ప్రసాద్
రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఏపీటీఎఫ్ అమరావతి



గెలుపుపై అనుమానంతో వైసీపీ అభ్యర్థులు అన్ని అడ్డదారులు తొక్కుతున్నారు. ఇందుకోసం వలంటీర్లను కార్యకర్తల్లా మార్చారు. ప్రజలు కూడా కార్యకర్తల కంటే వలంటీర్లనే విశ్వసిస్తుండటంతో నాయకులు తెలివిగా ఇంటింటికీ పంపిస్తున్నారు. కుక్కర్లు, ఫ్లాస్కులు, డబ్బు వంటి తాయిలాలు ఇవ్వడంతో పాటు తాము గెలిస్తే రూ.10 వేల చొప్పున లబ్ధి చేకూరుస్తామని నాయకులు హామీ ఇస్తున్నారు. దీంతో వలంటీర్లు వైసీపీ ప్రచారకర్తల్లా మారి ప్రతి గడపకూ వెళ్లి ప్రచారం చేస్తున్నారు.



లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వైసీపీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న వలంటీర్లు



లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల నగదు వివరాలతో ముద్రించిన కరపత్రం

వలంటీర్లు

గెలుపు కోసం వైసీపీ నేతల అడ్డదారులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/అజిత్‌సింగ్‌నగర్) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోని వైసీపీ నేతలు తమతమ నియోజకవర్గాల పరిధిలోని వలంటీర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో వారికి తాయిలాలు అందజేసి, తమ గెలుపునకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు పథకాలను వివరించి, ఇప్పటి వరకు కలిగిన లబ్ధిని వివరించే ప్రయత్నం చేస్తున్నారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే ఈ పథకాలన్నీ ఆగిపోతాయని చెప్పమంటున్నారు. వలంటీర్లు సైతం వైసీపీ నేతల మాటలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నారు.

పార్టీ ప్రచారకర్తల్లా మారిన వలంటీర్లు

- ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వంపై పొగడ్తలు
- సంక్షేమం పేరు చెప్పి మాయమాటలు
- ఇంత లబ్ధి పొందారంటూ వివరాలతో స్టేట్‌మెంట్
- మళ్లీ ఓటు వేస్తే చాలా వస్తాయంటూ ఎర
- ఇంటింటికీ తిరిగినందుకు వలంటీర్లకు నేతల తాయిలాలు

ప్రలోభాలు ఇలా..

- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన వెలంపల్లి శ్రీనివాస్‌కు నియోజకవర్గంలో సానుకూల వాతావరణం లేకపోవడంతో గెలుపు కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో వలంటీర్లనే నమ్ముకుని ఆయన ముందుకు సాగుతున్నారు. వారికి తాయిలాలు ఇచ్చి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తన కోసం పనిచేయాలని కోరుతున్నారు. నియోజకవర్గంలో వలంటీర్లకు రూ.5 వేలు, కుక్కర్లు, అంగన్వాడీ, ఆశా వర్కర్లకు చీరలు పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం కృషి చేయాలని కోరుతున్నారు. ప్రతి వలంటీర్ వైసీపీకి పనిచేసి గెలుపును కానుకగా ఇస్తే ముున్ముందు మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రలోభపెడుతున్నారు.
- పెనమలూరు నియోజకవర్గంలో జోగి రమేశ్‌దీ ఇదే పరిస్థితి. ఆయన కూడా వలంటీర్లతో పాటు ఆశా వర్కర్లు, డ్వాక్రా మహిళలు.. ఇలా ఎవరినీ వదలకుండా తాయిలాల వర్షంలో ముంచేస్తున్నారు. ఓవైపు జోగి రమేశ్, మరోవైపు ఆయన తనయుడు రాజీవ్ ఇద్దరూ సమావేశాల మీద సమావేశాలు నిర్వహిస్తూ ప్రలోభాలకు గురిచేస్తున్నారు.
- విజయవాడ పశ్చిమ, మైలవరం, మచిలీపట్నం, పెడన, నందిగామ, పామర్రు.. ఇలా అభ్యర్థులు ఖరారైన చోట, ఖరారు కానిచోట వైసీపీ నేతలు వలంటీర్లను ప్రలోభాలతో ముంచెత్తుతున్నారు. అధికశాతం మంది రూ.5 వేలతో పాటు కుక్కర్లు, స్మార్ట్ వాచ్‌లు, ఫ్లాస్కులు వంటి తాయిలాలను ఇస్తున్నారు.

వైసీపీ కార్యకర్తల్లా..

వైసీపీ నేతల తాయిలాలతో వలంటీర్లు మరింత రెచ్చిపోతున్నారు. పక్కా వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. సోమవారం నున్న గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో గ్రామ వలంటీర్ నిరంజన్ పక్కా వైసీపీ కార్యకర్తలా వేదిక ఎక్కి రాజకీయ ఉపన్యాసం చేయడం గమనార్హం. సెంట్రల్ నియోజకవర్గంతో పాటు మైలవరం, పెనమలూరు వంటి నియోజకవర్గాల్లో తాయిలాలు అందుకున్న వలంటీర్లు స్వామిభక్తిని చాటుకుంటున్నారు. వివిధ పథకాల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి గడప గడపకు సంక్షేమం పేరుతో ముద్రించిన కరపత్రాలను అందజేస్తున్నారు. సదరు కరపత్రాల్లో లబ్ధిదారులకు ఏ పథకం ద్వారా ఎంత నగదు లబ్ధి చేకూరిందన్న వివరాలను దగ్గరుండి మరీ వివరిస్తున్నారు. 'ఆ దేవుడి ఆశీస్సులతో ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో మీకు జరిగిన మంచి ఇది. మళ్లీ వైసీపీ ప్రభుత్వానికి ఓటు వేయండి' అని లబ్ధిదారులకు నూరిపోస్తున్నారు. కొన్నిచోట్ల సచివాలయ సిబ్బంది సైతం వీరికి జత కలుస్తున్నారు.

నోటిఫికేషన్ వచ్చేలోపే..

నాలుగైదు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో వలంటీర్ల ద్వారా ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు వైసీపీ నేతలు తెగ ప్రయత్నిస్తున్నారు. వలంటీర్లను సొంత పార్టీ కార్యకర్తల్లా వినియోగించుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే వలంటీర్లకు చెక్ పడుతుందన్న భయంతో హడావిడిగా ఈ వ్యవహారాలను చక్కబెడుతున్నారు.

జగన్ 126 సార్లు బటన్ నొక్కారు

ఆయన కోసం మనం రెండుసార్లు బటన్ నొక్కుదాం..

నున్న గ్రామ వలంటీర్ నిరంజన్ రాజకీయ ప్రసంగం



విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : 'జగన్ ఈరోజు రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారు. ప్రతి మహిళా సంతోషంగా ఉంటే రాష్ట్రం సంతోషంగా ఉంటుందనే లక్ష్యంతో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. అలాంటి జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలి. ఆయన్ను గెలిపించుకోవాలంటే మన ఎమ్మెల్యే అభ్యర్థిని మనం గెలిపించుకోవాలి. మనకోసం 126 సార్లు జగన్ బటన్ నొక్కారు. మనం రెండుసార్లు ఆయన కోసం బటన్ నొక్కలేమా? మనమందరం కలిసి జగన్‌ను గెలిపించుకుందాం. ఎన్నికల వేళ చాలామంది వస్తారు. అది చేస్తాం ఇది చేస్తాం అని అంటారు. ఆ మాటలేవీ నమ్మవద్దు.' విజయవాడ గ్రామీణ మండలం నున్న గ్రామ వలంటీర్ నిరంజన్ చేసిన రాజకీయ ప్రసంగం ఇది. సోమవారం నున్నలోని చెరువు సెంటర్లో ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది.



శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం నిర్వహించే టెండర్లలో ఒక ఉద్యోగి చక్రం తిప్పుతున్నాడు. కాంట్రాక్టర్లు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో కోట్ చేసిన ధరల వివరాలను ముందే తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు లీక్ చేస్తూ భారీగా లబ్ధి పొందుతున్నాడు. ఫలితంగా దుర్గగుడికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.

ఆదాయానికి టెండర్ పెట్టాడు..!

దుర్గగుడి కంప్యూటర్ ఆపరేటర్ అవినీతి

- అనుకూల కాంట్రాక్టర్లకు ముందే ధరలు లీక్
- తక్కువకు కోట్ చేస్తున్న కాంట్రాక్టర్లు
- సదరు ఆపరేటర్‌కు భారీగా లబ్ధి
- దుర్గగుడి ఆదాయానికి మాత్రం గండి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) : దుర్గగుడిలో వివిధ విభాగాలకు అవసరమైన సరుకులకు, అభివృద్ధి పనులకు అధికారులు ఈ-ప్రొక్యూర్‌మెంట్, ఓపెన్ టెండర్లు, సీల్ టెండర్లు నిర్వహిస్తుంటారు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ విభాగమంతా ఓ కంప్యూటర్ ఆపరేటర్ పర్యవేక్షణలో ఉంటుంది. దీనిద్వారా పిలిచే టెండర్లలో గోల్‌మాల్ జరుగుతోందని ఇటీవల దుర్గగుడి అధికారులు గుర్తించారు. దీనిపై అంతర్గతంగా జరిగిన విచారణలో సదరు కంప్యూటర్ ఆపరేటర్ వివిధ టెండర్లకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా వేర్వేరు కాంట్రాక్టర్లు కోట్ చేసే ధరలను ముందే తెలుసుకుని తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు లీక్ చేస్తున్నారని తేలినట్టు సమాచారం. ఇలా ఆ కంప్యూటర్ ఆపరేటర్ లీక్ చేసిన ధరలను బట్టి కాంట్రాక్టర్లు ధరలు కోట్ చేసి టెండర్లు దక్కించుకుంటున్నారు. ఈ వ్యత్యాసం రూ.100 నుంచి రూ.1,000 లోపే ఉంటుండటంతో ఇతర కాంట్రాక్టర్లకు అనుమానం వచ్చి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తీగ లాగితే డొంక కదిలినట్టు అసలు బండారం బయటపడింది.

గతంలో సస్పెండైనా మళ్లీ కీలక పదవి

ఏళ్ల తరబడి కంప్యూటర్ విభాగంలో పనిచేస్తున్న ఆ ఉద్యోగి అస్మీతానై వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. సదరు ఉద్యోగి గతంలో దేవస్థానంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురికి మాయమాటలు చెప్పి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేయడంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పట్లో ఆలయ అధికారులు కూడా అతన్ని సస్పెండ్ చేశారు. గతంలో రూ.25 టికెట్ల గోల్‌మాల్‌లో కూడా ఇతనిపై ఆరోపణలు వచ్చాయి. ఇటీవల కంప్యూటర్ బిల్లు పేపర్ రోల్ కొనుగోలు చేయకపోయినా చేసినట్టు దొంగ బిల్లు పెట్టి దేవస్థానం నుంచి డబ్బు తీసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా టెండర్ల వ్యవహారంలో ఇతను కీలకపాత్ర పోషించి తనకు అనుకూల కాంట్రాక్టర్ల నుంచి పెద్ద మొత్తంలో దండుకుంటున్నాడని సమాచారం.

బాబోయ్ వైసీపీ సభ..!

నేతల ప్రసంగాలు వినలేక మహిళల పలాయనం

- ఇబ్రహీంపట్నంలో చేయూత చెక్కుల పంపిణీ
- చోటా నాయకుల ఊకదంపుడు ప్రసంగాలు

-6లో..



ఎన్నికల కవాతు

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు, రక్షకదళాలు సోమవారం నగరంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. ఏలూరు రోడ్డు, బీఆర్‌టీఎస్ రోడ్డులో పెద్ద ఎత్తున కవాతు నిర్వహించారు. ఆయుధాలతో తిరుగుతూ ఆ ప్రాంతాలను పరిశీలించారు.

విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్యాకేజీ-1 ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ



- రూ.666 కోట్లతో కలపర్రు నుంచి గుండుగొలను వరకు పూర్తి
- కత్తిపూడి-ఒంగోలు నుంచి అవనిగడ్డ వరకు పనులు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టులో అంతర్భాగమైన ప్యాకేజీ-1 పనులు పూర్తికావటంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం గుర్గావ్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.666 కోట్లతో కలపర్రు నుంచి గుండుగొలను వరకు 27 కిలోమీటర్ల మేర వరాహ ఇన్‌ఫ్రా పనులు చేపట్టింది. ప్యాకేజీ-1 పనులు ముందే ప్రారంభమైనా ఆలస్యంగా చేపట్టారు. ఒకానొక దశలో కాంట్రాక్టు సంస్థతో ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో పనుల పురోగతిలో తీవ్ర జాప్యం ఏర్పడింది. ఈలోపు ప్యాకేజీ-2 పనులను లక్ష్మీ ఇన్‌ఫ్రా సంస్థ దక్కించుకోవటంతో పాటు శరవేగంగా పనులు చేపట్టింది. మొత్తం నాలుగు ప్యాకేజీల్లో పనులు చేపట్టారు. ప్యాకేజీ-2 పనులు చిన్న అవుటపల్లి నుంచి కలపర్రు వరకు ముందే పూర్తికాగా, ప్రస్తుతం ప్యాకేజీ-1 పనులు కలపర్రు నుంచి గుండుగొలను వరకు పూర్తయ్యాయి. ఈ పనుల విషయానికొస్తే కోల్‌కతా-చెన్నై మార్గానికి సంబంధించిన ఎన్‌హెచ్-16పై నిర్మించారు. గతంలో ఉన్న నాలుగు వరసల రోడ్డును ఆరు వరసలుగా విస్తరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఒక ట్రక్ లే బే, నాలుగు బస్ షెల్టర్లు, 2 మేజర్ బ్రిడ్జిలు, 9 మైనర్ బ్రిడ్జిలు, 2 ఫ్లై ఓవర్లు, 10 వెహికల్ అండర్ పాస్‌లు నిర్మించారు. ఇక ప్యాకేజీ-3, 4 పనులే పూర్తి కావాల్సి ఉంది. 3లో భాగంగా విజయవాడ బైపాస్‌ను మేఘా సంస్థ దాదాపు పూర్తి చేసింది. విద్యుత్ లైన్ల కారణంగా జాప్యం జరుగుతోంది. ప్యాకేజీ-4లో భాగంగా కృష్ణానదిపై బ్రిడ్జి, కాజ వరకు ఆరు వరసల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తి కావటానికి మరో ఏడాది పట్టే అవకాశం ఉంది.

గురజనపల్లి-అవనిగడ్డ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

కత్తిపూడి-ఒంగోలుకు వెళ్లే ఎన్‌హెచ్-216లో భాగంగా గురజనపల్లి నుంచి అవనిగడ్డ వరకు రూ.1,185 కోట్లతో 127 కిలోమీటర్ల మేర చేపట్టిన రెండు వరసల రోడ్డు విస్తరణ పనులను కూడా మోదీ ప్రారంభించారు. కృష్ణాజిల్లాలో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమైనది. ఏడు బైపాస్‌లు, 3 ట్రక్ లే బేలు, 53 బస్ షెల్టర్లు, 3 రెస్ట్ ఏరియాలు, 13 మేజర్ బ్రిడ్జిలు, 39 మైనర్ బ్రిడ్జిలు, ఒక వెహికల్ అండర్ పాస్, 3 టోల్ ప్లాజాలు ఉన్నాయి. ఇది కోస్టల్ కారిడార్‌ను కనెక్ట్ చేస్తుంది. మొత్తం ఆరు జిల్లాల మీదుగా వెళ్తుంది. ఐదు జాతీయ రహదారులను అనుసంధానం చేస్తుంది. మచిలీపట్నం పోర్టుకు అనుసంధానమవుతుంది.

పశ్చిమలో సస్పెన్స్..!

నిన్నటి వరకు జనసేనకేనంటూ ప్రచారం

- నేడు తమకే కావాలంటూ బీజేపీ పట్టు
- ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్న పోతిన మహేశ్
- తాజాగా బీజేపీ తరఫున మల్లాది విష్ణు పేరు..?

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విజయవాడ పశ్చిమ సీటుపై పీటముడి పడింది. నిన్నటి వరకు జనసేన ఖాతాలో ఉన్న ఈ సీటుపై నేడు సస్పెన్స్ నెలకొంది. టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో సోమవారం జరిగిన చర్చల్లో సీట్ల సర్దుబాటులో భాగంగా విజయవాడ పశ్చిమ సీటును బీజేపీ కోరినట్లు సమాచారం.

మారుతున్న సమీకరణలు

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో మొత్తం 14 స్థానాలకు 10 టీడీపీ తన అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించింది. మరో నాలుగు స్థానాలకు గాను మైలవరం, పెనమలూరుల్లో టీడీపీ తన అభ్యర్థులనే బరిలోకి దించనుంది. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పశ్చిమ, కృష్ణాజిల్లాలో అవనిగడ్డ స్థానాలను జనసేనకు కేటాయించారు. అయితే, అనూహ్యంగా సోమవారం సీన్ మారింది. పొత్తుల సర్దుబాటులో భాగంగా పశ్చిమను బీజేపీ కోరినట్లు సమాచారం. అయితే, ఈ స్థానాన్ని వారికి కేటాయిస్తారా, లేక జనసేన తన అభ్యర్థినే బరిలోకి దింపుతుందా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇక్కడి నుంచి జనసేన అభ్యర్థిగా పోతిన మహేశ్ పేరు ప్రచారంలో ఉంది. ఆయన ప్రచారంలో కూడా దూసుకుపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన అభ్యర్థిత్వాన్ని మారుస్తారా అన్నది ప్రశ్నార్థకం. జనసేన ఇక్కడ వెనుకంజ వేసే పరిస్థితుల్లో పార్టీ శ్రేణుల్లోనూ వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. మరోవైపు ఈ స్థానం బీజేపీ ఖాతాలో పడితే ఇక్కడి నుంచి ఎవరు పోటీ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, వైసీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు బీజేపీ తీర్థం పుచ్చుకుని పశ్చిమ నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం నడుస్తోంది. వన్‌టౌన్ బ్రాహ్మణ వీధికి చెందిన ఎన్‌ఆర్‌ఐ గొలగాని రవికృష్ణ ఇటీవలే బీజేపీలో చేరారు. ఆయన పేరు కూడా వినిపిస్తోంది. ఏదేమైనా ఒకటి రెండు రోజుల్లో ఈ స్థానంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఏసీబీలో అంతర్గత విచారణ

ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ ధర్మసింగ్ కేసులో అనుమానాలు

- ఐదుగురు అధికారులపై వేటుకు అదే కారణమా..
- కొద్దిరోజుల క్రితమే పోలీసు శాఖకు సరెండర్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఏసీబీ అధికారులు వేసిన ట్రాప్ మిస్ అయ్యిందంటే దాన్ని అధికారులు తీవ్రంగా పరిగణిస్తారు. అధికారులు పక్కాగా వేసిన స్కెచ్ ట్రాక్ తప్పిందంటే ఎక్కడో సమాచారం లీక్ అయినట్టే. ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ లాలా బాలనాగ ధర్మసింగ్ వ్యవహారంలో ఇదే జరిగిందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ధర్మసింగ్ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని ఏసీబీ సీఐయూ అధికారులు సోదాలు చేసి మూడు నెలలు దాటింది. దాడుల రోజున అజ్ఞాతంలోకి వెళ్లిన సింగ్ ఇప్పటి వరకు ఏసీబీకి చిక్కలేదు. అతడు ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదని ఏసీబీ వర్గాలు చెబుతున్నాయి. ఏసీబీ జిల్లా అధికారులు కొంతమంది ధర్మసింగ్ విషయంలో సానుకూల ధోరణితో వ్యవహరించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒకపక్క ఆయనపై ఏసీబీ ప్రధాన కార్యాలయానికి వరుస ఫిర్యాదులు వెళ్తే జిల్లా అధికారులు ఇచ్చిన నివేదికలు గోడ మీద పిల్లి వాటంలా ఉన్నాయని తెలుస్తోంది.

ఏం జరిగింది?

ఏదైనా ఒక అధికారిపై ఏసీబీ ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదులు అందినప్పుడు వాటిని సంబంధిత జిల్లా యూనిట్ అధికారులకు పంపుతారు. అధికారుల బృందం ఆ అధికారి పనిచేస్తున్న కార్యాలయంలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తుంది. ఆయనకు ఎవరెవరు కలెక్షన్ ఏజెంట్లుగా పనిచేస్తున్నారు.. పనులపై వచ్చే వారి నుంచి కలెక్షన్లు ఎలా చేస్తున్నారు.. వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. అనంతరం ఒక నివేదికను రూపొందించి ఏసీబీ ప్రధాన కార్యాలయానికి పంపాలి. ఆ తర్వాత ఎప్పుడు, ఏ సమయంలో ట్రాప్‌కు వెళ్లాలో అధికారులు నిర్ణయిస్తారు. జిల్లా ఏసీబీ యూనిట్‌లో డీఎస్పీలు శరత్, శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు కృపానందం, శివకుమార్, కానిస్టేబుల్ సురేష్ సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ ధర్మసింగ్‌పై ప్రధాన కార్యాలయానికి అనేక ఫిర్యాదులు వెళ్లాయి. అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసిన ఈ అధికారులు రూపొందించిన నివేదిక లోపభూయిష్టంగా ఉన్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. ధర్మసింగ్ వసూళ్లకు సంబంధించి ఆధారాల సహా ఫిర్యాదులు వెళ్లాయి. జిల్లా యూనిట్ అధికారులు ఇచ్చిన నివేదికను చాలా తటస్థంగా రూపొందించినట్టు తెలిసింది. జిల్లా నుంచి వెళ్లిన ప్రతి నివేదిక ఈ మాదిరిగానే ఉండటంతో సీఐయూ అధికారులకు అనుమానాలు వచ్చాయి. నేరుగా ఆ విభాగానికి చెందిన బృందాలే రంగంలోకి దిగాయి. అప్పటి వరకు ఇంట్లో ఉన్న ధర్మసింగ్ వెనుక వైపు నుంచి పారిపోయాడు. దీంతో జిల్లాలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిపై అనుమానాలు మరింత బలపడ్డాయి. కొద్దిరోజుల క్రితమే ఈ ఐదుగురిని ఏసీబీ నుంచి పోలీసు శాఖకు సరెండర్ చేశారు. ఈ అధికారులు నాడు పంపిన నివేదికలను దగ్గర పెట్టుకుని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో అధికారులు అంతర్గతంగా విచారణ చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. సాధారణ బదిలీల్లో భాగంగానే ఈ బదిలీలు జరిగాయని అధికారులు బయటకు చెబుతున్నారు. అసలు విషయం బయటకు వస్తే ఏసీబీపై చెడుముద్ర పడుతుందని విచారణ అంశాన్ని బయటకు పొక్కనీయడం లేదని తెలుస్తోంది.



కేంద్ర మంత్రికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

దుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి

బీజేపీ-జనసేన-టీడీపీ అభ్యర్థుల ఎంపిక నిమిత్తం విజయవాడ వచ్చిన కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సోమవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయఅధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు. - **వన్‌టౌన్**



ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న రైతులు, నేతలు

ధాన్యం డబ్బుల కోసం ధర్నా

ఉయ్యూరు, మార్చి 11 : సిద్ధం సభలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ధాన్యం తోలిన రైతులకు డబ్బులు చెల్లించడానికి చేతులు రావడంలేదని టీడీపీ, జనసేన నేతల ఆధ్వర్యంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించాలని డిమాండ్‌చేస్తూ రైతులు టీడీపీ, జనసేన నేతలతో కలిసి సోమవారం ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పెనమలూరు ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి ధాన్యం తోలిన రైతులకు జనవరి నెల నుంచి డబ్బురాక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దగా చేస్తున్న ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. టీడీపీ నాయకులు కుటుంబరావు, శ్రీనివాసరావు, ప్రభాకర్, వెలగపూడి శంకర్‌బాబు, పూర్ణచంద్రరావు, కుటుంబరావు, కుప్పాల అంజిబాబు, జనసేన నాయకులు జ రుగు ఆదినారాయణ, ముప్పారాజు, శివ ప్రసాద్, కార్తికేయ, చినకోటయ్య, మహాలక్ష్మి రైతులు పాల్గొన్నారు.



సభలో నేతలు ప్రసంగిస్తుండగానే బయటకు వెళ్లిపోతున్న మహిళలు

బాబోయ్ వైసీపీ సభ..!

- నేతల ప్రసంగాలు వినలేక.. మధ్యలోనే మహిళల పలాయనం

ఇబ్రహీంపట్నం, మార్చి 11 : పార్టీ అధినేత బాటలోనే.. వైసీపీలో కిందిస్థాయి నేతలు కూడా ఊకదంపుడు ప్రసంగాలు చేస్తుండటంతో.. భరించలేక గ్రామాల్లో సభల నుంచి మహిళలు పలాయనం చిత్తగిస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలం పరిషత్ కార్యాలయంలో సోమవారం చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో చోటా మోటా నాయకులు మాట్లాడుతుండగానే పలువురు మహిళలు లేచి వెళ్లిపోవడం కనిపించింది. గంటల తరబడి నేతల పసలేని ప్రసంగాలు వినలేక మహిళలు లేచి వెళ్లిపోయారు. గతంలో డ్వాక్రా రుణమాఫీ చెక్కుల పంపిణీ సమయంలో గేట్లు వేసి సభను నిర్వహించడంతో పెద్ద ఎత్తున మహిళలు తిరగబడ్డారు. దాంతో గేట్లు తీసి సభను నిర్వహించంతో మహిళలు సభ నుంచి వెళ్లిపోయారు. సభ మధ్యలోనే సగానికి ఖాళీ అయ్యింది.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు!

- లారీలను అడ్డుకున్న గ్రామస్థులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు



విజయవాడ రూరల్, మార్చి 11 : విజయవాడరూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో అక్రమ మైనింగ్ యదేచ్ఛగా జరుగుతోంది. అధికార పార్టీ నేతలు అర్ధరాత్రి సమయంలో అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ టీడీపీ నేతలు, గ్రామస్థులు ఆదివారం అర్ధరాత్రి గ్రామ శివారుల్లో మైనింగ్ లారీలను అడ్డుకున్నారు. నాలుగు లారీలను అడ్డుకుని అధికారులకు సమాచారం అందించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై సోమవారం గ్రామస్థులతో కలసి టీడీపీ నేతలు జిల్లా కలెక్టర్ దిల్లీరావుకు స్పందనలో ఫిర్యాదు చేశారు.

ఉత్కంఠభరితంగా ఎడ్ల పూటీ లాగుడు పోటీలు

- సీనియర్ విభాగంలో కృష్ణా, జూనియర్‌లో గుంటూరు ఎడ్ల గెలుపు

నందిగామ రూరల్, మార్చి 11: మహాశివరాత్రి సందర్భంగా దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద రైతుకమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల పూటీ లాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. సీనియర్ ఎడ్ల జత పోటీలను ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఎనిమిది జతల ఎడ్లు పాల్గొన్న విభాగంలో రెండు క్వింటాళ్లు 10 నిమిషాల వ్యవధిలో అరుగురు వ్యక్తులతో పోటీలు సాగాయి. జూనియర్ ఎడ్ల విభాగంలో గుంటూరు జిల్లా కాకుమారు మండలం గార్లపాడు గ్రామానికి చెందిన రామినేని శ్రీనివాసరావు ఎడ్ల జత 3,843 అడుగుల దూరం కృష్ణాజిల్లా కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన వెలిశెట్టి ఉమామహేశ్వరరావు, బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం రాజోలుకు చెందిన వాకా నాగబాబు ఎడ్ల జత 3,789 అడుగుల దూరం లాగి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెద్దపుడి గ్రామానికి చెందిన ఆళ్ల హరికృష్ణ ఎడ్లు 3,646 అడుగులు లాగి మూడో స్థానంలో నిలవగా బాపట్ల జిల్లా కొత్తూరు మండలం, అనంతవరానికి చెందిన లీలాసాయి మనోహర్ ఎడ్లు 3,553 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలిచాయి. దాతలు కొమ్మినేని రవిశంకర్, కోవెలమూడి వెంకట నారాయణ, నిడమానూరు నరసింహారావు, మహేశ్వరరావు, వంశీకృష్ణ, చెరుకూరి రమేష్ యూత్ ఎడ్ల యజమానులకు రూ. 30 వేలు, 20 వేలు, 15 వేలు, 10 వేల నగదును అందజేశారు.

● సీనియర్ విభాగంలో కృష్ణాజిల్లా కోడూరు మండలం విశ్వనాథపల్లికి చెందిన వెలిశెట్టి ఉమామహేశ్వరరావు ఎడ్ల జత 4,144 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలవగా కంచికచర్ల మండలం మోగులూరు గ్రామానికి చెందిన షేక్ ఖాజీ ఎడ్లు 3,900 లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఎమ్మినేనివారిపాలెంకు చెందిన ఎమ్మినేని రుష్యేంద్ర కుమార్‌కు చెందిన ఎడ్ల జత 3,734 దూరం లాగి మూడవ స్థానంలో, తోట్లవల్లూర్లు మండలం చిన్నపులిపాక ఆర్‌బిఎస్ బుల్స్ ఎడ్లు 3,642 అడుగుల దూరం లాగి నాలుగవ స్థానంలో నిలిచాయి. రూ. 25 వేలు, 15 వేలు, 10 వేలు, 7,500లను దాతలు చిట్టూరి రవీంద్రబాబు, చెరుకూరి రమేష్, నాదెండ్ల శ్రీనివాస చౌదరి, కోవెలమూడి వెంకటేశ్వరరావు, కొలకలూరి వెంకటేశ్వరరావులు అందజేశారు. రైతు కమిటీ సభ్యులు వట్టికొండ చంద్రమోహన్, కొలకలూరి వెంకటేశ్వరరావు, గుత్తా సురేష్, ఈదర వెంకట్రావ్, శ్రీహరి, కనగాల రాంబాబు, మందా రవికుమార్, పురుషోత్తం, వెంకయ్య, వెంకటరెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఉత్కంఠభరితంగా సాగుతున్న పోటీలు

ఐదేళ్ల వైసీపీ పాలనలో

కుంటుపడిన గ్రామాభివృద్ధి

- పంచాయతీలు నిర్వీర్యమయ్యాయి : ఎమ్మెల్యే వసంత




సమావేశంలో మాట్లాడుతున్న వసంత వెంకట కృష్ణ ప్రసాద్

జి.కొండూరు, మార్చి 11 : కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం వైసీపీ ప్రభుత్వం జమ చేసుకోవడంతో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం కావడమే కాక గ్రామాభివృద్ధి కుంటుపడిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరు, గడ్డమణుగు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా వసంత మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ నిర్వాకానికి చాలా గ్రామాల్లో నిధుల్లేక చిన్న చిన్న పనులు కూడా చేయలేక ప్రజా ప్రతినిధులుగా ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. అంగబలం, అర్థబలంతో పాటు అధికారం చేతిలో ఉండటంతో మరో మారు అధికారంలోకి వచ్చేందుకు జగన్ ప్రయత్నిస్తున్నాడని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. ఏపీలో శాంతి భద్రతల సమస్య ఉందన్నారు. విధాన పరమైన ఎన్నో లోపాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. రాజ్యాంగం సైతం అపహాస్యమవుతుందన్నారు. టీడీపీ-జనసేన అధికారంలోకి వస్తేనే వీటన్నింటికి పరిష్కారం లభిస్తుందన్నారు. మైలవరం అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమన్నారు. అభివృద్ధి-సంక్షేమం తనకు రెండు కళ్లలాంటివన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి 2024లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని అధికారంలోకి తీసుకువద్దామని పిలుపునిచారు. తెలుగుదేశంలో చేరి మీలో ఒకడిగా మీతో కలిసి నడవడానికి మీ వద్దకు వచ్చానని స్పష్టం చేశారు. చింతలపూడి పూర్తి చేయడంతో పాటు తారకరామ చివరి భూములకు సాగునీరు అందించేందేలా ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో కోమటి సుధాకర్, జంపాల సీతారామయ్య, కె.విజయబాబు, బొర్రా అశోక్ కుమార్, ఉయ్యూరు వెంకట నరసింహారావు, పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ, గడ్డమణుగు ఎంపీటీసీ నూతక్కి అపర్ణ, నూతక్కి రాజారావు, అప్పసాని వెంకటేశ్వరరావు (వెంకయ్య), నెప్పల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ వైఫల్యాలకు పరాకాష్ట..

మేదరమెట్ల సభ అట్టర్‌ఫ్లాప్

- నెట్టెం రఘురాం ధ్వజం



జగ్గయ్యపేట, మార్చి 11 : జగన్ ఇచ్చిన హామీల్లో 85 శాతం అమలు చేయకుండా మాట తప్పి ప్రజా విశ్వాసం కోల్పోయాడని, అందుకు పరాకాష్ట మేదరమెట్ల సభ అట్టర్ ఫ్లాప్ కావటమే అని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. సోమవారం విలేకర్లతో నెట్టెం మాట్లాడుతూ, 6 జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి వందల సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేసినా లక్ష మంది కూడా హాజరు కాలేదని, గ్రాఫిక్స్‌తో జగన్ మీడియా వైఫల్యాలను కప్పిపుచ్చి ప్రచారం చేసుకుంటోందని, అసలు రంగు బయట పడుతుందనే మీడియాను అనుమతించలేదని ఆరోపించారు. అంతా బాగా చేశానని చెప్పుకుంటున్న జగన్ రెడ్డి ప్రతిపక్షాల ఐక్యతను చూసి ఎందుకు భయపెడతున్నాడని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నేరవేర్చాననే చెప్పుకుంటున్న జగన్‌ను ప్రజలు విశ్వసించటం లేదని, ఎన్నికల్లో ఓటమి తప్పదని అన్నారు.



దళిత క్రైస్తవుల్ని ఎస్సీలుగా గుర్తించింది టీడీపీనే : కేశినేని చిన్ని

లక్ష్మీపురం(తిరువూరు)మార్చి 11 : దళిత క్రైస్తవుల్ని ఎస్సీలుగా గుర్తించింది టీడీపీ ప్రభుత్వమే అని, తిరిగి టీడీపీ ప్రభుత్వం రావడం ద్వారా క్రైస్తవ కార్పొరేషన్ ఏర్పాటు జరుగుతుందని విజయవాడ పార్లమెంట్ టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని)అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీపురంలో జరిగిన పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాస్‌తో కలిసి చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వంలో క్రిస్మస్ కానుకను అందిస్తే వైసీపీ ప్రభుత్వం పండగనాడు పేదప్రజల్ని పస్తులకు గురిచేసిందని విమర్శించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, పిల్లల బంగారు భవిష్యత్ కోసం టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

గుణదల, మార్చి 11 : కృష్ణానదికి వరద నివారణ ప్రహరీ రివర్ ఫ్రంట్ పార్క్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా తెలిపారు. రివర్‌ఫ్రంట్ పార్క్ ప్రారంభకార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరుకానున్నారన్నారు. దీంతో గుంటూరు వైపు నుంచి విశాఖపట్నం, హైదరాబాద్ అలాగే విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే కార్లు చిన్న వాహనాలు కనకదుర్గ వారధిపై అనుమతించబడవని చెప్పారు. మంగళగిరి లేదా తాడేపల్లి నుంచి ప్రకాశం బ్యారేజ్ మీదుగా విజయవాడలోకి అనుమతించడం జరుగుతుందన్నారు. విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్లాల్సిన కార్లు చిన్న వాహనాలు కృష్ణలంక జాతీయ రహదారి నుంచి ప్రకాశం బ్యారేజి మీదుగా వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. కృష్ణా నది ప్రహరీ రివర్ ఫ్రంట్ పార్క్ ప్రారంభోత్సవానికి హాజరయ్యేవారు నేతాజీ జంక్షన్ నుంచి రాణిగారితోట సర్వీసు రోడ్డు నుండి సిమెంట్ గోడౌన్ రోడ్డుమీదుగా వారధి క్రింద కృష్ణా రివర్ మైదానంలో పార్క్ చేసుకోవాలని సూచించారు. నగర ప్రజలు సహకరించాలని కోరారు.

స్పందన అర్జీలు పరిష్కరించాలి: కలెక్టర్

కృష్ణలంక : స్పందనలో వచ్చిన అర్జీలను అధికారులు నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని, అర్జీదారులకు సత్వర న్యాయాన్ని అందించడమే అధికారుల ప్రధాన లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. స్పందనలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావులు అర్జీదారుల వినతులు స్వీకరించారు. జిల్లాస్థాయి స్పందనలో 121 అర్జీలు నమోదు కాగా.. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన అర్జీలను అలసత్వం లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు ఏ స్థాయిలోను రీ ఓపెన్‌కాకుండా వుండాలన్నారు. అర్జీలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. డ్వామ పీడీ జె.సునీత, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిబద్ధత అవసరం : కలెక్టర్

వన్‌టౌన్: ఎన్నికల విధుల పట్ల పూర్తిస్థాయి నిబద్దత ముఖ్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల్లో వ్యయ నిర్వహణకు సంబంధించి విధివిధానాలు రిజిస్టర్‌ల రోజువారీ నివేదికలు, వివిధ ఫారాలు, రేట్ల చార్ట్‌లు, పె యిడ్ న్యూస్, మీడియా మానిటరింగ్‌లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా హ్యాండ్‌బుక్‌లు, మ్యానువల్‌లు, చెక్ లిస్టులను ఉపయోగించుకుని మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. జేసీ పి.సంపత్‌కుమార్, వ్యయపర్యవేక్షణ నోడల్ అధికారులు సీహెచ్ శైలజా, ఎస్‌వీ శివప్రసాద్ యాదవ్, డీపీవోఎస్.శ్రీనివాసరెడ్డి, డీఐపీఆర్‌వో యూ.సురేంద్రనాథ్ పాల్గొన్నారు.



పాల ఉత్పత్తుల తయారీని పరిశీలిస్తున్న నిరంజన్, శ్రీనివాస్ ఆంజనేయులు

అత్యాధునిక సాంకేతికతతో పాల ఉత్పత్తులు

- తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు
- వీరవల్లి కామధేను(విజయ)ఫ్యాక్టరీని సందర్శించిన తానా, నాట్స్ సభ్యులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 11: అంతర్జాతీయ సాంకేతికతతో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా పాల ఉత్పత్తులను తయారు చేస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ అభినందనీయమని తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు కొనియాడారు. వీరవల్లిలోని కామధేను(విజయ) పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీని తానా సభ్యులు, నాట్స్ మాజీ చైర్మన్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. అతితక్కువ కాలంలో ఫ్యాక్టరీని స్థాపించి ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావడంలో చైర్మన్ చలసాని ఆంజనేయులు కృషిని అభినందించారు. పాడిరైతు కుటుంబాలకు అండగా వినూత్న పథకాలతో రూ.600కోట్ల టర్నోవర్‌ను రూ.1200కోట్లకు పెంచడంలో చలసాని కృషి నిరుపమానమన్నారు. కృష్ణామిల్క్ యూనియన్‌తో తానా, నాట్స్ కలిసి పాడిరైతుల సర్వతోముఖాభివృద్ధి తమ వంతు సహకారం అందిస్తామని నిరంజన్ శృంగవరపు తెలిపారు. పాల ఉత్పత్తులు గులాబ్‌జామ్, జున్నులను రుచి చూశారు. అనంతరం వారిని చైర్మన్ చలసాని ఆంజనేయులు ఘనంగా సత్కరించారు. నాట్స్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గుత్తికొండ, తానా ఫౌండేషన్ ట్రస్టీ సురేష్ పుట్టగుంట, తాతినేని మధు, గొట్టిపాటి వెంకటరామకృష్ణప్రసాద్, మణిధర్, గుత్తికొండ సుభాష్ చంద్రబోస్‌తో పాటు ప్లాంట్ మేనేజర్ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారుల ఆక్రందనలను పట్టించుకోవాలి



వన్‌టౌన్, మార్చి 11: ఆహుతులకు, కళాపోషకులకు, కళాభిమానులకు మానసికోల్లాసం కలిగించే కళాకారులు నేడు ఆకలిదప్పులతో ఆక్రోసిస్తున్నారని రాష్ట్ర నటీనట, నాట్య వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ధర్నాచౌక్‌లో కళాకారుల ధర్నాలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాకారులు, కళాసంస్థలు ఐకమత్యంగా డిమాండ్ల సాధనకు ప్రయత్నించాలన్నారు. బొబ్బిళ్ల పాటి శ్రీ గోపాలకృష్ణ సాయి, చింతా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటికే నిర్వహించిన కార్యక్రమాలకు రూ.11 కోట్లు, పెన్షన్ రూ.12.5 కోట్లు బకాయిలు రావాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, బాలాజీ నాయుడు, గోళ్ల నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు, జోగిపర్తి శంకర్‌రావు, లక్ష్మీకరుణ, లక్ష్మీ, రసూల్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో కులస్థుల భవనంపై

మహిళా ప్రజాప్రతినిధి కన్ను!

- ● ఉచితంగా కాటేజీ ఇవ్వాలని డిమాండ్ ● కుదరదన్న కమిటీ
- ● వ్యతిరేకవర్గాన్ని ప్రోత్సహిస్తూ దౌర్జన్యం ● ఈవోకు ఫిర్యాదు

వన్‌టౌన్, మార్చి 11: శ్రీశైలంలో నిర్మిస్తున్న నగరాల నిత్యాన్నదాన వసతి సత్రం భవనంలో ఉచితంగా తమ కుటుంబం పేరుతో కాటేజీలు కేటాయించాలని వీఎంసీలోని కీలక పదవిలో ఉన్న ఓ మహిళ, ఓ దేవస్థానం కమిటీ సభ్యుడు సత్రం కమిటీపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. సత్రం కమిటీ బైలా నిబంధనల ప్రకారం కమిటీలో నగరాల సామాజిక వర్గానికి చెందిన వారెవరైనా సభ్యత్వం తీసుకోవాలంటే రూ.10,116 చెల్లించాలని నిబంధనలు విధించారు. దాతలెవరైనా పెద్దమొత్తంలో విరాళాలిస్తే ఆ దాత భార్యభర్తల పేర్లను శిలాఫలకాలపై ప్రకటిస్తారు.భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో సుమారు 100 కాటేజీలు చేపట్టనున్నారు. ఎవరైనా దాతలు రూ.12లక్షలు విరాళంగా ఇస్తే వారి పేర్లను కాటేజీ శిలాఫలకాలపై రాయనున్నారు. అయితే వీఎంసీలో కీలక పదవిలో ఉన్న ఆ మహిళ, ఒక దేవస్థానం కమిటీలో మెంబర్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి తమకు ఉచితంగా కాటేజీలు కేటాయించి శిలాఫలకాలపై తమ కుటుంబ సభ్యుల పేర్లు రాయాలని కమిటీలో ఒత్తిడి తెస్తున్నారు. కీలకమైన వారు పూర్తిగా వ్యతిరేకిస్తుండటంతో ఆ మహిళా వ్యక్తిగత కక్ష్యతో కమిటీని రెండుగా చీల్చినట్లు విమర్శలు వస్తున్నాయి. బాధ్యత గల పదవిలో ఉన్న ఆమె నగరాల సామాజికాభివృద్ధికి, కులస్థుల నిత్యాన్నదాన వసతి అభివృద్ధికి సహకరించకుండా స్వార్థంగా వ్యవహరించడం సరైనది కాదని కులస్థులే విమర్శిస్తున్నారు. తనకున్న అధికారాన్ని ఉపయోగించి వసతిసత్రం నిర్మాణం పూర్తి చేయనీయకుండా అడ్డుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి.

శ్రీశైలం దేవస్థానం ఈవోకు ఫిర్యాదు: కొరగంజి జగన్

బైలా నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కమిటీ ప్రెసిడెంట్, కోశాధికారి, ఇతర సభ్యులపై కమిటీ ఫౌండర్, ప్రధాన కార్యదర్శి కొరగంజి జగన్ శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి (ఈవో) డి.పెద్దిరాజుకు ఫిర్యాదు చేశారు. సత్రం వద్ద విధులు నిర్వహిస్తున్న వాచ్‌మెన్‌ను కొట్టి అతడి నుంచి బలవంతంగా తాళాలు లాక్కుని నిబంధనలకు వ్యతిరేకంగా గదులు అద్దెకిస్తూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఈవోకు ఫిర్యాదు చేశారు. రెండు మూడ్రోజుల్లో మంత్రి సత్యనారాయణను కలిసి వారిపై ఫిర్యాదు చేస్తానని జగన్ తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలని ఆమరణ దీక్ష

ఉయ్యూరు, మార్చి 11: గురజాడ డొంకలో సమాధుల స్థలం వద్ద ఆక్రమణలు తొలగించాలని కోరుతూ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన సోమవారం 4వ రోజుకు చేరుకుంది. సమాధులకు వెళ్లేందుకు దారి లేకుండా కొందరు వేసిన పాకలతో ఇబ్బంది పడుతున్నామని వాటిని తొలగించి దారి చూపించాలని కోరుతూ క్రైస్తవ సంఘాలు సీబీఎం చర్చి వద్ద చేపట్టిన దీక్ష 4వ రోజు పరిమి దీపక్‌కుమార్ ఆమరణదీక్ష చేపట్టారు. 5వ వార్డు కౌన్సిలర్ పరిమి సలోమి సంతోషి, పరిమి భాస్కర్, జాన్ డేవిడ్, పుల్లయ్య దీక్షలో కూర్చున్నారు. సమాధుల స్థలంలో ఆక్రణలు తొలగించాలని డిమాండ్ చేస్తూ క్రైస్తవ సంఘాలు చేపట్టిన దీక్షా శిబిరాన్ని టీడీపీ, జనసేన నేతలు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. టీడీపీ నేతలు బోడె ప్రసాద్, కుటుంబరావు, సుధారాణి, నాగభూషణరావు, పలువురు జనసేన నేతలు సంఘీభావం తెలిపారు. సమాధుల వద్ద ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్డీవో రాజు, నగరపంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు, సమాధుల స్థలాన్ని పరిశీలించి అడ్డుగా ఉన్న పాకలు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. వారు ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

ఎంపీ బాలశౌరి చొరవతో

రూ.35కోట్ల రుణాలు

- డెయిరీఫాం, మత్స్యసంపదను విక్రయించే వారికి రుణాలు
- తొలివిడతగా రూ.5కోట్ల పంపిణీ

మచిలీపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిచొరవతో మచిలీపట్నం పార్లమెంటు నియోకవర్గపరిధిలోని బీసీలకు రూ.5కోట్ల మేర రుణాలను తొలివిడతగా వివిధ బ్యాంకుల ద్వారా అందజేశారు. మచిలీపట్నంలోని శుభం కన్వెన్షన్‌హాలులో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 110 మంది లబ్ధిదారులకు రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం, ముద్ర రుణాలద్వారా పాడిపరిశ్రమ, డైరీఫాం, మత్స్యసంపద విక్రయాలకోసం ముస్లింలు, మత్స్యకారులు, ఇతర బీసీ వర్గాలు వ్యాపారం చేసుకునేందుకు రుణాలను అందించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 54 మంది లబ్ధిదారులకు రూ.2కోట్లు, యూనియన్ బ్యాంక్ ద్వారా 25మంది లబ్ధిదారులకు కోటి రూపాయలు, ఇండియన్ బ్యాంక్‌ద్వారా 10మంది లబ్ధిదారులకు కోటి రూపాయలు, కెనరా బ్యాంక్ ద్వారా ఆరుగురు లబ్ధిదారులకు రూ.40లక్షలు, బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 10 మంది లబ్ధిదారులకు రూ.60 లక్షలను మెగా లోన్‌మేళాలో రుణాలుగా అందించారు. తమకు రుణాలు ఇప్పించిన ఎంపీ బాలశౌరికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

మరిన్ని రుణాలు అందిస్తాం : బాలశౌరి

మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని పేదలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వివిధ బ్యాంకుల ద్వారా కేంద్రప్రభుత్వం, వివిధ బ్యాంకుల సహకారంతో రుణాలు ఇప్పించే ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తామని ఎంపీ వల్లభనేని బాలశౌరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, యువతకు విరివిగా రుణాలు అందించేందుకు తనవంతు కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. తొలి విడతగా రూ.5కోట్లను వివిధ బ్యాంకుల ద్వారా రుణాలుగా ఇప్పించామని, మలివిడతలో మరో రూ.30 కోట్లను లబ్ధిదారులకు రుణాలుగా ఇచ్చేందుకు అన్నిచర్యలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు. సాంకేతిక కారణాలతో రూ.30కోట్లరుణాలు ఇవ్వడంలో జాప్యం జరిగిందని, సాధ్యమైనంత త్వరలో ఈ రుణాలను మంజూరు చేస్తామని తెలిపారు. కుటుంబాలను చక్కదిద్దడంతో మహిళలపాత్ర కీలకమైనదని, ఈ కారణంతోనే అధికశాతం మహిళలకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకు అధికారులతో స్వయంగా మాట్లాడినట్టు తెలిపారు. రుణాలు పొందిన వారు తమ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, పిల్లలను ఉన్నతంగా చదివించాలని ఆయన సూచించారు. ముద్ర, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకాల ద్వారా ఎస్‌బీఐ నుంచి రూ.22కోట్లు, యూనియన్‌బ్యాంక్ ద్వారా రూ.9కోట్లు, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ద్వారా ఒక కోటిరూపాయల చొప్పున, కెనరా బ్యాంక్ ద్వారా రూ. 3కోట్లను రుణాలుగా ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేసినట్టు ఎంపీ తెలిపారు.

160 మంది కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు

మచిలీపట్నం టౌన్, మార్చి 11 : కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న 160 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి ఉత్తర్వులు జారీచేశారు. 29 మంది మల్టీపర్పస్ అసిస్టెంట్లు, 120 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, ఐదుగురు మెడడికల్ ల్యాబ్ టెక్నీషీయన్లకు సోమవారం నాడు ఉత్తర్వులు అందచేశారు.

ఇగ్నో ప్రవేశాలకు గడువు పొడిగింపు

వన్‌టౌన్, మార్చి 11 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం(ఇగ్నో) జనవరి-2024 సెషన్‌కు ఆన్‌లైన్ ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేట్, డిగ్రీ, పీజీ డిప్లొమా, డిప్లొమా ప్రోగ్రాంలకు దరఖాస్తుల స్వీకరణ ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరక్టర్ దోనేపూడి రామాంజనేయ శర్మ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ రెండు, మూడో సంవత్సరం, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు కూడా రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా మార్చి 20వ తేదీ వరకు రూ.200 ఆలస్య రుసుంతో చెల్లించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866-2565253 ఫోన్ ద్వారా సంప్రతించవచ్చని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

బాలికపై అత్యాచారం.. ముగ్గురిపై దిశ కేసు నమోదు

కృత్తివెన్ను, మార్చి 11 : బాలికపై అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన ముగ్గురు యువకులపై సోమవారం దిశ చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.నాగరాజు తెలిపారు. మండల పరిధిలోని ఒర్లగొందితిప్ప గ్రామానికి చెందిన మానసిక స్థితి సరిగాలేని బాలిక (14) తల్లిదండ్రులు నిల్వ పనుల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లిన సమయంలో గ్రామానికి చెందిన సమీప బంధువులైన ముగ్గురు యువకులు జల్లా ఏసురాజు (29), చెక్క కృపారాజు (28), రేవు వీర్రాజు (27)లు కొంతకాలంగా అత్యాచారానికి పాల్పడుతున్నారు. బాలిక ఆరోగ్యంపై సందేహం వచ్చిన తల్లి బాలికను ఆసుపత్రికి తీసుకెళ్లగా నాలుగో నెల గర్భవతిగా వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆరా తీసి ముగ్గురు యువకులపై మచిలీపట్నం దిశ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు వివరించారు.

వ్యాన్ ఢీకొని బాలిక మృతి



మోపిదేవి, మార్చి 11 : చేపల లోడు వ్యాన్ ఢీకొని బాలిక(8) మృతి చెందిన ఘటన మండలంలోని కొక్కిలిగడ్డలో కృష్ణా కరకట్టపై సోమవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మద్దూరు గ్రామానికి చెందిన విద్య అమ్మమ్మ ఊరు బొబ్బర్లంక వచ్చింది. సోమవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి కరకట్ట దిగువన ఉన్న కాలువలో చేపలు పట్టుకునేందుకు వచ్చింది. ఈలోగా దాహం వేయడంతో మంచినీళ్లు తాగేందుకు వచ్చి రోడ్డు దాటుతుండగా, విజయవాడ వైపు నుంచి వస్తున్న చేపల లోడు వ్యాను బాలికను బలంగా ఢీకొట్టింది. బాలికను స్థానికులు హుటాహుటిన అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మోపిదేవి పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. సరదాగా అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలికను వ్యాన్ రూపంలో మృత్యువు కబళించటంతో కుటుంబసభ్యులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతం మిన్నంటింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.33

ఆటోస్టాండ్ జెండా ఆవిష్కరణ

భవానీపురం, మార్చి 11 : ఆటో కార్మికులకు ఆటోమిత్ర కింద ఇచ్చేది కొంతైతే తరుచూ ఫైన్ రూపంలో వసూలు చేసేది కొండంతని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు అన్నారు. 43వ డివిజన్ ఊర్మిళానగర్ సెంటర్‌లో భగత్‌సింగ్ ఆటోస్టాండ్(ఏఐటీయూసీ) జెండాను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రమాదాల నివారించేందుకు కృషి చేయాలన్నారు. స్థానిక కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



టీడీపీ-జనసేన కూటమి విజయం తథ్యం

పటమట, మార్చి 11 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం సాధించడం తథ్యమని టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. పటమట ఎన్ఎస్ఎం స్కూల్ గ్రౌండ్‌లో వాకర్స్‌ను ఆయన ఆత్మీయంగా పలకరించారు. ఎన్ఎస్ఎం వాకర్స్ సభ్యులు గద్దెకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ టీడీపీ-జనసేన పార్టీల కూటమి ని చూసిన తర్వాత వైసీపీ నాయకులకు నిద్రపట్టడం లేదన్నారు. జనసేన-టీడీపీ కూటమి విజయంపై ఏ మాత్రం సందేహం లేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ జనసేన అభ్యర్థులైన ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా కేశినేని చిన్నిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ముమ్మనేని ప్రసాద్, ధనేకుల కృష్ణారావు, దేవినేని సుబ్బారావు, ఎన్.వెంకయ్యబాబు, టి. రంగారావు, ఎం. శ్రీనివాస్, వీరంకి డాంగేకుమారి, అనగాని వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన జగన్‌రెడ్డి

ఎన్నికల ప్రచారంలో అనురాధ విమర్శ

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తుంగలోకి తొక్కి ప్రజలను మోసం చేశాడని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ చెప్పారు. 12వ డివిజన్ అయ్యప్పనగర్‌లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి టీడీపీ-జనసేన ఎమ్మెల్యే, ఎంపీలుగా గద్దె రామ్మోహన్, కేశినేని చిన్నిలను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తూర్పులో ప్రజలు టీడీపీ-జనసేనలకు బ్రహ్మరథం పడుతున్నారని, ఎమ్మెల్యేగా గద్దెను గెలిపించుకుంటామని ముక్తకంఠంతో చెబుతున్నారని అన్నారు. పొట్లూరి సాయిబాబు, శాయన బుజ్జి, ఎం. నారాయణ, మాదాల చిన్నతల్లి, మహ్మద్ ఖలీల్, రాజేశ్వరి, రాంబాబు, జనసేన నాయకులు నీరజ పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎం వాకర్స్ మద్దతు కోరుతున్న గద్దె రామ్మోహన్



అయ్యప్ప నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న గద్దె అనురాధ

ఎన్ఎస్ఎం స్కూల్ వాకర్స్‌తో 'గద్దె'

రామలింగేశ్వరనగర్: ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అనుసరిస్తున్న నిరంకుశ విధానాల వల్ల అభివృద్ధిలో రాష్ట్రం యాభై ఏళ్ల వెనక్కు వెళ్లిపోయిందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గద్దె రాజేష్ అన్నారు. సోమవారం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ లోని సాయిరామ్ రోడ్డులో గద్దె రాజేష్, గద్దె క్రాంతి కుమార్‌లు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని చిన్నిలను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. చిప్పాడ నాగేశ్వరరావు, అమ్ములు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే యువతకు బంగారు భవిష్యత్తు

భారతీనగర్: తూర్పు పరిధి మూడవ డివిజన్ శ్రీ రామ చంద్ర నగర్‌లోని కొత్త రామాలయం రోడ్డులో సోమవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తనయులు గద్దె రాజేష్, గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేసే సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్‌ను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే కేశినేని శివనాథ్‌ను గెలిపించాలని కోరారు. పేరేపి ఈశ్వర్, గద్దె రమేష్, కె. హరీష్, సి.హెచ్. ఈశ్వరరావు, జి.వెంకటేశ్వరారవు, పి.నాగభూషణం, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దించాలి

భవిష్యత్తుకు గ్యారెంటీలో బొండా ఉమా

గవర్నర్‌పేట, మార్చి 11 : ప్రజా కంటకుడిగా మారిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిని ఇంటికి పంపాల్సిన సమయం ఆసన్నమైందని టీడీపీ సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌చార్జి బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం 23వ డివిజన్‌లోని సూర్యారావుపేట టీడీపీ కార్యాలయం వద్ద నుంచి డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ పాదయాత్రను బొండా ప్రారంభించారు. వ్యాపారులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు బొండాకు స్వాగతం పలికారు. ఆయన గడపగడపకు తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా మాట్లాడుతూ జగన్ అన్ని వర్గాలను మోసపుచ్చి లక్షల కోట్లు సంపదను దోచుకున్నారని, ఆయన్ని గద్దె దించి, అనుభవం ఉన్న చంద్రబాబును గద్దెనెక్కిస్తే తప్ప ప్రజల కష్టాలు తీరవని, రాష్ట్రం బాగుపడదని అన్నారు. కార్యక్రమంలో జనసేన సెంట్రల్ ఇన్‌చార్జి బొలిశెట్టి వంశీకృష్ణ, నేతలు ఆలపాటి రాము, చింతా దుర్గారావు, వసంత తదితరులు పాల్గొన్నారు.

ఆర్యకటిక ఆత్మీయ సమావేశం

అజిత్‌సింగ్‌నగర్: సెంట్రల్‌లోని ఆర్యకటిక సామాజికవర్గ ఆత్మీయ సమావేశం అజిత్‌సింగ్‌నగర్‌లోని షాదీఖానాలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా వారితో సమావేశమై పలు విషయాలను చర్చించారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ ఆర్య కటిక సామాజిక వర్గం టీడీపీకి మద్దతు ఇవ్వడం సంతోషకరమన్నారు. అధికారంలోకి రాగానే వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బీసీలకు టీడీపీ అండ : కేశినేని చిన్ని

సత్యనారాయణపురం, మార్చి 11: టీడీపీలో అమలు పరిచిన పథకాలను ఈ జగన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్ల నా ఫౌండేషన్ ద్వారా మెడికల్ క్యాంపులు, కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు, మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. 33వ డివిజన్ సత్యనారాయణ పురంలోని టీడీపీ కార్యాలయంలో డివిజన్‌లో రజక సోదరులకు వారి జీవనోపాధి నిమిత్తం కేశినేని ఫౌండేషన్ సహకారంతో సోమవారం 22 ఇస్త్రీపెట్టెలను బోండా ఉమా మహేశ్వరరావుతో కలిసి కేశినేని శివనాథ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా, కేశినేని చిన్ని మాట్లాడుతూ బీసీలకు అన్ని వేళలా అండగా ఉంది టీడీపీనే అన్నారు. డివిజన్ ఇంచార్జి గార్లపాటి విజయకుమార్, అధ్యక్షుడు ఎన్.కె.రావు, ప్రధాన కార్యదర్శి సి.రవిబాబు, కోశాధికారి సి.శ్రీను, రాష్ట్రకార్యదర్శి నవనీతం సాంబశివరావు, రజక నాయకులు చందలూరి నాగయ్య, బడేటి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



రజకులకు ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేస్తున్న బొండా ఉమామహేశ్వరరావు, కేశినేని శివనాథ్



గాయని పొత్తూరి పద్మను సత్కరిస్తున్న అతిథులు

అలరించిన సంగీత విభావరి

విజయవాడ కల్చరల్, మార్చి 11 : పద్మ మెలోడీస్ 12వ వార్షికోత్సవం పురస్కరించుకొని గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికపై నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. అలనాటి గాయకులు ఘంటసాల ఆపాత మధురాలను శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను మైమరిపించారు. దాదాపు 250 పాటలు పాడి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సాధించిన గాయనీమణి పొత్తూరి పద్మను అతిథులు ఘనంగా సత్కరించారు. సావిత్రి కళాపీఠం అధ్యక్షురాలు పర్చూరి విజయలక్ష్మి, చింతకాయల చిట్టిబాబు, ప్రసూనారామన్, డేవిడ్, రాజు పాల్గొన్నారు.

జగన్ మాటలన్నీ పచ్చి అబద్ధం: ఎంఎస్ బేగ్

విద్యాధరపురం, మార్చి11: బాపట్ల జిల్లా మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభలో సీఎం జగన్ మాట్లాడిన మాటలన్నీ పచ్చి అబద్ధమని టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ అన్నారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ ఎన్నికలలో ఇచ్చిన హామీలను 85 శాతం అమలు పరచకుండా మాట తప్పారని విమర్శించారు. ప్రజల విశ్వాసం కోల్పోయినందుకే మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభకు లక్షమంది కూడా రాలేదని తెలిపారు. 99 శాతం హామీలు అమలు పరిచానని జగన్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలందరూ జగన్‌కు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి బాధాకరం: కోగంటి

మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభలో పారిశుధ్య కార్మికుడు మృతి చెందటం బాధాకరమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కోగంటి రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుడు మృతి చెందిన సంఘటనలో సభ నిర్వాహకులపై కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మసీదుల వద్ద సదుపాయాలు కల్పించాలి

కలెక్టర్‌కు వినతి

మధురానగర్, మార్చి 11: రంజాన్ నెల మంగళవారం నుంచి ప్రారంభం అవుతున్న సందర్భంగా జిల్లాలో మసీదుల వద్ద తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా సదుపాయాలు కల్పించాలని ప్రధానమంత్రి 15 సూత్రాల కమిటీ జిల్లా చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ ఢిల్లీరావుకు సోమవారం కమిటీ సభ్యులు షేక్ అక్బర్,షేక్ మస్తాన్‌లు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ముస్లింలు నిత్యావసర వస్తువులు కొనుగోలుకు అనువుగా నిత్యావసర సరుకులు, పాలు, పండ్లు దుకాణాలు, హోటల్స్‌ను రాత్రి 11.30 వరకు తెరిచి ఉంచేలా పోలీసు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

ఊపందుకున్న ప్రహరీ పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భవానీపురం, మార్చి 11 : 43వ డివిజన్‌లోని ఊర్మిళానగర్‌లో ఐరన్‌యార్డు కామన్ సైట్ రెండున్నరెకరాల స్థలంలో చురుగ్గా ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కోట్ల విలువైన ఈ స్థలం కబ్జాకు పాల్పడిన ప్రజాప్రతినిధుల అనుచరుల వ్యవహారాన్ని ఎప్పటికప్పుడు ఆంధ్రజ్యోతి కథనాలతో తూర్పారబట్టగా ఎట్టకేలకు రూ.45 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణ పనులు వారం క్రితం ప్రారంభం అయ్యాయి. ఇప్పుడు నాలుగువైపులా పిల్లర్లు వేసి శరవేగంగా సాగుతున్నాయి.

నవభారత నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములవ్వాలి

ప్రముఖ ప్రవచనకారుడు గరికపాటి నరసింహారావు

వన్‌టౌన్, మార్చి 11: దైనందిన ధర్మప్రవర్తనతో విద్యార్థులు తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని ప్రముఖ ప్రవచనకారుడు గరికపాటి నరసింహారావు అన్నారు. నవభారత నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం సైన్స్, మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో నవభారత నిర్మాణం-ఇంజనీరింగ్ విద్యార్థులు అనే అంశంపై జరిగిన సెమినార్‌కు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల కళ్లల్లో కన్నీరు రాకముందే వారి ప్రేమను, కష్టాన్ని అర్థం చేసుకుని వారి ఉద్దేశాలను నెరవేర్చేలా యువత లక్ష్యాలు ఉండాలన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని అన్నారు. కంప్యూటర్‌లు, సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు జ్ఞానసంపదకు మాత్రమే వినియోగించాలన్నారు. పని పట్ల నిరంతర శ్రద్ధ, నిరంతర కృషి ఉంటేనే విజయాలు సొంతమవుతాయని చెప్పారు. కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, ప్రిన్సిపిల్ డాక్టర్ జే.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలి శాస్త్రి, కమిటీ సభ్యులు హరగోపాల్, డాక్టర్ మణికంత, సైన్స్, హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఏ.రమాదేవి, వివిధ విభాగాల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గరికపాటికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కవిటీ ప్రతినిధి, డాక్టర్ రమాదేవి

సాయుధ దళాల మార్చ్‌ఫాస్ట్

గుణదల, మార్చి 11: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అసాంఘిక శక్తులకు తావులేకుండా చూడడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నట్లు గుణదల పోలీస్ స్టేషన్ సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓటర్లు వారి ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చూడాలన్న ఆలోచనతో తాము ఉన్నామని తెలియజేసేందుకు స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సోమవారం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. సాయుధ దళాలు మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నాయని చెప్పారు. బ్లేడ్‌బ్యాచ్, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు చెక్‌పెట్టేందుకు ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1979-80 బ్యాచ్ విద్యార్థులు

కోనేరు బసవయ్య చౌదరి స్కూల్ అభివృద్ధికి

పూర్వవిద్యార్థుల ఆర్థిక సహాయం

పటమట, మార్చి 11 : తాము విద్యాబుద్ధులు నేర్చుకున్న తమ పాఠశాలకు తమ వంతుగా ఏదో విధంగా సహాయం చేయాలని పటమట కోనేరు బసవయ్య చౌదరీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1979-1980 బ్యాచ్ విద్యార్థులు నిర్ణయించుకున్నారు. తమ స్కూల్ ఫెన్సింగ్ నిమిత్తం రూ.65వేలను, రూ.75వేలు విలువ చేసే కుర్చీలను ఆ బ్యాచ్ టెన్త్‌క్లాసు విద్యార్థులు పాఠశాలకు సమకూర్చారు. ఈ సందర్భంగా అప్పట్లో తమకు విద్య నేర్పిన గురువులందరికీ సన్మానం చేశారు. పాతమిత్రులు తమ పాత జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఆనందంగా గడిపారు.



బండ్లను ప్రారంభిస్తున్న దేవినేని సుధీర, మాస్టర్ సిద్ధార్థ, వేగే వెంకటేశ్వరరావు తదితరులు

తోపుడుబండ్లు అందజేత

మొగల్రాజపురం, మార్చి 11: పేదప్రజలకు అండగా నిలిచి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు వైస్ చైర్‌పర్సన్ దేవినేని సుధీర అన్నారు. సోమవారం 6వ డివిజన్ పరిధిలో మెట్రో మార్కెట్ ఏరియాలో వైసీపీ రాష్ట్ర నాయకుడు వేగే వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు తరుపున ఒక్కోటి రూ. 20వేల ఖరీదు చేసే 10 తోపుడు బండ్లను సిద్ధార్థతో కలిసి పేదలకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడేళ్లుగా విద్య, వైద్య, ఉపాధి రంగంలో అవసరం ఉన్న ప్రతి ఒక్కరికి అండగా నిలబడుతున్నామన్నారు. కార్పొరేటర్ అమర్‌నాథ్, కో-ఆప్షన్ సభ్యులు ముసునూరి సుబ్బారావు, వడ్లమూడి సంపత్, పాటిబండ్ల హరీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించండి

మేలుకో ఆంధ్రప్రదేశ్ సభ్యులు



వన్‌టౌన్, మార్చి 11: మూడోసారి మోడీ అధికారంలోకి రాకుండా సకల ప్రజాస్వామ్య శక్తులు సంఘటితం కావాలని మేలుకో ఆంధ్రప్రదేశ్ సభ్యులు కేఎంఏ సుభాన్, డి.రమేష్ పట్నాయక్‌లు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణమండపంలో సోమవారం రాజ్యాంగదీక్షా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫాసిస్టు ప్రభుత్వం మరల అధికారంలోకి వస్తే దేశానికే పెను ప్రమాదమని హెచ్చరించారు. మతోన్మాదాన్ని, మనువాదాన్ని కలగలపి పెంచి పోషిసూ ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఏ నియోజవర్గంలో నిలబడితే అక్కడి వారంతా ఓడించాలని, ఐఎన్‌డీఐఏ (ఇండియా)అభ్యర్థులను గెలిపించాలన్నారు. థామస్ పల్లి దానం తదితరులు పాల్గొన్నారు.

షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులపై అవగాహన



వన్‌టౌన్, మార్చి 11: అవగాహనతో పెట్టుబడులు పెడితే లాభాలు గడించవచ్చునని సెక్యూరిటీస్ మార్కెట్ ట్రైనర్ డాక్టర్ ఓలేటి అచ్యుత రామ కిషోర్ అన్నారు. కేబీఎన్ కాలేజీలో సోమవారం కామర్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో పెట్టుబడులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ షేర్ మార్కెట్‌ను అవగాహన చేసుకుని పెట్టుబడులు పెట్టిన వాళ్లు మంచి లాభాలు గడిస్తారన్నారు. అవగాహన లేక పెట్టుబడులు పెడితే మాత్రం నష్టాలను చవి చూడాల్సి ఉంటుందన్నారు. సెబీ వంటి సంస్థలు సదుపాయాలు, భద్రతాంశాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.నారాయణరావు, విభాగాధిపతి హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయం చేయండి

బుద్దాకు నాయీబ్రాహ్మణుల వినతి

వన్‌టౌన్, మార్చి11: తమకు న్యాయం చేయాలని కోనసీమ జిల్లా అప్పన్నపల్లి గ్రామంలో ఉన్న బాలబాలాజీ దేవస్థాన కేశఖండన శాలలో పనిచేస్తున్న పలువురు నాయీబ్రాహ్మణులు మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను సోమవారం కలిసి విన్నవించారు. నాయీబ్రాహ్మణుల జేఏసీ నాయకులు ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన 110 జీవో అమలు చేయిస్తామని ఒక్కొక్కరి వద్ద రూ.50వేలు వసూలు చేశారని, రోజులు గడుస్తున్నప్పటికీ జీవో అమలు చేయకపోవడంపై తాము మోసపోయామని తెలుసుకుని ఆలయ ఈవో, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌లను కలిసి వివరించినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. దీంతో బాధితులు బుద్దా వెంకన్నను ఆయన కార్యాలయంలో కలిసి తమ సమస్యను చెప్పి న్యాయం చేయాలని కోరారు.

ప్రమాదవశాత్తూ రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

వన్‌టౌన్, మార్చి 11: కృష్ణానది బ్రిడ్జి 3ఏ ట్రాక్‌పై ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు విజయవాడ రైల్వే పోలీసులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2.30 సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ట్రాక్‌పై పడినట్లు, శరీరం రెండు ముక్కలయినట్లు కీమాన్ ఎస్.కిషోర్ నుంచి స్టేషన్ మాస్టర్ కేఎల్ మీనా సమాచారం అందుకున్నారు. ఆ మేరకు ఆయన అందించిన రిపోర్ట్ ప్రకారం కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




జీవితంలో ఒక్కసారైనా తళుక్కున మెరవాలని, ఒక్కసారైనా గెలిచి నిలవాలని సినీ కళాకారులు కలలు కనే వేదిక.. ఆస్కార్స్. ప్రారంభమై 96 ఏళ్లు గడిచినా ఈ అవార్డులకు ఉండే క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు సరికదా ప్రతి ఏడాది మరింత పెరుగుతోంది. గోల్డెన్ గ్లోబ్, బాఫ్తా, కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లాంటివి ఎన్నున్నా ప్రపంచ సినిమా ప్రతిష్ఠాత్మకంగా భావించేది ఆస్కార్ అవార్డులే. ఎప్పటిలాగే ఈ ఏడాదీ ఎన్నో చిత్రాలు, నటీనటులు, సాంకేతిక బృందాలు ఆస్కార్ బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నాయి.

గెలుపు గుర్రం ఓపెన్‌హైమర్



ఉత్తమ నటుడు: కిలియన్ మర్ఫీ

టెలివిజన్ సిరీస్ పీకీ బ్లైండర్స్‌లో థామస్ షెల్బీగా కిలియన్ మర్ఫీ అందరికీ సుపరిచితమే. ఈ నటుడు క్రిస్టఫర్ నోలన్ దర్శకత్వం వహించిన బ్యాట్‌మెన్ ట్రయాలజీ, ఇన్‌సెప్షన్, డన్‌కిర్క్ చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషించారు. ఓపెన్‌హైమర్‌లో అణు బాంబు తయారు చేసిన థీరియాటికల్ ఫిజిసిస్ట్ జె రాబర్ట్ ఓపెన్‌హైమర్ పాత్రను పోషించారు మర్ఫీ. అణు బాంబు విస్ఫోటనం జరిగే సందర్భాల్లో ఆయన కనబరిచిన భావోద్వేగాలు గొప్పగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో కిలియన్ మర్ఫీ నటన సినీ ప్రపంచంలోని అత్యుత్తమ ప్రదర్శనల్లో ఒకటిగా మిగిలిపోతుంది. ఉత్తమ నటుడిగా నిలిచిన కిలియన్ మర్ఫీ, ఆస్కార్ అందుకున్న తొలి ఐరిష్ సంతతి నటుడిగానూ అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు. ఈ అవార్డు కోసం కిలియన్ మర్ఫీతో బ్రాడ్లీ కూపర్ (మేస్ట్రో), కోల్మన్ డొమింగో (రస్టిన్) పాల్ జియామటి (ది హోల్డోవర్స్), జెఫ్రీ రైట్ (అమెరికన్ ఫిక్షన్)లు పోటీపడ్డారు.



వేదికపైకి నగ్నంగా..

సరిగ్గా 50 ఏళ్ల క్రితం జరిగిన ఆస్కార్ అవార్డుల వేడుకలో ఎలిజిబెత్ టైలర్‌ను వేదికపైకి ఆహ్వానించినప్పుడు ఓ వ్యక్తి హఠాత్తుగా నగ్నంగా వేదికపైకి వచ్చాడు. అప్పట్లో ఆ సంఘటన సంచలనం సృష్టించింది. మళ్లీ ఇన్నాళ్లకు 96వ అవార్డుల వేదికపైకి ఓ సూపర్‌స్టార్ అలా నగ్నంగా వచ్చి బెస్ట్ కాస్ట్యూమ్స్ డిజైనర్ అవార్డ్ విజేతను ప్రకటించడం విశేషం. ఆ సూపర్‌స్టార్ మరెవరో కాదు.. రెజ్లర్ జాన్ సీనా. నగ్నంగా వేదికపైకి రావడం తనకు ఇష్టం లేదని, మగవాడి శరీరం జోక్ కాదని ఆయన చెప్పారు. వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న జిమ్మీ కిమ్మెల్ అతని చేతికి ఓ కవర్ ఇచ్చి విజేత పేరు నువ్వే ప్రకటించు.. అని వెళ్లిపోయారు. ఆ కవర్ అడ్డం పెట్టుకుని నగ్నంగానే మైకు ముందుకు వచ్చి ఆ కవర్‌ను తను ఓపెన్ చేయలేనని చెప్పారు. అప్పుడు మళ్లీ జిమ్మీ వేదికపైకి వచ్చి విజేత పేరు ప్రకటించారు.

అంగరంగ వైభవంగా...



ప్రపంచ వ్యాప్తంగా సినీప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎంతో ఆశగా ఎదురు చూసే ఆస్కార్ అవార్డుల వేడుక ఆదివారం రాత్రి లాస్‌ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరిగింది. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులకు నిరసిస్తూ కొంతమంది ఆందోళనకారులు డాల్బీ థియేటర్ ముందు నినాదాలు చేస్తున్న నేపథ్యంలో ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. గత ఏడాది ఇదే వేదికపై ఎన్టీఆర్, రామ్‌చరణ్, రాజమౌళి కాంబినేషన్‌లో వచ్చిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాట ఆస్కార్ అవార్డ్ సాధించి, తెలుగు సినిమా సత్తా చాటింది. ఈసారి ఆస్కార్ అవార్డుల్లో భారతీయ సినిమా మెరుపులు ఏమీ లేవు. సినిమా విడుదలైన దగ్గర నుంచి వార్తల్లో నిలిచి అందరి దృష్టినీ ఆకట్టుకొన్న 'ఓపెన్‌హైమర్' చిత్రం ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు అవార్డులు సాధించి, చరిత్ర సృష్టించింది. హాలీవుడ్ దర్శకుడు క్రిస్టఫర్ నోలన్ దర్శకత్వం వహించిన ఈ బయోగ్రాఫికల్ థ్రిల్లర్ ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడితో సహా ఏడు అవార్డులు సొంతం చేసుకుంది. 53 ఏళ్ల క్రిస్టఫర్ నోలన్ చిత్రాలకు ఆస్కార్ అవార్డులు రావడం కొత్త కాదు కానీ ఒక దర్శకుడిగా మాత్రం ఆయన ఈ అవార్డ్ అందుకోవడం ఇదే తొలిసారి. 'ఓపెన్‌హైమర్' చిత్రం కోసం మూడేళ్లు ఎంతో కష్టపడ్డారు నోలన్. 2020లో వచ్చిన 'టెనెట్' చిత్రం తర్వాత మరో సినిమా జోలికి పోకుండా 'ఓపెన్‌హైమర్' చిత్రం మీదే ప్రత్యేక దృష్టి పెటారు నోలన్. మరో విషయం ఏమిటంటే ఆయన రూపొందించిన తొలి బయోపిక్ ఇదే. 'అమెరికన్ ప్రొమేథియస్': 'ద ట్రయంప్ అండ్ ట్రాజెడీ ఆఫ్ జె రాబర్ట్ ఓపెన్‌హైమర్' అనే పుస్తకం ఆధారంగా ఈ సినిమాను రూపొందించారు నోలన్. మూడు గంటల రన్‌టైమ్‌తో ఆయన చిత్రాల్లో తొలి స్థానంలో నిలిచిన 'ఓపెన్‌హైమర్' లో కిలియన్ మర్ఫీ ముఖ్య పాత్ర పోషించారు. ఉత్తమ నటుడుగా ఆయన అవార్డ్ అందుకుంటూ భావోద్వాగానికి గురై ఈ అవార్డ్‌ను శాంతికాముకులకు అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆస్కార్ అవార్డ్ పొందిన ఈ చిత్రాన్ని ఈ నెల 24 నుంచి జియో సినిమాలో హిందీ, ఇంగ్లీష్ వెర్షన్స్‌లో ప్రేక్షకులు చూసే అవకాశం కల్పిస్తున్నారు.

ఆస్కార్ వేదికపై మరోసారి మెరిసిన ఆర్‌ఆర్‌ఆర్



దర్శకదిగ్గజం రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా నటించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు పొందడమే కాకుండా ఇందులోని 'నాటునాటు' పాట బెస్ట్ ఒరిజనల్ సాంగ్ విభాగంలో ఎన్నికై ప్రతి తెలుగు వాడు కాలర్ ఎగరేసేలా చేసింది. ఈ సినిమాతో ఎన్టీఆర్, రామ్‌చరణ్ గ్లోబర్ హీరోలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. విదేశాల్లోనూ అభిమానుల సంఖ్య పెంచుకున్నారు. కోట్లాదిమంది భారతీయుల కలను నిజం చేసిన 'నాటునాటు' పాటను తాజా ఆస్కార్ అవార్డ్స్ వేదిక మరోసారి గుర్తు చేసింది. బెస్ట్ ఒరిజనల్ సాంగ్ కేటగిరిలో అవార్డ్‌ను ప్రకటించే క్రమంలో తెరపై 'నాటు నాటు' పాట బిట్‌ను ప్రదర్శించేసరికి టీవీలు చూస్తున్న భారతీయ ప్రేక్షకులు ఆనందపరవశులై నృత్యాలు చేశారు. అలాగే ఇప్పటివరకూ వచ్చిన బెస్ట్ యాక్షన్ సీక్వెన్స్‌కు సంబంధించి ఓ వీడియో ప్రదర్శిస్తూ అందులో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని రెండు యాక్షన్ షాట్స్ ప్రదర్శించడం మన సినిమాకు మరోసారి దక్కిన గౌరవం.

ఉత్తమ నటి: ఎమ్మాస్టోన్



లాలా ల్యాండ్, అమేజింగ్ స్పైడర్ మ్యాన్, బర్డ్ మ్యాన్ వంటి సినిమాల్లో ఉత్తమ నటన కనబరిచి అందరినీ మెప్పించిన నటి ఎమ్మాస్టోన్. తాజాగా ఈమె 'పూర్ థింగ్స్' అనే చిత్రంలో తన నటనతో అందరి హృదయాలను గెలుచుకోవడమే కాక ఉత్తమ నటి అవార్డునూ కొల్లగొట్టింది. ఉత్తమ నటి పురస్కారానికి ఎమ్మాస్టోన్‌కు అన్నెతె బెన్నింగ్ (నయాడ్), లిల్లీ గ్లాడ్‌స్టోన్ (కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్), సాండ్రా హుల్లర్(అనాటమీ ఆఫ్ ఏ ఫాల్) నుంచి గట్టి పోటీ ఎదురైనా అవార్డును ఈ నటి ఎగరేసుకుపోవడం విశేషం.

ఉత్తమ ఇంటర్నేషనల్ చిత్రం: ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్



మార్టిన్ అమిస్ రాసిన పుస్తకం ఆధారంగా ఈ హిస్టారికల్ డ్రామాను జొనాథన్ గ్లేజర్ తెరకెక్కించారు. "మనం తీసుకున్న నిర్ణయాలు మన జీవితాలని ప్రతిబింబిస్తాయి" అని అవార్డు అందుకునేటప్పుడు ఈ చిత్ర దర్శకుడు అన్నారు. 1943లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నాజీ కాన్సన్‌ట్రేషన్ క్యాంపులో (హోలోకాస్ట్) జరిగిన ఆరాచకాలను ఓ కుటుంబ కథ నేపథ్యంగా ఈ చిత్రంలో కళ్లకు కట్టినట్లు చూపించారు.

మంత్రముగ్ధుల్ని చేసిన మెస్సీ



ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ అతిరథ మహారథులతో పాటూ ఆస్కార్ వేడుకల్లో మరో విశిష్ట అతిథి మెరిసింది. ఆ అతిథి ఎవరో కాదు.. 'అనాటమీ ఆఫ్ ఏ ఫాల్' చిత్రంలో నటించిన మెస్సీ అనే కుక్క. ఈ వేడుకకు ముస్తాబై వచ్చిన మెస్సీ తన సపోర్టింగ్ నేచర్‌తో అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసి మంచి మార్కులు కొట్టేసింది. అవార్డులను ఇస్తున్నప్పుడు డాల్బీ థియేటర్‌లోని ప్రేక్షకుల కరతాళధ్వనులు ఒక ఎత్తయితే.. విజేతలను అభినందిస్తూ మెస్సీ చేసిన హంగామా మరో ఎత్తు. వేడుకకు వచ్చిన ప్రముఖులంతా మెస్సీతో సెల్ఫీ దిగారు. ప్రతీ ఏడాదీ ఆస్కార్ వేడుకల్లో ఏదో ఒక విషయం హైలైట్‌గా నిలిచినట్లే.. ఈ ఏడాది మెస్సీ నిలిచిందంటూ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

ఉత్తమ దర్శకుడు: క్రిస్టఫర్ నోలన్



అనూహ్యమైన చిత్ర కథనాలతో ప్రేక్షకుల మెదడుకు పదును పెట్టి, వారిని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తే దర్శకుడు క్రిస్టఫర్ నోలన్. ఆయన తెరకెక్కించిన చిత్రాలు వేటికవే విభిన్నంగా నిలుస్తుంటాయి. ప్రతీ చిత్రానికి ఒక సరికొత్త జానర్‌ను ఎన్నుకుని దానిని మరింత నూతనంగా తెరపై ఆవిష్కరించడంలో ఆయన సిద్ధహస్తుడు. ఇప్పటివరకూ సినీ చరిత్రలో నిలిచిపోయే ఎన్నో చిత్రాలను అందించిన ఆయన తొలిసారి ఈ అవార్డును అందుకోవడం విశేషం. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అణు బాంబు తయారు చేసిన థీరియాటికల్ ఫిజిసిస్ట్ జె రాబర్ట్ ఓపెన్‌హైమర్ అనే వ్యక్తి జీవిత కథ 'అమెరికన్ ప్రొమేథియస్' పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు నోలన్. ఆయన దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన తొలి బయోపిక్ ఇదే కావడం మరో ఆసక్తికర విషయం. ఉత్తమ దర్శకుడు విభాగంలో జస్టిన్ ట్రిఎట్ (అనాటమీ ఆఫ్ ఏ ఫాల్), మార్టిన్ స్కోర్సెస్ (కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్), యోర్గోస్ లాంతిమోస్(పూర్ థింగ్స్), జొనాతన్ గ్లేజర్ (ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్) పోటీగా నిలిచారు.



నితిన్ దేశాయ్‌కు నివాళి

అంతకుముందు సంవత్సరంలో మరణించిన సినీ ప్రముఖులను ప్రస్తుతం జరుగుతున్న వేడుకలో స్మరించుకుని నివాళి ఘటించడం ఆస్కార్ పంక్షన్‌లో ఓ సంప్రదాయం. దానిని పాటిస్తూ గత ఏడాది మరణించిన ఆర్ట్ డైరెక్టర్, నిర్మాత నితిన్ చంద్రకాంత్‌దేశాయికి నివాళులు అర్పించింది ఆస్కార్ వేదిక. మూడు పదుల తన సినీ జీవితంలో ఆస్కార్‌కు నామినేట్ అయిన 'లగాన్' చిత్రంతో సహా పలు భారీ చిత్రాలకు నితిన్ దేశాయి కళాదర్శకుడిగా పనిచేశారు. ఆయన గొప్పతనాన్ని, పని చేసిన చిత్రాల గురించి వివరిస్తూ ఓ వీడియోను ఆస్కార్ వేదిక తెరపై ప్రదర్శించారు.

భారతీయ చిత్రానికి నిరాశ



భారత సంతతికి చెందిన కెనడియన్ ఫిల్మ్‌మేకర్ నిషా పహుజా దర్శకత్వం వహించిన 'టు కిల్ ఏ టైగర్' చిత్రానికి ఆస్కార్ వేడుకలో నిరాశ ఎదురైంది. మన దేశం నుంచి ఈ ఏడాది నామినేషన్ పొందిన ఏకైక చిత్రం ఇదే. 13ఏళ్ల నిషా అనే చిన్నారికి జరిగిన అన్యాయంపై పోరాడిన తల్లిదండ్రుల కథే ఈ చిత్రం .జార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. ఈ చిత్రం కచ్చితంగా అవార్డును తెస్తుందన్న నమ్మకం కలిగించింది. అయితే ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రం విభాగంలో '20 డేస్ ఇన్ మరియాపోల్' అనే చిత్రం పోటీగా నిలిచి అవార్డ్ గెలుచుకోవడంతో 'టు కిల్ ఏ టైగర్' వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఉక్రెయిన్ ఫిల్మ్‌మేకర్, జర్నలిస్ట్ మిస్టిస్లావ్ చెర్నోవ్ '20 డేస్ ఇన్ మరియాపోల్' చిత్రాన్ని రూపొందించారు. ఉక్రెయిన్ మీద రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత 20 రోజుల పాటు మారియో పోల్ సిటీలో జరిగిన సంఘటనలే ఈ చిత్ర కథాంశం. "ఇది ఉక్రెయిన్ చరిత్రలోనే తొలి ఆస్కార్ అవార్డు అనుకుంటా. ఉక్రెయిన్ మీద రష్యా దాడులు విరమించుకుంటే ఈ ఆస్కార్ అవార్డు వారికివ్వటానికి సిద్ధం" అని ప్రకటించారు మిస్టిస్లావ్.

హైదరాబాద్‌లో వేట్టయాన్



ఇటీవలే 'లాల్ సలామ్' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన రజనీకాంత్ తన తదుపరి చిత్రం కోసం సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో జరుగుతున్న 'వేట్టయాన్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆదివారమే నగరానికి చేరుకున్న రజనీకాంత్ ఓ ప్రైవేట్ స్టూడియోలో షూటింగ్‌లో పాల్గొన్నారు. మరికొన్ని రోజుల పాటు రజనీకాంత్ చిత్రీకరణలో పాల్గొంటారు. 'వేట్టయాన్' చిత్రానికి టీజే జ్ఞానవేల్ దర్శకుడు. అమితాబ్‌బచ్చన్, రానా, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సుభాస్కరన్ నిర్మాత.

వైజాగ్‌లో పుష్ప రూల్



అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రం షూటింగ్ ఏకధాటిగా కొనసాగుతోంది. ఈ చిత్రం తాజా షెడ్యూల్ విశాఖపట్నంలో ప్రారంభమైంది. షూటింగ్‌లో పాల్గొనేందుకు అల్లు అర్జున్ విశాఖపట్నం వెళ్లారు. వారం రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో ప్రతినాయక పాత్ర పోషిస్తున్న ఫహాద్ ఫాజిల్ కూడా పాల్గొంటున్నారు. ఆగస్టు 15న 'పుష్ప 2' ప్రేక్షకులు ముందుకు రానుంది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక.



దర్శకుడు సూర్యకిరణ్ కన్నుమూత

ప్రముఖ నటుడు, సినీ దర్శకుడు సురేష్ అలియాస్ సూర్య కిరణ్ (48) అనారోగ్యం కారణంగా సోమవారం చెన్నై నగరంలో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతూ నగరంలోని జెమ్ హాస్పిటల్‌లో చికిత్స పొందిన ఆయన.. సోమవారం ఉదయం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికెళ్లిన కొద్దిసేపటికే కన్నుమూశారు. భౌతికకాయాన్ని స్థానిక కేకే నగర్‌లోని ఆయన నివాసంలో చివరిచూపు కోసం ఉంచారు. కేరళకు చెందిన సూర్యకిరణ్... తమిళంలో 'మౌనగీతంగల్' అనే చిత్రం ద్వారా బాలనటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. తమిళం, తెలుగు చిత్రాల్లో నటించడమే కాకుండా, పలు చిత్రాలకు దర్శకత్వం కూడా వహించారు. తెలుగులో 'సత్యం' సినిమాతో దర్శకుడిగా మారిన ఆయన... 'ధన 51', 'బ్రహ్మాస్త్రం', 'రాజుభాయ్', 'చాప్టర్6' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. అలాగే, రజినీకాంత్, కమల్ హాసన్, చిరంజీవి వంటి హీరోల చిత్రాల్లో కూడా చిన్న పాత్రలను పోషించారు. హీరోయిన్ కళ్యాణిని ప్రేమించి పెళ్లి చేసుకున్న సూర్యకిరణ్... మనస్పర్థల కారణంగా విడిపోయారు. తమిళంలో వరలక్ష్మి శరత్ కుమార్ నటించిన 'అరసి' చిత్రానికి ఆయన దర్శకత్వం వహించగా, ఈ చిత్రం విడుదల కావాల్సివుంది.


చెన్నై, (ఆంధ్రజ్యోతి)

ప్రేమకు జయం



సత్య మేరుగు, దీపిక జంటగా తెరకెక్కుతోన్న యాక్షన్ ఎంటర్టైనర్ 'జయం'. జి కిరణ్ కుమార్ దర్శకత్వంలో రవికుమార్ చౌదరి నిర్మిస్తున్నారు. సోమవారం చిత్ర బృందం పోస్టర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'గతంలో వచ్చిన 'జయం'* సినిమా టైటిల్‌ను మా సినిమాకు పెట్టాం. ఈ సినిమా కూడా అంత పెద్ద హిట్ అవ్వాలి. కిరణ్ కుమార్ మంచి విజన్ ఉన్న దర్శకుడు' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'కథకు తగ్గ నటులు టెక్నీషియన్లు దొరికారు. లవ్, యాక్షన్, ఎంటర్టైన్‌మెంట్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గౌతమ్ రవిరామ్. సినిమాటోగ్రఫీ: యూఎస్ విజయ్

మళ్లీ వస్తున్న ప్రేమికుడు



ప్రభుదేవా కథానాయకుడిగా శంకర్ దర్శకత్వం వహించిన 'ప్రేమికుడు' చిత్రం అప్పట్లో సంచలన విజయం అందుకున్న సంగతి తెలిసిందే. అప్పట్లో కుర్రకారును ఓ ఊపు ఊపిన ఈ సినిమా ఈ తరాన్ని అలరించేందుకు త్వరలో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రాన్ని మురళీధర్ రెడ్డి, రమణ రీ రిలీజ్ చేస్తున్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని వారు తెలిపారు.

ఇది ఎన్నికల సినిమా కాదు

- [illegible]

'నేను చరిత్రను తప్పుగా చెప్పలేదు. ఒకవేళ 'రజాకార్' సినిమా కోసం అలాంటి తప్పు చేస్తే నేను చరిత్రహీనుడిగా మిగిలిపోతాను' అని దర్శకుడు [illegible] ...అని ఆయన చెప్పారు.

My Life is My Message

- Mahatma Gandhi

Government of Gujarat



Ashram Bhoomi Vandana

Mahatma Gandhi Sabarmati Ashram **Restoration** Project
Bhoomi Vandana By
Hon'ble Prime Minister of India

Shri Narendra Modi

12th March 2024, Tuesday | 09:30 AM Onwards | Sabarmati Ashram, Ahmedabad


Features of Ashram Restoration

- The project, planned at a cost of Rs 1200 crs aims to develop and upgrade the Ashram and surrounding infrastructure, visitors' amenities and create a world-class memorial as a tribute to Mahatma Gandhi ji.
- The project will comprise of a memorial spread over an area of 55 acres. It will serve as an inspiration for future generations, fostering Gandhian thoughts and will enliven the essence of Gandhian values.
- It involves conservation of 20 old ashram buildings, Restoration of 13 Buildings and Redevelopment of 3 buildings adhering to austere, simple and authentic architecture of the original Ashram.
- The project aims to create a serene, tranquil and lush green natural environment for the visitors.
- It is envisaged to promote values of sustainability and self reliance by creating hands-on experience for visitors of making hand-made products, which were made during Gandhiji's time in the Ashram.
- Informative Exhibitions depicting Gandhiji's Life and the Timeless Legacy of the Ashram.
- Interactive Exhibitions depicting Satyagrahas and freedom struggle initiated from the Sabarmati Ashram by Pujya Bapuji.
- Interpretation Center, Public Facilities & Amenities such as Food Court & Souvenir Shops for visitors with global accessibility standards.

The memorial will be a hub to foster the deeper understanding and appreciation of Gandhiji's contributions and ideals

Scan for more information

On the occasion of Dandi March day
A heartfelt salute to Gandhiji and all the Satyagrahis



Mahatma Gandhi Sabarmati Ashram Memorial Trust

Shri Bhupendra Patel
Chief Minister Of Gujarat

Live Broadcast on : DD News D D News | CMOGuj | CMOGuj | CMOGujarat | CMOGujarat

షబ్నమ్ షో



సత్తా చాటిన తెలుగు టీనేజర్

యూపీపై గుజరాత్ విజయం
దీప్తి పోరాటం వృథా

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్‌లో తమ ప్లేఆఫ్ ఆశలను గుజరాత్ జెయింట్స్ సజీవంగానే ఉంచుకుంది. సోమవారం యూపీ వారియర్స్‌తో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో జెయింట్స్ 8 పరుగుల తేడాతో నెగ్గింది. విశాఖపట్నం టీనేజ్ పేసర్ షబ్నమ్ షకీల్ (3/11) బౌలింగ్‌లో అదరగొట్టింది. అటు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (60 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 88 నాటౌట్) అద్భుత పోరాటం వృథా అవడంతో యూపీ దాదాపు నిష్క్రమించినట్టే. ముందుగా జెయింట్స్ 8 వికెట్లకు 152 రన్స్ చేసింది. మూనీ (74), వోల్వార్ట్ (43) రాణించారు. ఎకెల్‌స్టోన్‌కు 3, దీప్తికి 2 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన యూపీ 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 144 పరుగులు చేసి ఓడింది. పూనమ్ (36 నాటౌట్) రాణించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షబ్నమ్‌కు మూడు వికెట్లు దక్కాయి.

శతక భాగస్వామ్యంతో..: ఓ మాదిరి ఛేదనలో యూపీ 4 రన్స్‌కే మూడు.. 16 రన్స్‌కే 5 వికెట్లు కోల్పోవడం దెబ్బతీసింది. అయినా దీప్తి శర్మ పట్టు వదలకుండా చివరి వరకు నిలిచినా ఓటమి తప్పలేదు. తొలి ఓవర్‌లోనే హీలీ (4), అటపట్టు (0)లను అవుట్ చేస్తూ 16 ఏళ్ల తెలుగు పేసర్ షబ్నమ్ షాకిచ్చింది. తర్వాత గ్రేస్ (0), గార్డ్‌నర్ (1) కూడా వెనుదిరగడంతో పవర్‌ప్లేలో జట్టు 30/4తో కష్టాల్లో పడింది. ఏడో ఓవర్‌లో శ్వేత (8)ను కూడా షబ్నమ్ అవుట్ చేశాక, దీప్తి శర్మకు పూనమ్ జత కలిసింది. ఆఖరి 14 ఓవర్లు ఈ జోడీ గుజరాత్ బౌలర్లను అద్భుతంగా ఎదుర్కొంటూ లక్ష్యం వైపు సాగింది. ఇద్దరూ ఎడాపెడా షాట్లతో గుజరాత్‌పై ఒత్తిడి పెంచారు. 15వ ఓవర్‌లో ఫోర్‌తో దీప్తి హ్యాట్రిక్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుంది. అయినా చివరి ఓవర్‌లో 26 రన్స్ అవసరపడగా, దీప్తి రెండు సిక్సర్లు బాదినా మరో 8 పరుగుల దూరంలోనే ఆగిపోవాల్సి వచ్చింది. ఈ జోడీ ఆరో వికెట్‌కు అజేయంగా 109 పరుగులు జతచేసింది.

ఓపెనర్లు మినహా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌కు ఓపెనర్లు బెత్ మూనీ, వోల్వార్ట్ మెరుపు ఆరంభాన్ని అందించారు. వీరి జోరుతో పవర్‌ప్లేలో జట్టు 53 పరుగులు సాధించింది. అయితే ఈ దూకుడును ఎకెల్‌స్టోన్ అడ్డుకుంటూ వోల్వార్ట్‌ను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే మరో ఎండ్‌లో టపటపా వికెట్లు కోల్పోతున్నా మూనీ మాత్రం పట్టు వదల్లేదు. 19వ ఓవర్‌లో రెండు ఫోర్లతో ఫిఫ్టీ పూర్తి చేసిన తను ఆఖరి ఓవర్‌లో ఐదు ఫోర్లతో 21 పరుగులు సాధించి స్కోరును 150 దాటించింది.

సంక్షిప్త స్కోర్లు
గుజరాత్: 20 ఓవర్లలో 152/8 (మూనీ 74, వోల్వార్ట్ 43; ఎకెల్‌స్టోన్ 3/38, దీప్తి 2/22).
యూపీ: 20 ఓవర్లలో 144/5 (దీప్తి 88 నాటౌట్, పూనమ్ 36 నాటౌట్; షబ్నమ్ 3/11).

నేటి మ్యాచ్
ముంబై x బెంగళూరు
రాత్రి 7.30 గం. నుంచి


దీప్తి (88 నాటౌట్)

ఈసారైనా అందేనా?

స్పోర్ట్స్ 18, జియో సినిమాలో మధ్యాహ్నం 3.30 నుంచి



కళ్లన్నీ సాత్విక్-చిరాగ్ పైనే..

నేటినుంచి 'ఆల్ ఇంగ్లండ్' బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: బ్యాడ్మింటన్‌లో ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌నకున్న హోదా, గుర్తింపు వేరు. ప్రతీ షట్లర్ ఈ టైటిల్ కోసం పరితపిస్తుంటాడు. భారత్ తరఫున దశాబ్దాల క్రితం ప్రకాశ్ పదుకోన్ (1980), పుల్లెల గోపీచంద్ (2001) మాత్రమే విజేతలుగా నిలిచారు. ఆ తర్వాత 23 ఏళ్లుగా భారత షట్లర్లు ఏ విభాగంలోనూ ఇక్కడ చాంపియన్లు కాలేకపోయారు. మధ్యలో సైనా నెహ్వాల్ (2015), లక్ష్య సేన్ (2022) ఫైనల్ దాకా వెళ్లినా రన్నరప్‌కే పరిమితమయ్యారు. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ మంగళవారం నుంచి 17వ తేదీ వరకు జరుగబోతోంది. ఈసారి మాత్రం డబుల్స్‌లో వరల్డ్ నెంబర్ వన్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి రూపంలో భారత్ కల నెరవేరే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. గతేడాది రెండో రౌండ్‌కే పరిమితమైన ఈ ద్వయం ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉంది. గత ఆదివారమే ఫ్రెంచ్ ఓపెన్‌ను వేసుకున్న ఈ సూపర్ జోడీ.. ఆ జోరులోనే ఇక్కడా చెలరేగాలనే కసితో ఉంది. 2023లో సాత్విక్-చిరాగ్ జోడీ ఇండోనేసియాలో కెరీర్‌లో తొలి సూపర్ 1000 టైటిల్‌ను నెగ్గింది. తాజా టోర్నీ కూడా నాలుగు సూపర్ 1000 టైటిళ్లలో ఒకటి. అయితే మూడు సార్లు వరల్డ్ చాంపియన్స్‌గా నిలిచిన మహ్మద్ ఎహ్సాన్-హెంద్రా సెటియవాన్ (ఇండోనేసియా) జోడీతో భారత్ డబుల్స్ జంట తొలి రౌండ్‌లో తలపడనుంది. గతేడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో సాత్విక్-చిరాగ్ వీరి చేతిలోనే ఓడారు. మిగతా భారత షట్లర్లలో లక్ష్య సేన్, ప్రణయ్, ప్రియాన్షు రజావత్, కిడాంబి శ్రీకాంత్ సింగిల్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. గతవారం ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీస్‌కు చేరిన లక్ష్య సేన్ ఈసారి ఇక్కడ టైటిల్ కొడితే సింగిల్స్‌లో ఆ ఘనత సాధించిన మూడో ఆటగాడిగా నిలుస్తాడు.

సింధుకు కష్టమే..

గత నాలుగు నెలలుగా ఎడమ మోకాలి గాయంతో ఆటకు దూరమైన పీవీ సింధు ఇటీవలి ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్స్ వరకు చేరగలిగింది. ఇక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో వొన్నే లీ (జర్మనీ)పై తొలి రౌండ్ నెగ్గితే సింధు.. రెండో రౌండ్లో వరల్డ్ నెంబర్‌వన్, టాప్ సీడ్ అన్ సీ యంగ్ (కొరియా)ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రత్యర్థి 2-0తో సింధుపై ఆధిక్యంలో ఉంది. ఆకర్షి కశ్యప్ భారత్ నుంచి బరిలో ఉన్న మరో సింగిల్స్ క్రీడాకారిణి. ఇక, డబుల్స్‌లో రెండేళ్లుగా సెమీస్‌దాకావచ్చిన ట్రీసా జాలీ-గాయత్రి జోడీ ఈసారైనా విజేత కావాలని పరితపిస్తోంది. వీరితో పాటు అశ్విని-తనీషా జోడీ ఏమేరకు ప్రభావం చూపుతారో చూడాలి.

టీ20 వరల్డ్‌కప్‌నకు షమి దూరం



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్ ఆరంభానికి ముందే భారత జట్టుకు గట్టి షాక్ తగిలింది. ఈ మెగా టోర్నీకి స్టార్ పేసర్ మహ్మద్ షమి దూరం కానున్నాడు. గతనెల 26న షమి చీలమండ గాయానికి లండన్‌లో సర్జరీ చేయించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అతను ఎప్పటి నుంచి బరిలోకి దిగుతాడనే విషయమై బీసీసీఐ కార్యదర్శి జైషా స్పష్టతనిచ్చాడు. ఇప్పటికే షమి ఐపీఎల్‌లో ఆడని విషయం తేలిపోగా.. తాజాగా అతను సెప్టెంబరులో బంగ్లాదేశ్‌తో జరిగే టెస్టు సిరీస్ నుంచి అందుబాటులో ఉంటాడని షా పేర్కొన్నాడు. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో భారత ఓటమి తర్వాత షమి గాయంతో క్రికెట్‌కు దూరమయ్యాడు. పెయిన్ కిల్లర్ ఇంజక్షన్ చేయించుకుంటూనే ఆ వరల్డ్‌కప్ ఆడినట్టు షమి అప్పట్లో తెలిపాడు. ప్రస్తుతం షమి జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో కోలుకుంటున్నాడు.

పట్టు బిగిస్తున్న ముంబై

- రహానె, ముషీర్ అర్ధసెంచరీలు
- విదర్భతో రంజీ ఫైనల్


రహానె (58 బ్యాటింగ్)

ముంబై: కీలక సమయంలో రహానె (58 బ్యాటింగ్) అర్ధ శతకంతో ఫామ్‌లోకి రావడంతో.. విదర్భతో రంజీ ఫైనల్లో ముంబై పట్టు బిగిస్తోంది. ఆటకు రెండో రోజు రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ముంబై 141/2 స్కోరు చేసింది. సోమవారం ఆట ముగిసేసరికి రహానెతోపాటు ముషీర్ (51 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. 119 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి ముంబై ఇప్పటికే 260 రన్స్ లీడ్ సాధించింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 31/3తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విదర్భ 105 పరుగులకు కుప్పకూలింది. ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 224 రన్స్ చేసింది.

ఒలింపిక్ బెర్త్ చేరువలో నిషాంత్

బస్టో ఆర్సిజియో (ఇటలీ): ప్రపంచ ఒలింపిక్ క్వాలిఫయర్ టోర్నీలో భారత బాక్సర్ నిషాంత్ దేవ్ (71 కిలోలు) క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సోమవారం జరిగిన బౌట్‌లో నిషాంత్ 5-0తో క్రిస్టోస్ కరైటిస్ (గ్రీస్)ను చిత్తు చేశాడు. ఇక, మంగళవారం జరిగే క్వార్టర్స్‌లో ఒమారి జోన్స్ (అమెరికా)ను ఓడిస్తే నిషాంత్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారవుతుంది.

ట్రయల్స్‌లో ఫొగట్ రచ్చ!

- ఒకేరోజు రెండు కేటగిరీల్లో బరిలోకి..
- ఆసియా క్వాలిఫయర్స్‌కు అర్హత
- శాంపిల్ ఇవ్వకుండానే వెళ్లిన రెజ్లర్?



పటియాలా: పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫికేషన్ టోర్నీ కోసం జరుగుతున్న మహిళల రెజ్లింగ్ సెలెక్షన్ ట్రయల్స్‌లో ఆసియాడ్ పతక విజేత వినేష్ ఫొగట్ హంగామా సృష్టించింది. నిబంధనలను అతిక్రమిస్తూ ఒకేరోజు రెండు వెయిట్ కేటగిరీలు 50, 53 కిలోల్లో బరిలోకి దిగడానికి అనుమతించాలంటూ రచ్చ చేసింది. మొత్తమ్మీద రెండింటిలో తలపడి ఒకదానిలో గెలిచి ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించింది. సోమవారం దాదాపు రెండున్నర గంటలు ట్రయల్స్‌కు ఆటంకం కలిగించడంతో.. అధికారులు ఆమె ఒత్తిడికి తలొగ్గారు. పైగా, 53 కిలోల ట్రయల్స్‌లో ఓడినా ఒలింపిక్స్ ఆరంభానికి ముందు ఫైనల్ ట్రయల్స్ నిర్వహించేలా తనకు లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది. అయితే, ఫొగట్‌ను రెండు వెయిట్ కేటగిరీల్లో అనుమతించడంపై పలువురు రెజ్లర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లింగ్ సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేసిన వారిలో వినేష్ ముందు వరుసలో ఉంది. వినేష్ సహజంగా 53 కిలోల విభాగం బరిలోకి దిగుతుంది. అయితే, ఆ కేటగిరీలో అంతిమ్ ఈపాటికే ఒలింపిక్ కోటా బెర్త్ సాధించడంతో ఫొగట్ తన వెయిట్ కేటగిరీని 50 కిలోలకు మార్చుకొంది. ఈ కేటగిరీలో గెల్చి వచ్చేనెల్లో జరిగే ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు ఎంపికైంది. అయితే, 53కిలోల బౌట్‌లో ఫొగట్ చిత్తుగా ఓడింది. కాగా, ట్రయల్స్ ముగిశాక మూత్రం శాంపిల్‌ను ఇవ్వాల్సి ఉన్నా.. వినేశ్ ఇవ్వకుండానే వెళ్లిపోయిందని సమాచారం.



పారా వరల్డ్‌కప్‌లో శ్రీధర్-పావని జోడీకి కాంస్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడ ప్రతినిధి): పారా షూటింగ్ వరల్డ్‌కప్‌లో హైదరాబాద్ జోడీ శ్రీధర్-పావని కాంస్య పతకం కొల్లగొట్టింది. న్యూఢిల్లీలో సోమవారం జరిగిన ఆర్11 మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్2 విభాగం కాంస్య పతక పోరులో శ్రీధర్-పావని జంట 16-15 స్కోరుతో బ్రుంజెల్ నటాలై-కిరణ్‌జిత్ సింగ్ (న్యూజిలాండ్) ద్వయంపై నెగ్గి, తృతీయ స్థానంలో నిలిచింది. బ్రూనో స్ప్రోవ్-జెస్సిక (బ్రెజిల్) జోడీకి స్వర్ణం దక్కగా, హేస్ బెన్-చాంపియన్ మాడిసన్ (అమెరికా) జంట రజతం దక్కించుకొంది.

ఆసీస్ క్లీన్‌స్వీప్

- రాణించిన క్యారీ, మార్ష్
- రెండో టెస్టులో కివీస్ ఓటమి

క్రైస్ట్‌చర్చ్: అలెక్స్ క్యారీ (98 నాటౌట్), మిచెల్ మార్ష్ (80) అద్భుత పోరాటంతో.. న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 279 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 77/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 7 వికెట్లకు 281 పరుగులు చేసి గెలిచింది. బెన్ సీర్స్ 4, హెన్రీ 2 వికెట్లు పడగొట్టారు. న్యూజిలాండ్ 162, 372 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 256 రన్స్‌కు ఆలౌటైంది.

రోహిత్.. చెన్నైకు ఆడాలి!

రాయుడు ఆకాంక్ష



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో రోహిత్ శర్మ.. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడితే చూడాలని ఉందని మాజీ ఆటగాడు అంబటి రాయుడు అన్నాడు. 'అతడు కెప్టెన్సీ కావాలనుకుంటే.. అప్పగించడానికి అందరూ సిద్ధంగా ఉన్నారు. వచ్చే ఏడాది చెన్నైకి రోహిత్ ప్రాతినిథ్యం వహించాలని బలంగా కోరుకొంటున్నా. ఒకవేళ ధోనీ రిటైరైతే.. ఆ స్థానంలో శర్మ పగ్గాలందుకోవచ్చ'ని రాయుడు అన్నాడు. ఈ సీజన్‌లో ముంబై..రోహిత్‌ను తప్పించి హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ అప్పగించిన సంగతి తెలిసిందే.

బిజినెస్

పదేళ్లలో నిఫ్టీ 75,000

రాందేవ్ అగర్వాల్

ముంబై: భారత స్టాక్‌మార్కెట్‌కు మరో పదేళ్ల వరకు ఢోకా లేదని నిపుణుల అంచనా. మధ్య మధ్యలో కొన్ని కరెక్షన్లు వచ్చినా మదుపరులు పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చైర్మన్, సహ వ్యవస్థాపకుడు రాందేవ్ అగర్వాల్ తెలిపారు. పెద్ద అడ్డంకులు ఏమీ లేకపోతే నిఫ్టీ 2031 నాటికి 50,000 పాయింట్లు, మరో పదేళ్లలో 75,000 పాయింట్లను తాకే అవకాశం ఉందన్నారు. ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ అంచనాలు వెల్లడించారు. మదుపరులు ఏ షేర్లను పడితే ఆ షేర్లను కాకుండా మంచి ఫండమెంటల్స్ ఉన్న కంపెనీల షేర్లను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. మరో పదేళ్ల పాటు మౌలిక, రక్షణ, క్యాపిటల్ మార్కెట్ కంపెనీలకు ఢోకా ఉండకపోవచ్చని అగర్వాల్ తెలిపారు.

బైజూస్ ఆఫీసుల మూసివేత

ఉద్యోగులకు ఇంటి నుంచే పని



బెంగళూరు: ఎడ్యుటెక్ కంపెనీ బైజూస్ బెంగళూరులోని ప్రధాన కార్యాలయం తప్ప, దేశవ్యాప్తంగా పని చేస్తున్న మిగతా ఆఫీసులన్నింటినీ మూసివేయాలని నిర్ణయించింది. కొంతైనా ఖర్చులు తగ్గించుకునేందుకు కంపెనీ ఈ చర్య తీసుకుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆఫీసుల మూసివేత ప్రక్రియకు సుమారుగా గత ఆరు నుంచి ఎనిమిది మాసాలుగా కంపెనీ రంగం సిద్ధం చేస్తూ వస్తోంది. పలు కార్యాలయాలు పని చేస్తున్న భవనాల లీజు గడువు ముగుస్తున్నప్పటికీ చాలా కాంట్రాక్టులు రెన్యూ చేయలేదు. అలాంటి కార్యాలయాలన్నింటినీ లీజు గడువు ముగిసిన వెంటనే మూసివేస్తారు. అయితే ఈ ఆఫీసుల్లో పని చేసే సిబ్బంది మాత్రం ఇంటి నుంచి పని (వర్క్ ఫ్రం హోమ్) చేయాలని కంపెనీ కోరింది. ఇది ఎప్పటి వరకు అనే విషయాన్ని మాత్రం స్పష్టం చేయలేదు. అయితే ప్రధాన కార్యాలయం వెలుపల పని చేస్తున్న ఉద్యోగులకు, దేశ వ్యాప్తంగా ఉన్న 300 ట్యూషన్ కేంద్రాల సిబ్బందికి మాత్రం వర్క్ ఫ్రం హోమ్ వర్తించదు. ఆ ట్యూషన్ కేంద్రాలు యథాతథంగా పని చేస్తాయని కంపెనీ వర్గాలు తెలిపాయి. 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు ఈ కేంద్రాలకు వచ్చి విద్య అభ్యసిస్తూ ఉంటారు గనుక వాటిని యథాతథంగా కొనసాగించాలని కంపెనీ నిర్ణయించింది.

బైజూస్ ఇప్పటికే పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉంది. వర్కింగ్ క్యాపిటల్‌కు కూడా ఇబ్బందులు పడుతోంది. కంపెనీ ఉద్యోగుల్లో 75 శాతం మందికి ఫిబ్రవరి నెల జీతాలు ఇప్పటి వరకు అందలేదు. రైట్స్ ఇష్యూ ద్వారా సమీకరించిన 20 కోట్ల డాలర్ల నిధులను కూడా స్తంభింపచేయడమే ఇందుకు కారణమని కంపెనీ చెబుతోంది. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఉన్న తన ఆఫీసులన్నింటినీ మూసివేయాలని బైజూస్ నిర్ణయం తీసుకోవడం విశేషం.

రూ.3.15 లక్షల కోట్లు ఆవిరి

- 617 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- చిన్న కంపెనీల షేర్లు విల విల

ముంబై: స్టాక్ మార్కెట్లో రెండు రోజుల ర్యాలీకి తెరపడింది. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 616.75 పాయింట్లు నష్టపోయి 73,502.64 వద్దకు జారుకుంది. నిఫ్టీ 160.90 పాయింట్ల పతనంతో 22,332.65 వద్ద క్లోజైంది. అంతర్జాతీయ మార్కెట్లో ట్రేడింగ్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో దేశీయంగానూ మదుపరులు బ్యాంకింగ్, లోహ రంగ షేర్లలో పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణం. ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న షేర్లలో అమ్మకాలు పోటెత్తాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 నష్టపోయాయి. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.3.15 లక్షల కోట్లు తగ్గి రూ.389.66 లక్షల కోట్లకు (4.75 లక్షల కోట్ల డాలర్లు) పరిమితమైంది.

మరిన్ని విషయాలు..

- ఎలక్టోరల్ బాండ్ల డేటాను ఈనెల 12న విడుదల చేయాల్సిందేనని సుప్రీంకోర్టు ఎస్‌బీఐని ఆదేశించిన నేపథ్యంలో బ్యాంక్ షేరు 1.86 శాతం క్షీణించి రూ.773.50 వద్ద ముగిసింది.
- జేఎం ఫైనాన్షియల్ లిమిటెడ్ షేరు 10 శాతం పతనమై రూ.9.77 వద్ద ముగిసింది. నియంత్రణ నియమావళిని ఉల్లంఘించినందుకు గాను కొత్తగా డెట్ సెక్యూరిటీ ఇష్యూలకు లీడ్ మేనేజర్‌గా వ్యవహరించకుండా జేఎం ఫైనాన్షియల్‌పై సెబీ నిషేధం విధించడం ఇందుకు కారణం.
- బిట్‌కాయిన్ సరికొత్త రికార్డు స్థాయి 72,000 డాలర్లకు చేరుకుంది. అమెరికాతోపాటు తాజాగా యూకే సైతం క్రిప్టో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల(ఈటీఎఫ్) ట్రేడింగ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ఇందుకు కారణమైంది.
- క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.680-715గా నిర్ణయించింది.

ఎస్ఎంఈ షేర్ల ధరల్లో అవకతవకలు!



సంకేతాలందాయన్న సెబీ చీఫ్ మాధవి పురి బుచ్

ముంబై: చిన్న, మధ్య తరహా సంస్థల (ఎస్ఎంఈ) షేర్ల ధరల్లో అవకతవకలు జరుగుతున్నట్లు సంకేతాలందాయని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ అన్నారు. పబ్లిక్ ఆఫరింగ్‌లతో (ఐపీఓ) పాటు సెకండరీ మార్కెట్ ట్రేడింగ్‌లోనూ ఈ అవకతవకలు జరుగుతున్న సంకేతాలున్నాయని ఆమె చెప్పారు. ఈ నేపథ్యంలో మదుపరులు అధిక రిస్క్‌తో కూడుకున్న ఈ విభాగ కంపెనీల షేర్లలో పెట్టుబడుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని బుచ్ హెచ్చరించారు. సోమవారం ఓ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆమె మహిళా జర్నలిస్టులతో మాట్లాడారు. "కొన్ని సంస్థలు ఎస్ఎంఈ లిస్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌ను దుర్వినియోగపరుస్తున్నట్లు మాకు సమాచారం అందింది. ఎందుకంటే, ఎస్ఎంఈ ఐపీఓల్లో అక్రమాలకు పాల్పడటం సులువు. ఇందుకు సంబంధించిన కొన్ని ప్యాటర్న్స్ మా దృష్టికి కూడా వచ్చాయి. వీటిని గుర్తించి, ఎదుర్కొనే విషయంలో మాకు మార్కెట్ నుంచి సూచనలు అందాయి. డేటాను విశ్లేషించి, అవగాహన చేసుకునేందుకు అడ్వైజర్లతో కలిసి కృషి చేస్తున్నాం" అని బుచ్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్ఎంఈ విభాగానికి అదనపు సమాచార బహిర్గత నిబంధనలు ప్రవేశపెట్టే దిశగా ఆలోచన చేస్తున్నట్లు ఆమె చెప్పారు. సెబీ చైర్‌పర్సన్ వ్యాఖ్యల నేపథ్యంలో బీఎస్ఈలోని ఎస్ఎంఈ ఐపీఓ సూచీ 3.28 శాతం నష్టపోయి 55,453.91 వద్దకు జారుకుంది.

బుడగ ఏర్పడుతోంది..: ఎస్ఎంఈ సెగ్మెంట్లో కొన్ని కంపెనీల షేర్లు అనూహ్యంగా పెరగడంపైనా సెబీ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. "మార్కెట్లో కొన్ని విభాగ షేర్ల ధరలు అసాధారణంగా పెరగడంతో బుడగ (బబుల్) ఏర్పడుతోంది. ఈ బుడగను మరింత పెరగనివ్వడం సరి కాదు. ఎందుకంటే, ఆ బుడగ పగిలినప్పుడు తీవ్రంగా నష్టపోయేది చిన్న మదుపరులే. అది మంచిది కాదు. ప్రస్తుతం కొన్ని సంస్థల షేర్ల ధరలు వాటి ఆర్థిక స్థితిగతి, పనితీరుతో పొంతన లేకుండా పెరిగాయి. అది అతిశయోక్తిలా కన్పిస్తోంది" అని బుచ్ అన్నారు. 2023 జనవరి నుంచి స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీకి మించిన పనితీరును కనబరిచాయి. అధిక వాల్యువేషన్స్‌తోపాటు నష్ట అవకాశాలు పెరిగిన నేపథ్యంలో పలు అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు ముందుజాగ్రత్త వ్యూహంతో స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్లలో ఏక మొత్తం లేదా సిప్ పెట్టుబడుల స్వీకరణను కూడా నిలిపివేశాయి.

28 నుంచి టీ+0 సెటిల్‌మెంట్

మార్కెట్లో సెక్యూరిటీ క్రయ, విక్రయ లావాదేవీల పరిష్కార సమయం మరింత తగ్గనుంది. ఈ లావాదేవీలను జరిగిన రోజే పరిష్కరించే (టీ+0 సెటిల్‌మెంట్) ప్రక్రియ ఈనెల 28న ప్రారంభం కానుందని బుచ్ తెలిపారు. అయితే, ఇది ఐచ్ఛికమేనని ఆమె స్పష్టం చేశారు. టీ+0 సెటిల్‌మెంట్‌ను రెండు విడతల్లో అమలు చేయాలని సెబీ ప్రతిపాదించింది. తొలి దశలో మధ్యాహ్నం 1.30 గంటలకు జరిగిన లావాదేవీలకు అదే రోజున సెటిల్‌మెంట్ జరగనుంది. రెండో విడతలో మార్కెట్ ముగిసే (3.30 గంటల) వరకు జరిగే లావాదేవీలకు కూడా దీన్ని వర్తింపజేయనున్నారు. భవిష్యత్‌లో ట్రేడింగ్ లావాదేవీల తక్షణ (ట్రేడింగ్ జరిగిన క్షణాల్లోనే) సెటిల్‌మెంట్‌కు ఇది బాటలు వేయనుంది.



రూ.6,785 కోట్ల ఇండిగో షేర్లు విక్రయించిన గంగ్వాల్

ఇండిగో ఎయిర్‌లైన్స్ మాతృసంస్థ ఇంటర్‌గ్లోబల్ ఏవియేషన్ ప్రమోటర్లలో ఒకరైన రాకేశ్ గంగ్వాల్ సంస్థలో 5.83 శాతం వాటాకు సమానమైన 2.25 కోట్ల ఈక్విటీ షేర్లను రూ.6,785 కోట్లకు విక్రయించారు. బహిరంగ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా ఈ షేర్ల విక్రయం జరిగింది. తన సహ ప్రమోటర్ రాహుల్ భాటియాతో వివాదం నేపథ్యంలో గంగ్వాల్ 2022 ఫిబ్రవరిలో కంపెనీ బోర్డు నుంచి తప్పుకున్నారు. అలాగే, కంపెనీలో తన వాటాను వచ్చే ఐదేళ్లలో క్రమంగా తగ్గించుకోనున్నట్లు ప్రకటించారు. అదే నెలలో రాకేశ్ గంగ్వాల్ భార్య శోభ గంగ్వాల్ కంపెనీలో 4 శాతం వాటాను రూ.2,944 కోట్లకు, 2023 ఆగస్టులో మరో 2.9 శాతం వాటాను రూ.2,800 కోట్లకు విక్రయించారు. కాగా, 2022 సెప్టెంబరులో దంపతులిద్దరు కలిసి 2.74 శాతం వాటాను రూ.2,005 కోట్లకు విక్రయించారు. బీఎస్ఈలో కంపెనీ షేరు ధర సోమవారం 3.63 శాతం పెరిగి రూ.3,214.25 వద్ద ముగిసింది.

జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు అవార్డు

శంషాబాద్ రూరల్: జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అవార్డు లభించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ఏటా 1.5 కోట్ల నుంచి 2.5 కోట్ల మంది ప్రయాణించే ఎయిర్‌పోర్టుల్లో 2023వ సంవత్సరానికి ఎయిర్‌పోర్టు సర్వీస్ క్వాలిటీ (ఏఎస్‌క్యూ) విభాగంలో 'ఉత్తమ ఎయిర్‌పోర్టు' అవార్డు దక్కించుకుంది. ఎయిర్‌పోర్టు కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) మొత్తం 400 విమానాశ్రయాల్లో సేవలను పరిశీలించి జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును ఈ అవార్డుకు ఎంపిక చేసింది. 'ఎయిర్‌పోర్టు ఉద్యోగులు, ఇతర భాగస్వామ్య వర్గాలు అలుపూ సొలుపు లేకుండా అంకిత భావంతో పని చేయడం వల్లే మాకు ఈ గుర్తింపు లభించింది' అని జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణిక్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. విమానాశ్రయ విస్తరణతో అందుబాటులోకి వచ్చిన సదుపాయాలు కూడా ఇందుకు దోహదం చేశాయన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,280 ▲	60,760 ▲	79,000 ▼
ముంబై	65,650 ▲	60,130 ▲	72,550 ▲

పిట్టి ఇంజనీరింగ్ చేతికి బగాడియా ఇండస్ట్రీస్

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా పని చేసే పిట్టి ఇంజనీరింగ్ లిమిటెడ్ (పీఈఎల్) తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా కర్ణాటకకు చెందిన బగాడియా చైత్ర ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీఐపీఎల్) కంపెనీని కొనుగోలు చేసింది. ఇందుకోసం ఆ కంపెనీ ఎంటర్‌ప్రైజ్ వాల్యూ కింద రూ.124.92 కోట్లు చెల్లించనుంది. బీసీఐపీఎల్ కంపెనీ తుముకూరు వద్ద ఉన్న తన ప్లాంటులో ఏటా 18,000 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏసీ/డీసీ మోటార్లు, ఆల్టర్నేటర్లు, పంపులు, గృహోపయోగ పరికరాలు, విద్యుత్ వాహనాలకు అవసరమయ్యే ఎలక్ట్రికల్ లామినేషన్లు, అల్యూమినియం డై క్యాస్ట్ రోటార్లు తయారు చేస్తోంది. ఈ కొనుగోలుతో దక్షిణ భారతదేశం అంతా కార్యకలాపాలు విస్తరించవచ్చని పీఈఎల్ భావిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ		విజయవాడ	433
హైదరాబాద్	410	విశాఖపట్నం	450
12వ తేదీ		వరంగల్	412
చిత్తూరు	483	డజను గుడ్లు రూ.72	
గోదావరి	433		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	గోదావరి	106
వరంగల్	112	విజయవాడ	106
కరీంనగర్	112	గుంటూరు	111
మహబూబ్‌నగర్	112	ఒంగోలు	111
కర్నూలు	112	చిత్తూరు	123
విశాఖపట్నం	103		

నిడదవోలు అభ్యర్థిగా కందుల దుర్గేశ్

▸ జనసేనాని పవన్ అధికారిక ప్రకటన

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో జనసేన తరఫున పోటీచేసే మరో అభ్యర్థి పేరును ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. నిడదవోలు అసెంబ్లీ స్థానంలో పార్టీ సీనియర్ నేత కందుల దుర్గేశ్‌ను ఖరారుచేసినట్లు ఆ పార్టీ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో టీడీపీ, బీజేపీతో పొత్తులో లభించిన 21 అసెంబ్లీ స్థానాలకుగాను ఆరుగురు అభ్యర్థులను ఖరారుచేసినట్లయింది. ఇప్పటికే లోకం మాధవి (నెలిమర్ల), కొణతాల రామకృష్ణ (అనకాపల్లి), పంతం నానాజీ (కాకినాడ రూరల్), బత్తుల రామకృష్ణ (రాజానగరం), నాదెండ్ల మనోహర్ (తెనాలి) అభ్యర్థిత్వాలను పవన్ ప్రకటించారు. దుర్గేశ్ ప్రస్తుతం ఆ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. పవన్ ఆ మధ్య జిల్లాలో పర్యటించినప్పుడు రాజమహేంద్రవరం రూరల్ స్థానం నుంచి దుర్గేశ్ పోటీ చేస్తారని ప్రకటించారు. అయితే టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆ సీటుకు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో కొంత గందరగోళం ఏర్పడింది. సిటింగ్ ఎమ్మెల్యేలందరికీ తిరిగి అవకాశం కల్పిస్తున్నట్లు టీడీపీ అధినేత చంద్రబాబు అంతకుముందే ప్రకటించారు. దీంతో ఆయన, పవన్ రాజమండ్రి రూరల్‌పై చర్చించుకున్నారు. దుర్గేశ్‌కు నిడదవోలు స్థానం ఇచ్చేందుకు టీడీపీ అధినేత అంగీకరించారు. దుర్గేశ్ కూడా పవన్ సూచనల మేరకు నిడదవోలు నుంచి పోటీ చేసేందుకు సమ్మతించారు.

కూటమి అభ్యర్థుల విజయానికి శ్రమించాలి: పురందేశ్వరి

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులతోపాటు మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన అభ్యర్థుల విజయానికి ప్రతి బీజేపీ కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆ పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆమె వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర రైతుల పట్ల వివక్ష చూపిందని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ ఏటా రూ.6,000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తుంటే వాటిని కూడా కలిపేసి రైతు భరోసాగా చూపిస్తూ వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు.

విశాఖ ఎంపీగా పోటీకి సిద్ధం: సీఎం రమేశ్

జగన్‌రెడ్డి రాక్షస పాలనతో విసిగి పోయిన రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. విజయవాడలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసమే బీజేపీ, టీడీపీ, జనసేన జట్టు కట్టాయని అన్నారు. తాను విశాఖపట్నం నుంచి పార్లమెంటు బరిలో దిగాలనుకొంటున్నట్లు పార్టీ అధిష్ఠానానికి విన్నవించుకున్నట్లు తెలిపారు.

సంక్షేమం.. అభివృద్ధి మా లక్ష్యం: బీజేపీ

విజయవాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా సాధ్యమైనపుడే దేశం ముందుకు వెళుతుందని, కేంద్ర ప్రభుత్వం ఈ నినాదంతోనే దేశాన్ని సమున్నత స్థానంలో నిలిపేదిశగా అడుగులు వేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ గుర్‌గావ్ నుంచి వర్చువల్‌గా జాతీయరహదారి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా విజయవాడలో ఎన్‌హెచ్ నిర్వహించిన కార్యక్రమంలో పురందేశ్వరి పాల్గొన్నారు. పురందేశ్వరి మాట్లాడుతూ గడిచిన పదేళ్లుగా ఏపీకి రూ.70 వేల కోట్ల రోడ్ల విస్తరణ ప్రాజెక్టులకు కేంద్రం శ్రీకారం చుట్టిందన్నారు. మరో రూ.30 వేల కోట్ల మేర పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయన్నారు. ఏపీకి 2014 నుంచి ఇప్పటి వరకు రూ.లక్షా పది వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు వచ్చాయని తెలిపారు. బెంగళూరు-అమరావతి-విజయవాడ కారిడార్ కోసం భారీ ఎత్తున కేంద్రం కేటాయింపులు చేసిందన్నారు.

జగన్ ప్రతిపాదనలకు చోటేదీ?

సీఎం జగన్ తాజాగా ప్రతిపాదించిన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం వీటిలో చేర్చలేదు. గతంలో టీడీపీ ప్రతిపాదించిన అమరావతి అవుటర్ రింగ్ రోడ్డును వద్దని.. ఆ స్థానంలో విజయవాడ తూర్పు బైపా‌స్‌ను జగన్ ప్రతిపాదించారు. అయితే, దీనికి కేంద్రం నిధులు కేటాయించలేదు. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానంగా జాతీయ రహదారి విస్తరణ పనులను చేపట్టాలని సీఎం కోరారు. ఈ ప్రతిపాదనను కూడా కేంద్రం పక్కన పెట్టింది.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు: సీఈసీ

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): 'స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా, న్యాయబద్ధంగా, బెదిరింపులు, ప్రేరణలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాలి. ఈ విషయంలో కేంద్ర పరిశీలకులు కీలక పాత్ర పోషించాలి' అని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ అన్నారు. భారత ఎన్నికల సంఘం కేంద్ర పరిశీలకులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోమవారం న్యూఢిల్లీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా నేతృత్వంలో 23 మంది ఐఏఎస్, 13 మంది ఐపీఎస్ అధికారులు అమరావతి సచివాలయం నుంచి వర్చ్యువల్ విధానంలో పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన 16 మంది ఐఏఎస్‌లు, 14 మంది ఐపీఎస్ అధికారులు నేరుగా ఢిల్లీలో ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ ఎటువంటి సమస్యాత్మకమైన విషయం ఎదురైనా తక్షణ పరిష్కారానికి ఎన్నికల సంఘానికి నివేదించాలన్నారు. కేంద్రపరిశీలకులు నిర్వహించాల్సిన విధి విధానాలపై సమగ్ర అవగాహన పెంచుకుని ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు.

అమలాపురం నుంచి కోడికత్తి శ్రీను పోటీ

విజయవాడ(ఆంధ్రజ్యోతి), ముమ్మిడివరం, మార్చి 11: జనిపల్లి శ్రీనివాసరావు(కోడికత్తి శ్రీను) రాజకీయ రంగప్రవేశం చేశారు. సోమవారం ఆయన జై భీమ్‌రావ్ భారత్ పార్టీలో చేరారు. విజయవాడలో అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాణేలంక పెదపేటలో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా అవి అర్హులకు చేరడం లేదన్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు.

జగన్‌ను సీఎం చేద్దాం

▸ బేషరతుగా వైసీపీలో చేరుతున్నా: ముద్రగడ

కిర్లంపూడి, మార్చి 11: 'ఈనెల 14న నేను వైసీపీలో చేరుతున్నా. అవకాశం ఉన్నవారంతా ఆ రోజు నాతోపాటు తాడేపల్లికి రావాలి. ఆ రోజు నా వెంట వచ్చే వారంతా తమ తమ వాహనాల్లో ఎవరి భోజనాలు వారే తెచ్చుకోవాలి' అని ముద్రగడ పద్మనాభం కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన తన స్వగ్రామమైన కాకినాడ జిల్లా కిర్లంపూడిలో బహిరంగ లేఖ విడుదల చేశారు. సీఎం జగన్ పిలుపు మేరకు వైసీపీలోకి వెళ్లడానికి అందరి ఆశీస్సులతో నిర్ణయం తీసుకున్నా. జగన్‌ను మళ్లీ సీఎం పీఠంపై కూర్చోబెట్టడానికి ఎలాంటి కోరికలు లేకుండా పనిచేయాలని నిర్ణయించుకున్నా. నేను ఎప్పుడూ తప్పు చేయలేదు. ఇక ముందు కూడా చేయను' అని ముద్రగడ అన్నారు.

ముద్రగడ మా పార్టీలోకి రావాలి: కేఏ పాల్

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కాపులంతా ప్రజాశాంతి పార్టీలోకి రావాలని ఆ పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కోరారు. ముద్రగడ పద్మనాభం మళ్లీ ఆలోచించుకుని, ప్రజాశాంతి పార్టీలోకి రావాలన్నారు. సోమవారం ఉండవల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు.

సర్పంచుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన జగన్

▸ ఆయన్ను ఓడించాలని కంకణం కట్టుకున్న వైసీపీ నేతలు: వైవీబీ

▸ తిరుపతి కలెక్టరేట్ వద్ద 'చాంబర్' నేతృత్వంలో ఆందోళన

తిరుపతి, మార్చి 11: 'సర్పంచుల ఆత్మగౌరవాన్ని సీఎం జగన్ దెబ్బతీశారు. దీంతో ఆయన్ను ఓడించాలని వైసీపీ సర్పంచులు కంకణం కట్టుకున్నారు' అని పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఏపీ పంచాయతీ సర్పంచుల సంఘం, ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్పంచులు తమ 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తిరుపతి కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. 'కేంద్రం ప్రభుత్వం మంజూరు చేసిన 14,15 ఆర్థిక సంఘాల నిధులు రూ.8,660 కోట్లు తన సొంత పథకాలకు సీఎం వాడుకున్నారు. తక్షణం వాటిని సర్పంచుల ఖాతాల్లో జమ చేయాలి. జగన్ ఓడితే కానీ గ్రామాల అభివృద్ధి జరగదు. సర్పంచుల సంఘం 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తాం' అని అన్నారు.



తిరుపతి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సర్పంచులు

ఆశీర్వదించండి

(మొదటి పేజీ తరువాయి)

సుమారు 8 గంటలు చర్చలు జరిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. అనంతరం... ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయనున్నదీ వివరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం... తెలుగుదేశం పార్టీ 17 పార్లమెంటు, 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుంది. జనసేన రెండు లోక్‌సభ, 21 అసెంబ్లీ స్థానాల్లో బరిలో దిగనుంది. ఇక... బీజేపీ ఆరు పార్లమెంటు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. పొత్తుల్లో భాగంగా బీజేపీ, జనసేనకు కలిపి 8 పార్లమెంటు, 30 అసెంబ్లీ స్థానాలను ఇవ్వాలని తొలుత భావించారు. ఇప్పుడు... అసెంబ్లీ స్థానాల సంఖ్య 31కి పెరిగింది. తొలుత జనసేనకు 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లు ఇచ్చారు. బీజేపీతో పొత్తు అనంతరం జనసేన ఒక ఎంపీ స్థానాన్ని, 3 అసెంబ్లీ స్థానాలను త్యాగం చేయాల్సి వచ్చింది. టీడీపీ కూడా ఒక అసెంబ్లీ స్థానాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది.

మరింత ముందుకు...

పొత్తులు, సీట్లపై రెండురోజులపాటు ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చంద్రబాబు, పవన్ చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. బీజేపీ అధిష్ఠానం షెకావత్, పాండాను ప్రతినిధులుగా విజయవాడకు పంపింది. ఆదివారం నాడు పవన్ కల్యాణ్‌తో ఒక హోటల్లో గంటపాటు చర్చలు జరిపారు. వీరు దుర్గమ్మను దర్శించుకుని సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో పవన్ కల్యాణ్ కూడా అక్కడికి చేరుకున్నారు. వీరి భేటీ రాత్రి 8 గంటలవరకూ సాగింది. తమపార్టీకి మరిన్ని అసెంబ్లీ సీట్లు కావాలని బీజేపీ నేతలు కోరారు. దీంతో... టీడీపీ, జనసేన త్యాగం చేశాయి.

సీట్ల సర్దుబాటు అంశాలతోపాటు మూడు పార్టీలు ఉమ్మడిగా విడుదల చేయాల్సిన మేనిఫెస్టోపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. తాము ప్రతిపాదించిన హామీలను చంద్రబాబు వారికి వివరించారు. అభివృద్ధి, సంక్షేమం సమతుల్యత గురించి తెలిపారు. బీజేపీ తన వైపు నుంచి ఏవైనా చెబితే అవి కూడా ఈ మేనిఫెస్టోలో పెడతామని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో వైసీపీ పాలనలో నెలకొన్న పరిస్థితుల గురించి వివరించారు. పోలవరం సహా ఇరిగేషన్ ప్రాజెక్టులు పడకేయడం, రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోవడం, పెట్టుబడులు, పరిశ్రమలు రాని పరిస్థితి, అరాచకం పెచ్చుమీరడం, ఇసుక, మద్యం, గనులు వంటి వాటిలో విపరీతంగా చోటు చేసుకొన్న అవినీతి, ఇప్పుడు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వైసీపీ నేతలు తొక్కుతున్న అడ్డదారులు వంటి వాటిని ఆయన వివరించారు. ఏపీకి చాలా నష్టం జరిగిందని కేంద్ర మంత్రి షెకావత్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. జగన్‌ను ఓడించేందుకు మూడు పార్టీలు గట్టి పట్టుదలతో పని చేయాల్సి ఉందని పవన్ అభిప్రాయపడినట్లు తెలిసింది. దీనికోసమే కొన్ని సీట్లను వదులుకోడానికి కూడా సిద్ధపడినట్లు చెప్పినట్లు సమాచారం.

చిలకలూరిపేట సభపై...

బీజేపీ, జనసేన నేతలతో భేటీ అనంతరం తమ పార్టీ నేతలు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి కుమార్‌తో చంద్రబాబు సమావేశం నిర్వహించారు. చిలకలూరిపేటలో ఈ నెల 17న నిర్వహించదల్చిన బహిరంగ సభ ఏర్పాట్లపై వారితో ఆయన చర్చించారు. ఈ సభకు ప్రధాని మోదీని కూడా ఆహ్వానించిన విషయం తెలిసిందే. అనంతపురం నుంచి వచ్చిన లోకేశ్ కొద్దిసేపు బీజేపీ నేతలతో చర్చల్లో పాల్గొన్నారు.

గెలిచే స్థానాలు తీసుకోండి...

మరోవైపు... బీజేపీ పోటీ చేయాలని భావిస్తున్న స్థానాలకు సంబంధించి... అక్కడి పరిస్థితులు, ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు, సమీకరణాలను చంద్రబాబు వారికి వివరించారు. గెలుపు అవకాశాలున్న స్థానాలను ఆయనే చెప్పి, పొత్తులో వాటిని తీసుకొంటే మంచిదని సూచించినట్లు సమాచారం. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితిపై తాము చేయించిన సర్వేల్లో వెల్లడైన ఫలితాల వివరాలను చంద్రబాబు అందచేశారు. అవిగాక బీజేపీ కోరుతున్న ఇతర సీట్లపైనా కొంత చర్చ జరిగింది. అనుకూలంగా ఉన్న వాటికి ఓకే చెప్పిన చంద్రబాబు కొన్ని సీట్లు ఇవ్వడానికి తనకు ఉన్న అభ్యంతరాలు వారికి వివరించారు. విజయవాడ, విశాఖపట్నం ఎంపీ సీట్లు తాము ఇవ్వలేమని స్పష్టం చేసినట్లు చెబుతున్నారు. సిటింగ్ ఎంపీ రఘురామ కృష్ణంరాజుకు నర్సాపురం సీటును బీజేపీ కోటాలో ఇవ్వడంపై చర్చ జరిగింది. అసెంబ్లీ సీట్లపైనా విపులంగా చర్చ జరిగింది. ఇక్కడ జరిగిన చర్చల వివరాలను బీజేపీ నేతలు అప్పటికప్పుడే ఢిల్లీలోని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కార్యాలయానికి తెలిపారు. తమ సీట్లపై స్పష్టత తీసుకొని షెకావత్. పాండా సోమవారం ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లిపోయారు. ఆ తర్వాత మరో 45 నిమిషాలపాటు చంద్రబాబు, పవన్ చర్చించుకున్నారు. తెలుగుదేశం పార్టీ తన అభ్యర్థుల రెండో జాబితాను మంగళ లేదా బుధవారం విడుదల చేసే అవకాశం ఉంది.

17న రాష్ట్రానికి మోదీ

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఈ నెల 17వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో బీజేపీ-టీడీపీ-జనసేన ఉమ్మడిగా నిర్వహించే భారీ సభలో పాల్గొంటారు. పదేళ్ల తర్వాత మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఒకే వేదికపైకి రానుండడంతో మూడు పార్టీల కార్యకర్తలు, అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. వాస్తవానికి 16వ తేదీన ఆయన విశాఖ వస్తారని.. బీజేపీ ర్యాలీలో పాల్గొంటారని ప్రకటన వెలువడింది. అయితే ఈ పర్యటన రద్దయిందంటూ స్థానిక బీజేపీ నేతలకు పార్టీ జాతీయ నాయకత్వం సోమవారం సాయంత్రం సమాచారమిచ్చింది. ఉమ్మడి బహిరంగ సభను విజయవంతం చేయడానికి 3 పార్టీల నుంచి 115 మంది నేతలతో 12 ఉమ్మడి కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీల వివరాలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం రాత్రి ప్రకటించారు.

మా కుటుంబం త్వరలోనే టీడీపీలోకి

▸ ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా నా కుమారుడు: మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో అద్భుతాలు జరుగడం ఖాయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసే విధంగా కృషిచేస్తానని ఒంగోలులో తెలిపారు. తన కుమారుడు రాఘవరెడ్డితో కలిసి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. తానిక రాజకీయాల నుంచి రిటైరవుతున్నట్లు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని.. తన కుమారుడికి అవకాశం కల్పించాలని కోరానని.. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని.. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు ఒంగోలు లోక్‌సభ స్థానంలో టీడీపీ తరఫున పోటీ చేస్తారని వెల్లడించారు. జిల్లాలో 33 ఏళ్ల నుంచి మాగుంట కుటుంబం రాజకీయాల్లో ఉంటూ ప్రజలకు చేరువైందని, స్వర్గీయ సుబ్బరామరెడ్డి, పార్వతమ్మతోపాటు తాను ఎంపీగా గెలిచామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాఘవరెడ్డిని పోటీ చేయించాలని తన కుటుంబం నిర్ణయించుకుందన్నారు. చంద్రబాబు ఒంగోలు పర్యటన సోమవారమే జరగాల్సి ఉండగా.. అనివార్య కారణాల వల్ల వాయిదాపడిందని, త్వరలోనే తేదీని నిర్ణయించుకుని మాగుంట పార్టీలో చేరతారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ చెప్పారు.

ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా సీట్ల సర్దుబాటు

▸ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

▸ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ప్రకటన



అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): దూరదృష్టి గల నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు రానున్న లోక్‌సభ, ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసిపోటీ చేయాలని నిర్ణయించినట్టు మూడు పార్టీలు సోమవారం రాత్రి విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని తెలిపాయి. అదేవిధంగా భారతదేశం ప్రపంచ లీడర్‌గా ఎదగాలని ఆకాంక్షిస్తూ, దేశ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నాయి. మూడు పార్టీల పొత్తులకు సంబంధించి ఢిల్లీలో జరిగిన సమావేశానికి కొనసాగింపుగా అమరావతిలో సోమవారం ఆయా పార్టీల నేతలు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పాండా, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చించారు. సీట్ల కేటాయింపులో రాష్ట్ర భవిష్యత్ ప్రయోజనాలకు పెద్దపీట వేసేలా మూడు పార్టీలు అంగీకరించాయి. ఇది, రాష్ట్ర ఉజ్వల అభివృద్ధి, ప్రగతిశీల భవిష్యత్తుకు పునాది వేస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. పోటీ చేయనున్న నియోజకవర్గాల పేర్లను ఆయా పార్టీలు ప్రకటించనున్నాయి. కాగా, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, అంచనాలను నెరవేర్చేందుకు ముందుకు సాగుతున్నట్టు పార్టీలు తెలిపాయి. ఎన్డీయే కూటమి భాగస్వామ్య పార్టీలను రాష్ట్ర ప్రజలు ఆశీర్వదిస్తారని, సేవ చేసే అవకాశం కల్పిస్తాయని విశ్వసిస్తున్నట్టు బీజేపీ, టీడీపీ, జనసేన సంయుక్త ప్రకటనలో తెలిపాయి.

కూటమిని ఆశీర్వదించండి

"ఈ రోజు అమరావతిలో జరిగిన సమావేశంలో బీజేపీ, జనసేన, టీడీపీలు సీట్ల పంపకాలపై ఒక ఫార్ములాను రూపొందించుకున్నాయి. ఇదొక కీలకమైన అడుగు. రాష్ట్రాన్ని తిరిగి ఉజ్వల భవిష్యత్తు దిశగా నడిపించుకునే దశకు ప్రజలు చేరుకున్నారు. ఈ కూటమిని ఆశీర్వదించాలని, చరిత్రాత్మక విజయాన్ని అందించి సేవచేసే అవకాశం ఇవ్వాలని నా రాష్ట్ర ప్రజలకు మనస్ఫూర్తిగా పిలుపునిస్తున్నా"

\- చంద్రబాబు

బీజేపీకి విజయనగరం, అరకు!

▸ అనకాపల్లి, రాజమండ్రి, నరసాపురం, తిరుపతి కూడా

▸ పొత్తులో వచ్చే లోక్‌సభ సీట్లు, అభ్యర్థులపై స్పష్టత?

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేనతో పొత్తులో భాగంగా రాష్ట్రంలో బీజేపీ పోటీచేసే ఆరు లోక్‌సభ స్థానాలు, వాటిలో పోటీచేసే అభ్యర్థులపై దాదాపుగా స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. విజయనగరం నుంచి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, అనకాపల్లి-రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్, అరకు-మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, రాజమహేంద్రవరం-రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, నరసాపురం-సిటింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు, తిరుపతి నుంచి రత్నప్రభ బరిలో నిలుస్తారని ఆ పార్టీ అంతర్గత వర్గాల సమాచారం. అలాగే బీజేపీ 10 అసెంబ్లీ స్థానాల్లో బరిలోకి దిగనుంది. జమ్మలమడుగులో ఆదినారాయణరెడ్డి, ధర్మవరం-వరదాపురం సూరి, తిరుపతి-భానుప్రకాశ్‌రెడ్డి, కైకలూరు-కామినేని శ్రీనివాస్, పాడేరు-ఉమామహేశ్వరరావు, విశాఖ ఉత్తరంలో విష్ణుకుమార్‌రాజు పోటీ దాదాపు ఖాయమంటున్నారు. వీటితోపాటు బద్వేలు (ఎస్సీ), విజయవాడ పశ్చిమ, మరో రెండు స్థానాల అభ్యర్థులను, లోక్‌సభ స్థానాల బరిలో నిలిచేవారిని రెండ్రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది.

మారిన అసెంబ్లీ స్థానాలు.. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన అనంతపురం అర్బన్, దర్శి అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులే బరిలో నిలవనున్నారు. వాటికి బదులు వేరే సీట్లను జనసేనకు కేటాయిస్తారు. బద్వేలు స్థానాన్ని టీడీపీ.. బీజేపీకి వదులుకోగా.. విజయవాడ పశ్చిమ, తిరుపతి, మరో స్థానాన్ని జనసేన కమలనాథులకు వదులుతున్నట్లు సమాచారం.

'ఆపరేషన్ ఆకర్ష్' ఢమాల్!

టికెట్లు రాని టీడీపీ, జనసేన నేతలకు వైసీపీ పెద్దల వల

పార్టీ మారాలంటూ ప్రలోభాలు.. వారి ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు

వైసీపీలోకి వెళ్లేందుకు వారు ససేమిరా..

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అధికార పక్షం వైసీపీ చేపట్టిన 'ఆపరేషన్ ఆకర్ష్' నీరుగారినట్లే కనిపిస్తోంది. పొత్తులో సీట్లు పోవడం వల్ల టీడీపీ, జనసేన నేతల్లో పెద్దఎత్తున కల్లోలం చెలరేగుతుందని.. వారందరినీ తమ పార్టీలోకి తెచ్చేసుకోవాలని వైసీపీ పెద్దలు ఆశపడ్డారు. ఇందుకోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నా ఇంత వరకూ ఫలితం రాలేదు. ఆ రెండు పార్టీల్లోని చెప్పుకోదగిన నేతలెవరూ వైసీపీలో చేరలేదు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపుపై నమ్మకం లేకపోవడం వల్లే ఆ పార్టీలోకి వెళ్లడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. టీడీపీ, జనసేన మధ్య పొత్తు ఖరారైన తర్వాత ఆ పార్టీల్లోని నాయకులను ఆకర్షించడానికి వైసీపీ నాయకత్వం భారీ ప్రణాళికే రూపొందించింది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ప్రతి జిల్లాలో ఇద్దరు-ముగ్గురు సీనియర్ నేతలకు ఈ బాధ్యత అప్పగించింది. తాడేపల్లి కార్యాలయం నుంచి ప్రతి రోజూ వారిని పరుగులు పెట్టించింది. జనసేనకు కేటాయించిన సీట్లలో టీడీపీ నేతలు, టీడీపీకి ఇచ్చిన సీట్లలో జనసేన నాయకులు తీవ్ర అసంతృప్తికి గురవడం ఖాయమని, వారిని వలవేసి పట్టి.. తమ పార్టీలోకి తెచ్చుకుంటే విపక్ష కూటమిని దెబ్బ తీయొచ్చని వైసీపీ నాయకత్వం ఆశించింది. ఉదాహరణకు కృష్ణా జిల్లాలో అవనిగడ్డ అసెంబ్లీ సీటు పొత్తులో జనసేనకు వెళ్లింది. అక్కడ టీడీపీ ఇన్‌చార్జిగా మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ ఉన్నారు. ఆయన్ను వైసీపీలోకి తీసుకోవాలని మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని గట్టి ప్రయత్నం చేశారు. బుద్ధప్రసాద్ కూడా ఒక దశలో వారి ఒత్తిడికి లొంగి నియోజకవర్గ నేతలతో సమావేశం కూడా ఏర్పాటు చేశారు. కానీ వారిలో అత్యధికులు వైసీపీలోకి వెళ్లడానికి ససేమిరా అన్నారు. దాంతో ఆయన ఆగిపోయారు. అంతకుముందు అక్కడ ఉన్న వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబును మచిలీపట్నం లోక్‌సభ ఇన్‌చార్జిగా ప్రకటించారు. అయితే ఆయన పోటీకి విముఖంగా ఉండడం.. అవనిగడ్డకు సరైన అభ్యర్థి ఎవరూ దొరక్కపోవడంతో మళ్లీ ఆయన్నే అసెంబ్లీ స్థానం ఇన్‌చార్జిగా ప్రకటించారు. దివంగత నేత వంగవీటి రంగా తనయుడు రాధాకృష్ణను కూడా వైసీపీలోకి తీసుకోవాలని ప్రయత్నించారు. ఆయన కూడా స్పందించలేదు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పొత్తులో జనసేనకు వెళ్లింది. ఆ స్థానాన్ని ఆశించిన టీడీపీ నాయకులు జలీల్ ఖాన్, నాగుల్ మీరా, బుద్దా వెంకన్నలతో వైసీపీ నేతలు సంప్రదింపులు జరిపారు. వారెవరూ అధికారపక్షంలోకి వెళ్లడానికి అంగీకరించలేదు. ఇలాంటి ప్రయత్నాలు అన్ని జిల్లాల్లోనూ చేసినట్లు సమాచారం.

స్వతంత్రంగా నిలబడితే సాయం..!

కొన్ని చోట్ల టీడీపీ, జనసేన నేతలు తమకు సీటిస్తే వస్తామని వైసీపీ నేతలకు చెప్పారు. అలా అడిగిన నేతలు పోటీచేసే సత్తా ఉన్నవారు కాకపోవడం.. వారి కంటే తమ అభ్యర్థులే మెరుగైనవారని వైసీపీ నాయకత్వం భావించి.. వారి ప్రతిపాదనపై స్పందించలేదు. అయితే అలాంటి వారు వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడాలని, కొంత ఆర్థిక సాయం చేస్తామని వైసీపీ పెద్దలు తాయిలాలు ఎరవేశారు. ఉదాహరణకు.. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు ఆ పార్టీ టికెట్ రాలేదు. దీంతో ముద్దరబోయిన టీడీపీకి రాజీనామా చేసి వైసీపీ నేతల వద్దకు వెళ్లారు. నూజివీడు, గన్నవరం నియోజకవర్గాల్లో ఆయన పేరు పరిశీలిస్తున్నామని చెప్పిన వైసీపీ నేతలు చివరకు సీటు ఇవ్వలేమని తేల్చేశారు. ఆయన ఎక్కడైనా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే సాయం చేస్తామని చెప్పారు. ఆయన ఇప్పుడేం చేయాలన్న మీమాంసలో పడ్డారు.



శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంటలో వైసీపీ అభ్యర్థి మగ్బూల్ బాషాతో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న వలంటీర్లు, ఫీల్డు అసిస్టెంట్లు

వలంటీర్లే వైసీపీ ప్రచార సారథులు

నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం

గాండ్లపెంట, ఉంగుటూరు, మార్చి 11: ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూ ప్రజలకు సేవలు అందించాల్సిన గ్రామ వలంటీర్లు అధికార వైసీపీ పార్టీ ఎన్నికల ప్రచారంలో మునిగితేలుతున్నారు. ప్రతిపక్షాలు ఫిర్యాదులు చేస్తున్నా, ఎన్నికల సంఘం వద్దని చెబుతున్నా.. వారు మాత్రం ప్రచారాన్ని ఆపడం లేదు. సోమవారం శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంటలో వైసీపీ అభ్యర్థి మగ్బూల్ బాషాతో కలిసి గ్రామ వలంటీర్లు, ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లు ఎన్నికల ప్రచారం చేశారు. పలువురు వలంటీర్లు, ఫీల్డు అసిస్టెంట్లు వైసీపీ ప్రచార కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఆదివారం సాయంత్రం వలంటీర్లతో కలిసి వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ నాయకులు మరడ మంగారావు, బండారు నాగరాజు, గృహ సారథులు.. వలంటీర్లను వెంటపెట్టుకుని గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాస్ (వాసుబాబు)కు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంపై విమర్శలు రావడంతో ఎంపీడీవో శర్మ వివరణ ఇస్తూ ఎన్నికల కోడ్ కంటే ముందు ఆయా గ్రామాల లబ్ధిదారులకు ప్రభుత్వం తరపున ఏఏ ప్రయోజనాలు సమకూరాయో వివరాలతో ఉన్న కరపత్రాలను మాత్రమే వలంటీర్లు పంపిణీ చేశారని చెప్పారు.

అంగన్వాడీలకు చీరలు, స్వీటు బాక్సులు

▸ మహిళా దినోత్సవం పేరిట పంపిణీ చేసిన జగ్గిరెడ్డి

రావులపాలెం, మార్చి 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సోమవారం మహిళలకు తాయిలాలు పంపిణీ చేశారు. రావులపాలెంలో రెండు చోట్ల మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్, జగ్గిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సోమసుందరెడ్డి ఫొటోలతో ఉన్న చీర, స్వీటు బాక్సులను మహిళలకు పంపిణీ చేసి, తన గెలుపునకు సహకరించాలని కోరినట్టు సమాచారం. మరో కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, యానిమేటర్లు పాల్గొనగా.. వారికి విందు ఇచ్చారు.



రావులపాలెంలో అంగన్‌వాడీలకు చీర, స్వీటు బాక్సు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఎన్నికలు ఆఖరి విడతలో జరపాలి

▸ హైకోర్టులో పాల్ వ్యాజ్యం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికలను రాష్ట్రంలో ఆఖరి విడత(మే నెల)లో నిర్వహించేలా కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతిపార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. తద్వారా సాధ్యమైనంత త్వరగా ఓట్లను లెక్కించవచ్చని, ఈవీఎంలలో అవకతవకలకు తావులేకుండా చేయవచ్చని పేర్కొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ముందు సోమవారం ఈ పిల్ విచారణకు రాగా.. మరో బెంచ్ ముందు విచారణకు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. దీంతో పిల్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని భోజన విరామ సమయం ముగిసిన తరువాత జస్టిస్ జి.నరేందర్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని పాల్ అభ్యర్థించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయితే ఈ పిల్ నిరర్థకం అవుతుందన్నారు. ఆఖరు విడతలో ఏపీ ఎన్నికలు నిర్వహించాలని ఈసీకి విజ్ఞప్తి చేసినా స్పందన లేదన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. కేసు రికార్డులు అందుబాటులో లేవని, పిల్‌పై మంగళవారం విచారణ జరుపుతామని పేర్కొంది.

వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల సంఘం షాక్

▸ జనసేన ఫిర్యాదుతో కాకినాడ జేసీపై బదిలీ వేటు

▸ నాలుగేళ్లుగా ఉమ్మడి జిల్లాలో విధులు



కాకినాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జేసీ ప్రవీణ్ ఆదిత్యపై బదిలీ వేటు పడింది. కొద్ది నెలల క్రితమే ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఉమ్మడి జిల్లాలో మూడేళ్లపైనే పని చేసిన అధికారులను ఈసీ ఆదేశాల ప్రకారం వేరే జిల్లాలకు బదిలీ చేయాల్సి ఉంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఈసీ ఆదేశాలకు తూట్లు పొడుస్తూ తిరిగి ఇదే జిల్లాలో జనవరి 31న ఆయన్ను జేసీగా, పిఠాపురం రిటర్నింగ్ అధికారిగా నియమించింది. ఇది వివాదాస్పదమైంది. మూడేళ్లపైనే ఉమ్మడి జిల్లాలో పనిచేసిన ప్రవీణ్ ఆదిత్యను జేసీగా, ఆర్వోగా నియమించడం సరికాదని జనసేన అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జేసీ ప్రవీణ్ ఆదిత్యపై బదిలీ వేటు పడింది. కాగా, పిఠాపురం నియోజకవర్గంలో దొంగ ఓట్లు, చనిపోయిన వారిని ఓటర్లుగా భారీగా చూపించడం, ఓట్ల పరిశీలనలో ఇవేమీ తొలగించకపోవడంపై ఇప్పటికే ఈసీ సీరియస్‌గా ఉంది. దీనికి సంబంధించి ఇప్పటికే 14 మంది వైసీపీ నాయకులపై కేసులు కూడా నమోదయ్యాయి. అధికార పార్టీకి పరోక్షంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో జేసీని ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా జేసీగా ఉన్న ఎస్. రామసుందరెడ్డిని జిల్లా జేసీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రవీణ్‌ఆదిత్యను పశ్చిమగోదావరి జిల్లా జేసీగా సాగనంపింది.

బాబుపై మరో కేసు

▸ అసైన్డ్ భూముల కేసులో ఏ-40గా చేర్చిన సీఐడీ

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్రప్రభుత్వం మరో కేసు నమోదు చేసింది. ఇప్పటి వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫైబర్‌గ్రిడ్ కేసుల్లో నిందితుడిగా చేర్చిన సీఐడీ.. తాజాగా అసైన్డ్ భూముల కేసు ఎఫ్ఐఆర్‌లోనే గాక చార్జిషీటులోనూ నిందితుడి(ఏ-40)గా పేర్కొంది. రాజధాని అమరావతిలో వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం, రాయపూడి గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేశారని వరప్రసాదరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మాజీ మంత్రి పి.నారాయణ, ఆయన కుటుంబ సభ్యులపై సీఐడీ గతంలో కేసులు నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌లలో ఎక్కడా చంద్రబాబు పేరు లేదు. ఇప్పుడు 14/2020 కేసులో ఆయనతో పాటు 22 మందిని నిందితులుగా పేర్కొంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం చార్జిషీటు, మెమో దాఖలు చేసింది. వీరిలో నారాయణ బంధువు పి.సుబ్రహ్మణ్యాన్ని ఏ-41గా చేర్చింది. వీరందరిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కాగా, యువగళం పాదయాత్ర ముగింపు సభలో లోకేశ్ చేసిన రెడ్‌బుక్ వ్యాఖ్యలపై సీఐడీ వేసిన పిటిషన్‌పై విచారణ 21కి వాయిదా వేసింది. కౌంటర్ దాఖలుకు ఆయన తరఫు న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ సమయం కోరారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయాధికారి విచారణను 21కి వాయిదా వేశారు.

ప్రేమ పేరుతో ఒకడు.. పూజల మాటున మరొకడు..

- బాలికపై ఇద్దరు కామాంధుల అఘాయిత్యం
- తిరుపతి జిల్లా రేణిగుంటలో దారుణం



మూర్తి స్వామి

రేణిగుంట, మార్చి 11: మైనర్ బాలికపై ఇద్దరు కామాంధులు అఘాయిత్యానికి పాల్పడిన ఉదంతం తిరుపతి జిల్లాలో చోటుచేసుకుంది. రేణిగుంట మండలం గాజుల మండ్యం పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన కుటుంబం తిరుపతిలో కాపురముంటోంది. వారికి తొమ్మిదో తరగతి చదివే కుమార్తె ఉంది. ఆరు నెలల క్రితం ఆ బాలికకు ట్రైన్‌లో మహ్మద్ షఫీ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. ఈ క్రమంలో షఫీ అవసరాలకు ఇంట్లో నుంచి డబ్బు, నగలు కూడా తీసుకెళ్లి ఇచ్చింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బిడ్డను మందలించినా మాట వినలేదు. దీంతో ఫిబ్రవరి 20న ఆమెను రేణిగుంట పట్టణంలోని శ్రీరాజరాజేశ్వరి దేవి జ్ఞాన పీఠం స్వామీజీ మూర్తి స్వామి అలియాస్ కోదండరామాచార్యులు వద్దకు తీసుకెళ్లారు. ఇదే అదునుగా.. ఆ స్వామీజీ కొత్త దుస్తులు తీసుకురావాలని, వాటిని అమ్మవారి పాదాల కింద ఉంచి పూజ చేసిన అనంతరం ఆ బాలికకు ధరింపజేయాలని చెప్పాడు. అనంతరం బాలిక తండ్రిని అక్కడే ఉండమని చెప్పి ఆమెను పక్కనున్న భవనం రెండో అంతస్తులోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెబితే కుటుంబంలో అందరికీ కాళ్లు, చేతులు పడిపోయేలా చేస్తానని స్వామీజీ బెదిరించాడు. మరుసటి రోజు కూడా స్వామీజీ వారికి ఫోన్ చేసి ఆలయానికి రావాలని ఒత్తిడి చేయడంతో ఫిబ్రవరి 21న రాత్రి ఆ బాలిక తండ్రితో కలిసి అక్కడకు వెళ్లింది. అయితే ఈ విషయాన్ని ముందుగానే తన ప్రియుడు షఫీకి తెలియజేసింది. దీంతో షఫీ, నెల్లూరుకు చెందిన తన స్నేహితులు షామీర్, సంతోశ్‌తో అక్కడికి చేరుకుని ఆమెను అక్కడినుంచి కారులో తీసుకెళ్లిపోయారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫిబ్రవరి 29న ఆమె మంచిర్యాలలో ఉన్నట్లు గుర్తించి తీసుకొచ్చారు. వైద్య పరీక్షల ఆధారంగా లైంగిక దాడికి గురైనట్లు గుర్తించారు. విచారణలో బాలిక కూడా తనపై మూర్తిస్వామి అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపింది. ఈ నేపథ్యంలో షఫీ, మూర్తిస్వామిపై అత్యాచారం, పోక్సో కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

'వందే భారత్'లు నేడు ప్రారంభం

విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మీదుగా మరో మూడు వందే భారత్ సెమీ హైస్పీడ్ రైళ్లను మంగళవారం ప్రధాని మోదీ ప్రారంభిస్తున్నారు. ప్రస్తుతం విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య 16 కోచ్‌లతో ఒక వందేభారత్ నడుస్తోంది. ఇది వంద శాతం ఆక్యుపెన్సీతో నడవడంతో ఇదే మార్గంలో మరో వందే భారత్‌ను ప్రారంభిస్తున్నారు. ఇందులో ఆరు కోచ్‌లు మాత్రమే ఉంటాయి. కల్బుర్గి-బెంగళూరు మధ్య మరొకటి నడపనున్నారు. ఈ రైలు రాయ్‌చూర్, మంత్రాలయం రోడ్డు, గుంతకల్, అనంతపూర్ స్టేషన్లలో ఆగుతుంది. విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య మరో వందే భారత్ నడపనున్నారు. ఇందులో ఆరు కోచ్‌లు, 530 సీట్లు ఉంటాయి. కాగా, మోదీ ప్రారంభించే రైళ్లలో తిరుపతి-కొల్లాంల మధ్య నడిచే మెయిల్ ఎక్స్‌ప్రెస్ కూడా ఉంది. కాగా, దేశవ్యాప్తంగా రూ.85వేల కోట్లతో చేపట్టిన వివిధ రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని మోదీ మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపనలు, జాతికి అంకితం చేయనున్నారని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు.

ఇదేం దౌర్భాగ్యం గోవిందా..!

- తిరుమలలో మద్యం గ్లాసులు, ఎముకలు...
- 'సిద్ధం' సభకు వెళ్లొచ్చిన ఆర్టీసీ బస్సుల్లో ప్రత్యక్షం
- నిర్ఘాంతపోయిన వెంకన్న భక్తులు

తిరుమల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల క్షేత్రానికి తాగేసిన మద్యం గ్లాసులు, మద్యం సీసాల మూతలు, తిని పడేసిన మాంసం ఎముకలు, బిర్యానీ బాక్సులు, హాన్స్, గుట్కా ప్యాకెట్లు, బీడీలు, సిగరెట్లు, వైసీపీ కండువాలు, టోపీలు, నేతల ఫొటోలతో కూడిన వాటర్‌బాటిళ్లతో ఉన్న ఆర్టీసీ బస్సులు చేరుకోవడం కలకలం రేపింది. బాపట్ల జిల్లా మేదరమెట్లలో వైసీపీ ఆదివారం నిర్వహించిన 'సిద్ధం' సభకు ఆ పార్టీ కార్యకర్తలను తరలించడానికి ఈ బస్సులను వినియోగించారు. సోమవారం తిరుమలకు తీసుకొచ్చిన ఆ బస్సులను చూసి పలువురు భక్తులు నిర్ఘాంతపోయారు. సిద్ధం సభకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఆర్టీసీ బస్సులతో పాటు తిరుమల-తిరుపతి మధ్య నడిచే 40 బస్సులను కూడా కార్యకర్తలను తరలించేందుకు తీసుకున్నారు.



ఆర్టీసీ బస్సుల్లో జగన్ 'సిద్ధం' తాలూకూ వైసీపీ టోపీలు, తిని పడేసిన మాంసం ఎముకలు, బిర్యానీ బాక్సు, సిగరెట్ పీక

సిద్ధం సభకు వెళ్లి వచ్చిన బస్సులను కనీసం శుభ్రపరచకుండా తిరుమలకు తీసుకువచ్చారు. 'సిద్ధం' స్టిక్కర్లను కూడా తొలగించలేదు. తిరుమలకు వచ్చిన తర్వాత బస్సుల్లో పడి ఉన్న మాంసం ఎముకలను, మద్యం మూతలను, పొగాకు ఉత్పత్తులను ఆర్టీసీ సిబ్బందే తీసి రోడ్డుపై పడేశారు. వాటిని చూసిన భక్తులు ఏంటీ దుస్థితి అంటూ వాపోయారు. వాస్తవానికి తిరుమల కొండపైకి తిప్పే ఆర్టీసీ బస్సుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు. దూరం ఎక్కువగా ఉండే మార్గాల్లో వాటిని తిప్పరు. ప్రతి రోజూ కొండపైకి అనుమతించేముందు అధికారులు ప్రతి బస్సునూ క్షుణ్ణంగా పరిశీలిస్తారు.కానీ, సోమవారం చూస్తే, జగన్ సిద్ధం సభకు వెళ్లివచ్చిన బస్సులను ఏమాత్రం తనిఖీ చేయకుండానే అధికారులు అనుమతించినట్టు కనిపిస్తోంది. ఇదెలా జరిగిందని పలువురు భక్తులు విస్తుపోతున్నారు.

జగన్‌ను చూస్తే జాలేస్తోంది!

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాల్లో నిర్వహించిన సభల్లో ఆయన ప్రసంగించారు. 'సిద్ధం' సభలకు జనం రాకపోయినా వచ్చినట్లు చూపించేందుకు గ్రీన్ మ్యాట్లు వేశారని, ఇదంతా గ్రాఫిక్ గిమ్మిక్కులో భాగమేనని తెలిపారు. 'సభలో అరగంట అంబటి, బెట్టింగ్ స్టార్ అనిల్ నన్ను బండబూతులు తిట్టారు. వాళ్లకు ఈ వేదిక ద్వారా ఒకటే అడుగుతున్నా.. సింహం, పులి అని చెప్పుకొనే మీ నాయకుడు ఎందుకయ్యా డ్రోన్‌ను చూసి పిల్లి లాగా భయపడ్డాడు..? అదిగో చూడండి.. డ్రోన్ ద్వారా ఖాళీ కుర్చీలు తీస్తున్నారంటూ జనం రాలేదని వాళ్లే అంగీకరించారు. ఇలాగుంది జగన్ పిల్లి పరిస్థితి' అని ఎద్దేవాచేశారు. ఈ సీఎంకు ప్రచార పిచ్చి పట్టిందని, ఎక్కడ చూసినా ఆయన పోస్టర్లేనని అన్నారు. చివరకు మరుగుదొడ్ల గోడలపైనా జగన్ సిక్కర్లే కనిపిస్తున్నాయని చెప్పారు. గ్రూప్-2 పరీక్ష పేపర్‌లో జగన్ గురించి డబ్బా కొట్టుకోవడం చూస్తుంటే బిల్డప్ బాబాయ్ గుర్తుకొస్తున్నాడని అన్నారు. ఆ పరీక్షలో ఆడుదాం ఆంధ్రా, జీవక్రాంతి, చేదోడు గురించి కాదు ప్రశ్నలు అడగాల్సింది, బాబాయిని లేపేసింది ఎవరు..? వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని రద్దు చేయని సీఎం ఎవరు...? 30 లక్షల ఇళ్లు కట్టి మహిళల పేరుతో రిజిస్ట్రేషన్ చేయిస్తానని మాటిచ్చి తప్పిన సీఎం ఎవరు.. అనే ప్రశ్నలు వేసి ఉంటే 5 లక్షల మంది పిల్లలు సరైన సమాధానం చెప్పేవారని తెలిపారు. ప్రిజనరీ జగన్.. విజినరీ చంద్రబాబుకు మధ్య తేడా గుర్తించాలని ప్రజలను కోరారు. సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని, అదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని అన్నారు. 'సైకో పోవాలి... సైకిల్ రావాలి..' నినాదంతో సమష్టిగా ముందుకు కదలాలని పిలుపిచ్చారు. ఇంకా ఏమన్నారంటే..

ఏదీ హామీల అమలు?

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకరం చేసిన ఆరు నెలలకు హామీలు అమలు చేస్తేనే ప్రజలపట్ల చిత్త శుద్ధి ఉన్నట్లు అని జగన్ గొప్పలు చెప్పాడు. చివరి ఆరు నెలల్లో చేస్తే మోసం అన్నాడు. అధికారంలోకి వచ్చి 58 నెలలు గడిచినా ఆయన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. 2.30 లక్షల పెండింగ్ పోస్టుల భర్తీ, ప్రతి ఏడాది 6500 కానిస్టేబుల్ పోస్టుల భర్తీపై ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? 45 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు పింఛన్ ఇస్తానని హామీ ఇచ్చాడు గదా..? ఇస్తున్నాడా? ఎన్నికల ముంగిట గ్రూప్-2 నోటిఫికేషన్ ఇచ్చారు. అందులోనూ కేవలం 897 పోస్టులే చూపించారు. రెండు నెలలు ఓపిక పట్టండి. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రాగానే ప్రతి ఏడాదీ డీఎస్సీ నిర్వహిస్తాం. పెండింగ్‌లో ఉన్న పోస్టులను భర్తీ చేసే బాధ్యత నేను తీసుకుంటా.



అనంతపురం జిల్లా తాడిపత్రిలో నిర్వహించిన శంఖారావం సభకు హాజరైన జనం

స్టాన్‌ఫోర్డ్‌లో జగన్‌పై కేస్ స్టడీ

జగన్ వైట్ కాలర్ నేరస్థుడు. నేను చదువుకున్న స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలోనూ జగన్ కేసులపై ఒక కేస్ స్టడీ ఉంది. జగన్ ఎక్కడకు వెళ్లినా ఏపీలో ఐపీఎల్ టీం పెడతానని చెబుతున్నాడు. ఆ టీంకు కోడి కత్తి వారియర్స్ టీమ్ అని పేరుపెడితే బాగుంటుంది.



శంఖారావం సభలో ప్రసంగిస్తూ రెడ్ బుక్‌ను చూపిస్తున్న లోకేశ్

మంత్రి బొత్స ఏం చెబుతారో ఆయనకే అర్థం కాదు. ఎక్కువ మంది చదువుకోవడం వల్లనే ఉద్యోగాలు రావడం లేదంట. మరి నీకు మంత్రి పదవి ఎందుకు..? తప్పుకొని ఇంటికి వెళ్లు.. ఐదేళ్ల పాలనలో ఏ నాడూ మైనారిటీలపై దాడులు జరుగలేదు. జగన్ మాయ మాటలను మైనారిటీలు నమ్మొద్దు.

ఉమ్మడి అనంతలో ముగిసిన శంఖారావం

లోకేశ్ చేపట్టిన శంఖారావం మలివిడత సభలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోమవారంతో ముగిశాయి. హిందూపురం నుంచి ప్రారంభమైన శంఖారావం.. మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, ఉరవకొండ, రాయదుర్గం, కల్యాణదుర్గం, అనంతపురం అర్బన్, తాడిపత్రి నియోజకవర్గాల్లో సాగింది.

చరిత్ర ఉన్నంత వరకూ తాను ఉంటానని జగన్ చెబుతున్నాడు. చరిత్రలో మాటేమో గాని.. క్రిమినల్ రికార్డులు ఉన్నంతవరకు ఈ సైకో పేరు ఉండడం ఖాయం. చంచల్‌గూడ జైలు గోడలపై ఈయన పేరు ఉంటుంది.

టీడీపీ, జనసేన కార్యకర్తలు కలిసికట్టుగా పోరాడాలి. జనసేన పేరుతో పసుపు సైన్యాన్ని తిడుతూ.. పసుపు సైనికుల పేరుతో జనసేన సైన్యాన్ని తిడుతూ పేటీఎం బ్యాచ్ పోస్టులు పెడుతోంది. కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. - లోకేశ్

సొంతూరుకూ 'సీఎం' సెగ

(మొదటి పేజీ తరువాయి)

కళాశాల, గవర్నమెంట్ ఆస్పత్రి భవనాలను జగన్ ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బనానా ఇంటిగ్రేటెడ్ హౌస్‌ను ప్రారంభించారు. మెయిన్‌రోడ్డులోని వైఎస్సార్ మినీ సెక్రటరీ కాంప్లెక్స్, ఉలిమెల లేక్ ఫ్రంట్ ,ఆదిత్య బిర్లా యూనిట్, బోలేవార్డును ఆయన ప్రారంభించారు. అయితే, ప్రారంభోత్సవాలన్నీ మెయిన్ రోడ్డు, కడప రోడ్డు, నల్లపురెడ్డిపల్లె రహదారిలో ఉండడంతో సీఎం రాక ముందు 10.30 నుంచే బారికేడ్లు వేశారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో దుకాణాలు బంద్ చేయించారు. జనాలు రోడ్డుమీదకు రాకుండా అడ్డుకున్నారు. మధ్యాహ్నం పూట స్కూలు వదిలిన తరువాత భోజనానికి వచ్చే విద్యార్థులు, పరీక్షలు రాసే ఇంటర్ విద్యార్థులు ఇంటికి వెళ్లలేక తీవ్ర అవస్థలు పడ్డారు. ఆఫీసులు, ఇతర పనుల కోసం బయటికి వచ్చేవారంతా టౌన్‌లోకి రాలేక నరకం అనుభవించారు. ఎటుచూసినా రోడ్లన్నీ బారికేడ్లతో నింపేశారు. సుమారు 1420 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ప్రధాన రోడ్లు పూల అంగళ్లు, ఇతర రహదారులు బంద్‌ను తలపించే విధంగా నిర్మానుష్యంగా మారిపోయాయి. కొందరు అర్జీలు ఇస్తామన్నా కూడా అవకాశం ఇవ్వలేదు. పులివెందుల పట్టణమంతా జనం లేకుండానే జగన్ పర్యటన సాగింది. అడుగడుగునా ఆంక్షలతో దిగ్బంధనం చేయడంతో జనం కూడా జగన్ పర్యటనపై ఆసక్తి చూపలేదని అంటున్నారు.

జగన్ సర్కారు అప్పుల వేట

- రూ.10వేల కోట్ల కోసం ఢిల్లీలో చక్కర్లు...స్పందించని కేంద్రం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అప్పుల వేట కొనసాగిస్తూనే ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నాలుగు విడతలుగా కేంద్ర ప్రభుత్వం జగన్ సర్కార్‌కి రూ.69,000 కోట్ల అప్పులకు అనుమతిచ్చింది. వీటిని జగన్ ప్రభుత్వం జనవరి చివరి నాటికే పూర్తిగా వాడేసింది. ఫిబ్రవరి, మార్చి నెలల కోసం మళ్లీ కొత్త అప్పులకు అనుమతివ్వాలంటూ రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు కాళ్లరిగేలా తిరుగుతున్నా కేంద్రం ఒప్పుకోవడం లేదు. కొత్తగా రూ.10,000 కోట్లు అప్పు కావాలని అధికారులు గత నెల నుంచి కేంద్రం చుట్టూ తిరుగుతున్నారు. కేంద్రం స్పందించకపోవడంతో రాష్ట్రంలో గనుల శాఖను తాకట్టు పెట్టి మార్చి 1వ తేదీన రూ.7,000 కోట్ల అప్పు తెచ్చారు. ఇది స్టాక్ మార్కెట్ ద్వారా తెచ్చిన అప్పు కావడంతో సమాచారం బయటకు వచ్చింది. కానీ, రాష్ట్రంలోని కార్పొరేషన్ల ఆస్తులను బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు తాకట్టు పెట్టి తెచ్చిన అప్పుల వివరాలు బయటికి రావడం లేదు. ఆస్తుల్లేని కార్పొరేషన్లకు ప్రభుత్వమే ఖజానా నుంచి ఆదాయం మళ్లించినట్టుగా చూపించి మరీ అప్పులు తెస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా 20 రోజుల సమయం ఉంది. ఈ లోగా కేంద్రం నుంచి కొత్త అప్పులకు అనుమతి రాకపోవచ్చని, మంగళవారం అప్పులు ఈ 20 రోజుల్లో ఉండకపోవచ్చనేది అంచనా. కేంద్రం ఇచ్చిన ఈ రూ.69,000 కోట్లు అప్పులు కాకుండా, వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం తెచ్చిన అప్పులు రూ.32,000 కోట్లకు చేరాయి. వీటితో పాటు పబ్లిక్ అకౌంట్ నెట్ నుంచి వాడినవి రూ.15,000 కోట్లు,నాబార్డు, కేంద్ర ప్రభుత్వం, ఈఏపీ, ఇతరమార్గాల్లో తెచ్చిన అప్పులు దాదాపు రూ.6,000 కోట్ల వరకు ఉంటాయని అంచనా. తాజాగా సీఆర్డీఏ బాండ్ల ద్వారా తెచ్చుకున్న రూ.2,000 కోట్ల అప్పును కూడా ప్రభుత్వం తన ఖాతాలో కలిపేసుకుంది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు జగన్ సర్కార్ తెచ్చిన మొత్తం అప్పులు రూ.1,24,000 కోట్లకు చేరుకున్నాయి.

ఒకే క్షిపణి.. వేర్వేరు లక్ష్యాల ఛేదన

- భారత్ అమ్ముల పొదిలో ఎంఐఆర్వీ టెక్నాలజీ

న్యూఢిల్లీ, మార్చి 11: 'మిషన్ దివ్యాస్త్ర'లో భారత్ కీలక మైలురాయిని చేరుకుంది. ఎంఐఆర్వీ సాంకేతికతతో.. 5 వేల నుంచి 5,800 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే అగ్ని-5 క్షిపణి ప్రయోగం విజయవంతమవ్వడం యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ఎంఐఆర్వీ టెక్నాలజీ అంటే.. ఏకకాలంలో ఒకే క్షిపణి సాయంతో వేర్వేరు లక్ష్యాలను ఛేదించేలా బహుళ రీ-ఎంట్రీ వాహనాలను(వార్‌హెడ్‌లు) ప్రయోగించడం. ఇప్పటి వరకు ఎంఐఆర్వీ టెక్నాలజీ కలిగి ఉన్న దేశాల జాబితాలో అమెరికా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్, చైనా, పాకిస్థాన్ ఉన్నాయి. అగ్ని-5తో పరీక్షించిన ఎంఐఆర్వీ విజయవంతం అవ్వడంతో.. ఇప్పుడు వాటి సరసన భారత్ చేరింది. పాకిస్థాన్ 2017లో 2,200 కిమీ దూరంలోని లక్ష్యాలను ఛేదించేలా 'అబాబీల్' మీడియం రేంజ్ బాలిస్టిక్ క్షిపణిని ఈ టెక్నాలజీతో పరీక్షించింది. ఇంటర్మీడియట్ రేంజ్ క్షిపణి అయిన అగ్ని-5 ద్వారా భారత్ ఈ టెక్నాలజీని విజయవంతంగా పరీక్షించింది. 5 వేల నుంచి 5,800 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను అగ్ని-5 ఛేదించగలదు.



శత్రువుకు చిక్కదు.. దొరకదు..!

సాధారణంగా క్షిపణులను ఇంటర్‌సెప్ట్ చేసి, వాటిని గాల్లోనే ధ్వంసం చేసే సాంకేతికత చాలా దేశాలకు అందుబాటులో ఉంది. ఇటీవల హమాస్ దాడుల తర్వాత.. ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ వ్యవస్థ పతాక శీర్షికలకెక్కింది. అయితే.. ఎంఐఆర్వీ సాంకేతికతలో అలా ఇంటర్‌సెప్ట్ చేయడం దాదాపు అసాధ్యమే..! బాలిస్టిక్ క్షిపణులు లక్ష్యాన్ని చేరేముందు భూ వాతావరణాన్ని దాటి పైకి వెళ్తాయి. అవి లక్ష్యాన్ని చేరడానికి తిరిగి భూ వాతావరణంలోకి రావడాన్ని రీ-ఎంట్రీ అంటారు. భారత్ అభివృద్ధి చేసిన ఎంఐఆర్వీలో.. క్షిపణి ప్రయోగం జరిగాక.. టార్గెట్లను నిర్దేశించిన వార్‌హెడ్‌లు భూవాతావరణంలోకి ఒక్కసారి రీ-ఎంట్రీ అయితే.. వాటిని నిరోధించడం శత్రుదేశాలకు సాధ్యమయ్యే పనికాదని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే.. భారత ఎంఐఆర్వీలో అన్ని వార్‌హెడ్లకు గైడెడ్, కంట్రోలింగ్, ప్రత్యేక ప్రోగ్రామింగ్ వ్యవస్థలున్నాయి. శత్రుదేశాల రాడార్లు వార్‌హెడ్లను గుర్తించి, దూసుకువస్తుంటే.. ప్రోగ్రామింగ్ వ్యవస్థలు వాటిని నిరోధిస్తాయి. "మన ఎంఐఆర్వీలకు కచ్చితత్వంతో దూసుకుపోయేలా సెన్సర్లున్నాయి. వార్‌హెడ్లు ఒక్కసారి రీ-ఎంట్రీ అయితే.. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదిస్తాయి. చైనా ఉత్తరభాగంతోపాటు.. ఐరోపాలోని కొన్ని ప్రాంతాలు, ఆసియా మొత్తం అగ్ని-5 క్షిపణి పరిధిలో ఉంటుంది" అని డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. "ఈ వార్‌హెడ్‌లు ఏకకాలంలో వేర్వేరు లక్ష్యాలను ఛేదిస్తాయి. ఇందుకోసం అగ్ని-5లో బహుళ వార్‌హెడ్‌లను అమర్చేందుకు వీలుంటుంది. న్యూక్లియర్ వార్‌హెడ్లను కూడా ఎంఐఆర్వీలో తరలించవచ్చు. మొదటగా అణ్వాయుధాలను వాడకూడదనే నిబంధనకు భారత్ కట్టుబడి ఉంది. కానీ, భారత్ ఒక్కసారి ఎంఐఆర్వీతో ఎదురుదాడి చేస్తే శత్రుదేశాలకు కోలుకోని దెబ్బ తప్పదు" అని డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్, నీతి ఆయోగ్ శాస్త్ర సాంకేతిక విభాగం సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్ వెల్లడించారు.

వరుసగా క్షిపణుల ప్రయోగాలు?

భారత్ మరికొన్ని క్షిపణులను కూడా ప్రయోగించనున్నట్లు స్పష్టమవుతోంది. ఈ కారణంగానే బంగాళాఖాతం తీర ప్రాంతాల్లో నో ఫ్లైజోన్‌ను ప్రకటించింది. నోటీస్ టు ఎయిర్‌మెన్(నోటమ్) ప్రకటన చేసింది. ఒక ప్రాంతాన్ని నోటమ్‌గా ప్రకటిస్తే.. ఏక్షణంలోనైనా క్షిపణి ప్రయోగాలు జరపవచ్చని దాని అర్థం. జలాంతర్గాముల ద్వారా ప్రయోగించడానికి రూపొందించిన అణ్వాయుధ సామర్థ్యం కలిగిన క్షిపణి కే-4ను పరీక్షించాలని భారత్ యోచిస్తోంది. ఈ క్షిపణి 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. బంగాళాఖాతం పరిధిలో తాజాగా జారీచేసిన నోటమ్ ఈ నెల 16 దాకా కొనసాగనుంది. నోటమ్ ఫ్లైజోన్ కూడా బంగాళాఖాతానికి దక్షిణాన 3,500 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. కే-4 క్షిపణి పరిధి కూడా 3,500 కిలోమీటర్లు.

క్షుణ్ణంగా పరిశీలిస్తున్న డ్రాగన్?

హిందూ మహాసముద్ర ప్రాంతంపై చైనా కొంతకాలంగా నిఘా పెంచింది. గత నెలలో శ్రీలంక సముద్ర తీరంలో తన పరిశోధనా నౌక(జియాన్ యాంగ్‌హాంగ్-3)ను ఉంచిన డ్రాగన్.. తాజాగా బంగాళాఖాతంలోనూ పరిశోధన నౌక జియాన్ యాంగ్‌హాంగ్-01ను మోహరించింది. నోటమ్‌ను ప్రకటించగానే చైనా నౌక విశాఖ సముద్ర తీరానికి 260 నాటికల్ మైళ్ల(సుమారు 480 కిలోమీటర్లు) దూరంలో లంగరు వేయడం గమనార్హం..! ఈ నెల 6న మలక్కా జలసంధి మీదుగా ప్రవేశించిన ఆ నౌక.. 8వ తేదీన నికోబార్ ద్వీపం, భారత ద్వీపకల్పం మధ్య కనిపించింది. ఉపరితల ధ్వని సంకేతాలను గుర్తించే సెన్సర్లు ఆ నౌకలో ఉన్నాయని భారత్ భావిస్తోంది. అంటే.. జలాంతర్గాములకు సంబంధించిన ధ్వనిని కూడా ఈ నౌక గ్రహించగలదు. భారత నౌకాదళం కూడా ఆ నౌక కదలికలను నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపింది.

రాష్ట్రపతి, ప్రధాని ప్రశంస

అల్వాల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎంఐఆర్వీ సాంకేతికతను డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించడంపై రాష్ట్రపతి ముర్ము ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. "డీఆర్‌డీవో మరో ఘనత సాధించింది. 'మిషన్ దివ్యాస్త్ర' పేరుతో.. బహుళ లక్ష్యాలను ఛేదించగల ఎంఐఆర్వీని 'అగ్ని-5' క్షిపణిపై విజయవంతంగా పరీక్షించింది" అని మోదీ ఎక్స్‌లో ప్రశంసించారు. "ఈ ఘనత దేశ రక్షణతోపాటు.. వ్యూహాత్మక సామర్థ్యాలను పెంపొందించడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. డీఆర్‌డీవో శాస్త్రవేత్తలకు నా అభినందనలు" అని రాష్ట్రపతి ఓ ప్రకటనలో తెలిపారు.

వివాహిత దుర్మరణంపై రాజకీయ దుమారం!

- నాలుగు రోజుల కిందట రైలు ఢీ
- మరణం తర్వాత మొదలైన వివాదం
- ట్రోలింగ్ కారణమన్న వైసీపీ సోషల్ మీడియా
- ఖండించిన తెలుగుదేశం పార్టీ

తెనాలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఒక వివాహిత దుర్మరణం రాజకీయ దుమారం లేపింది. టీడీపీ మద్దతుదారుల ట్రోలింగ్ వల్లే ఆమె ఆత్మహత్య చేసుకుందని వైసీపీ సోషల్ మీడియా ఆరోపించగా... ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ పేర్కొంది. వివరాల్లోకి వెళితే... గుంటూరు జిల్లా తెనాలికి చెందిన జి.గీతాంజలి (32) అనే వివాహిత ఈ నెల 7న తెనాలిలో రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అప్పటినుంచి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీతాంజలి సోమవారం తెల్లవారుజామున మరణించారు. ఆ తర్వాతే అసలు వివాదం మొదలైంది.

అసలేం జరిగిందంటే...

ఈనెల 4వ తేదీన గీతాంజలి తెనాలిలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇంటి పట్టా అందుకున్నారు. అదే సమయంలో ఒక స్థానిక ప్రైవేట్ చానల్ ఆమెను ఇంటర్వ్యూ చేసింది. ఇంటిపట్టా అందుకున్న గీతాంజలి...తన సొంత ఇంటి కల నెరవేరిందని ఆనందంగా తెలిపారు. ఐదేళ్లు 'అమ్మఒడి' అందుకున్నానని, ఒక సంవత్సరం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశానని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే తమ కుటుంబానికి సన్నిహితుడని, తమ ఇంట్లో జరిగిన వేడుకలకూ హాజరయ్యారని తెలిపారు. చంద్రబాబు, లోకేశ్, పవన్, షర్మిల తదితరులకు సంబంధించిన ప్రశ్నలకు స్పందిస్తూ... జగన్‌కే తన మద్దతు అని చెప్పారు. దీనిని వైసీపీ సోషల్ మీడియా తన ప్రచారం కోసం వాడుకుంది. దీనిపై కొందరు స్పందిస్తూ.. 'అమ్మ ఒడి ఇచ్చిందే నాలుగేళ్లయితే, ఐదేళ్లు ఎలా తీసుకున్నారు? జగనన్నా.. ఏమిటిది?' వంటి కామెంట్లు పెట్టారు. దీనివల్లే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు వైసీపీ సోషల్ మీడియా ప్రచారం మొదలుపెట్టింది.

తప్పుడు ప్రచారం నమ్మొద్దు: టీడీపీ

వైసీపీ పేటీఎం బ్యాచ్ ఫేక్ ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ కోరింది. జగన్ 'సిద్ధం' సభ అట్టర్ ఫ్లాప్ కావడంతో, జనం దృష్టిని మరల్చడానికి ఫేక్ ప్రచారానికి దిగిందని టీడీపీ మండిపడింది. గీతాంజలి మరణానికి టీడీపీ కారణమంటూ నారా లోకేశ్ పేరు మీద 'ఎక్స్'లో ఫేక్ పోస్టులు సృష్టించి దుష్ప్రచారం చేసిందని... వీటిని నమ్మవద్దని ప్రజలను కోరింది. సోషల్ మీడియాలో గీతాంజలినిసేరుగా నిందించడం, పరుషపదజాలంతో దూషించడం జరగలేదని తెలిపింది. దీనిపై జనసేన పీఏసీ చైర్మన్ మనోహర్ కూడా స్పందించారు. గీతాంజలి మరణం బాధాకరమని తెలిపారు. ఆమె మరణాన్ని తాము రాజకీయంగా ఉపయోగించుకోవడానికి ఆమె కుటుంబ సభ్యులు ఇష్టపడటం లేదని చెప్పారు.

వణికిస్తున్న మంప్స్..!

వ్యాక్సిన్ వేసినా.. ఆగని గవద బిళ్లలు



- చిన్నారుల్లో ఇటీవల పెరుగుతున్న కేసులు
- బూస్టర్ డోస్‌తోనే అడ్డుకట్ట సాధ్యమంటున్న వైద్యులు

గుంటూరు (మెడికల్), మార్చి 11: ఇటీవల గుంటూరులోని ప్రతిమనగర్‌కు చెందిన ఏడేళ్ల శైలేశ్‌కు ఉన్నట్టుండి రెండు చెంపల దగ్గర వాపు ఏర్పడింది. గొంతు నొప్పి, జ్వరం, తలనొప్పి, నీరసం వంటి లక్షణాలు కూడా చుట్టుముట్టాయి. ఆస్పత్రికి తీసుకెళ్తే గవద బిళ్లల వ్యాధిగా (మంప్స్) వైద్యులు నిర్ధారించారు. యాంటీ బయోటిక్, నొప్పి నివారణ మాత్రలతో చికిత్స ప్రారంభించారు. శైలేశ్ వయసున్న పిల్లలు గుంటూరులో పెద్ద సంఖ్యలో మంప్స్ బారిన పడుతున్నారు. కొంతకాలంగా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి పిల్లల వైద్య విభాగం ఓపీకి ప్రతి రోజూ మంప్స్ బాధితులు వస్తున్నారు. ఒక్క గుంటూరులోనే కాదు,రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో బాధిత పిల్లలు కనిపిస్తున్నట్టు వైద్యవర్గాలు చెబుతున్నాయి.

వ్యాక్సిన్ ఇచ్చినా కూడా...

వ్యాక్సిన్ ద్వారా సులువుగా కట్టడి చేసే వాటిలో గవద బిళ్లల వ్యాధి ఒకటి. సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం కింద గవద బిళ్లల నివారణకు చిన్నారులందరికీ ఎంఎంఆర్ టీకాలు వేస్తున్నారు. బిడ్డ పుట్టిన 9వ నెలలో, 15వ నెలలో రెండు విడతలుగా మంప్స్ నిరోధక వ్యాక్సిన్ వేస్తున్నారు. అనంతరం 4-5 సంవత్సరాల మధ్య బూస్టర్ డోసు కూడా ఇస్తున్నారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం పకడ్బందీగా జరుగుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో వందల సంఖ్యలో ఈ కేసులు వెలుగుచూడటం ఆందోళన కలిగిస్తోంది. ఈ వ్యాక్సిన్‌ను మూడు డోసులకు బదులు కొందరు పిల్లలు ఒక్కడోసే తీసుకున్నారని, దీనివల్ల వ్యాధి నుంచి పూర్తి రక్షణ లభించదని డాక్టర్లు చెబుతున్నారు. కొవిడ్-19 విజృంభించిన 2020, 2021 సంవత్సరాల్లో చాలా మంది పిల్లలకు మంప్స్ వ్యాక్సినేషన్ జరగలేదు. దీని ఫలితం ప్రస్తుతం కేసుల రూపంలో కనిపిస్తోందని వైద్య వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

వేగంగా సంక్రమించే అంటువ్యాధి...

గవద బిళ్లలు వేగంగా సంక్రమించే అంటువ్యాధి. సాధారణంగా 5 నుంచి 12 ఏళ్ల వయస్సు గల పిల్లలకు సోకుతుంది. పారామిక్సో వైరస్ దీనికి కారణం. బాధితుల్లో గవదల వాపు, 103 డిగ్రీల జ్వరం, కడుపు నొప్పి, తలనొప్పి, అలసట, గొంతు మింగుడు పడకపోవడం, వృషణాల వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది వైరల్ వ్యాధి కావడంతో ప్రత్యేకంగా చికిత్స లేదు. వ్యాధి లక్షణాలను బట్టి సపోర్టివ్ థెరపీ ఇస్తారు. బాధిత చిన్నారుల్లో ఐదు నుంచి పది రోజుల్లోగా వ్యాధి లక్షణాలు తగ్గిపోతాయి. ఈ వైరస్ వృషణాలకు సోకితే మగవారిలో వంధ్యత్వం వస్తుంది. చెవులకు సోకితే వినికిడి శక్తి తగ్గిపోతుంది. అరుదుగా ఇది మెదడుకు పాకి వైరల్ మెనింజైటిస్ అనే ప్రాణాంతక జబ్బుగా మారుతుంది.

వ్యాధి కట్టడికి చర్యలు చేపడతాం..

రాష్ట్రవ్యాప్తంగా గవద బిళ్లల కేసులు వెలుగుచూస్తున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖ స్పందించి స్పెషల్ డ్రైవ్ చేపట్టి అర్హులైన చిన్నారులందరికీ మరోసారి వ్యాక్సినేషన్ చేయాలని సూచించినట్టు వైద్య వర్గాల నుంచి వినవస్తుంది. గుంటూరు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు మాట్లాడుతూ.. మంప్స్ కేసులు నమోదవడం గుర్తించామని, పిల్లలందరికీ మంప్స్ నిరోధక టీకాలు ఇచ్చినప్పటికీ కేసులు ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదని అన్నారు. వ్యాధి కట్టడికి తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై వైసీపీ దాడి

- ఆమె భర్త, కుమారుడిపైనా.. ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తనూ కొట్టారు
- కాశీబుగ్గ పోలీసుల ఎదుటే ఘటన!





పోలీసుస్టేషన్ వద్ద ఘర్షణ వాతావరణం; గాయపడిన అప్పలనర్సమ్మ

పలాస/రూరల్, మార్చి 11: మంత్రి అప్పలరాజు సమక్షంలోనే వైసీపీ నాయకులు ఓ అంగన్‌వాడీ కార్యకర్త, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో సోమవారం ఈ ఘటన జరిగింది. బంటుకొత్తూరుకి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త రాగోలు అప్పలనర్సమ్మను ఐదేళ్లుగా స్థానిక వైసీపీ నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారు. ఆమె భర్త నీలకంఠ టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి కావడమే ఇందుకు కారణం. ఈ క్రమంలో సోమవారం మంత్రి సీదిరి అప్పలరాజు సచివాలయ భవనాన్ని ప్రారంభించగా.. ఈ కార్యక్రమానికి అప్పలనర్సమ్మ కూడా హాజరయ్యారు. అక్కడ అప్పలనర్సమ్మపై వైసీపీ నాయకులు దాడి చేసి.. అమర్యాదగా ప్రవర్తించారు. నిలదీసిన అప్పలనర్సమ్మ భర్త నీలకంఠ, కుమారుడు సాయికిరణ్‌ను కూడా కొట్టారు. దీంతో వారంతా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబమే తమపై దాడి చేసిందంటూ బంటుకొత్తూరు సర్పంచ్ పిట్ట షణ్ముఖరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇరువర్గాలూ స్టేషన్‌కు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకుంది.

కానిస్టేబుల్ చెంప చెళ్లుమనిపించిన వైసీపీ యువనేత!

గుంటూరు, మార్చి 11: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పోలీసులు ఓ యాక్సిడెంట్ కేసు విషయంలో ఆదివారం రాత్రి కొందరిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న వైసీపీ నేత కుమారుడు తన అనుచరులతో స్టేషన్‌కు వచ్చారు. సెంట్రీ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ వారిని అడ్డుకుని.. ఒకరిద్దరే లోపలికి వెళ్లాలని చెప్పారు. దీంతో ఆగ్రహించిన ఆ యువనేత కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం బయటకు రాకుండా పోలీసు అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి కృషి

● రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల కమిషనర్ రాజేశ్వరరెడ్డి

ఆటోనగర్ (పెనమలూరు), మార్చి 11: రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు కృషి చేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల కమిషనర్ సీ రా జేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆటోనగర్ ఏటీఏ హాలులో జరిగిన వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని ప్రభుత్వం ఎంఎస్ఎంఈల అభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. ర్యాంప్ పథకం కింద ఏపీవన్, ఫార్మలైజేషన్ స్కీంల గురించి వివరించారు. ఎంఎస్ఎంఈలో ఎస్సీ, ఎస్టీ మహిళా వర్గాలకు గరిష్ట సబ్సిడీలు కేటాయిస్తున్నట్టు తెలిపా రు. అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డీ చంద్రశేఖర్, ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాయన వెంకట్రావు, ఏటీఏ అధ్యక్షుడు రాజనాల బాబ్జీ, ఫ్యాప్సియా ప్రెసిడెంట్ వీ మురళీకృష్ణ, ఎన్ఐసీ డీజీఎం ఎంవీ సోమశేఖర్, జిల్లా పరిశ్రమల జీఎం జే సుధాకర్ అధికారి బంగారుబాబు, కో-ఆర్డినేటరు డాక్టర్ కేఎల్ఎస్ రెడ్డి, ఏడీలు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు, ఉపకరణాలు: కలెక్టర్

కృష్ణలంక, మార్చి 11: రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహకార సంస్థ సమకూర్చిన రూ.3,05,500 విలువైన ల్యాప్‌టాప్‌లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలను అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో కలెక్టర్ ఒక్కోటి రూ.35 వేలు విలువైన 8 ల్యాప్‌టాప్‌లను విద్యార్థులకు అందజేశారు. లాగే ఒక్కోటి రూ.5,500 విలువైన 4 ట్రై సైకిళ్లను, రూ.3,500 విలువైన వినికిడి యంత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లోను ఎదిగేందుకు ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడులు వాడ్రేవు కామరాజు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు అత్యాధునిక అంబులెన్స్‌లు

ప్రభుత్వాసుపత్రి: నగరంలోని ప్రభుత్వాసుపత్రికి రెండు అత్యాధునిక లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు అందుబాటులోకి రావడంతో రోగుల ప్రాణాలను రక్షించేందుకు అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించేందుకు వీలవుతుందని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో రూ.55 లక్షల వ్యయంతో జీజీహెచ్‌కు అందించిన ఈ అంబులెన్స్‌లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ నిధులు అడిగిన వెంటనే మంజూరు చేసిన ఎంపీ కేశినేని నానికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎంపీ కేశినేని నాని, దేవినేని అవినాష్ పాల్గొన్నారు.

కూటమితో వైసీపీకి ఓటమి : బొండా

పాయకాపురం, మార్చి 11: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని టీడీపీ పొలిట్ బ్యూ రో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటమిని ముందే తెలుసుకున్న సీఎం జగన్ తన సొంత చానల్స్‌లో గ్రాఫిక్స్‌ను ఉపయోగించి సిద్ధం సభల్లో లేని జనాన్ని ఉన్నట్టుగా చూపిస్తూ ప్రజలను నమ్మించాలని చూస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఘోర ఓటమికి వైసీపీ సిద్ధమైందన్నారు.

లంచాలు తీసుకుని ఇచ్చిన నియామకాలు రద్దు చేయాలి: సీపీఎం

గవర్నర్‌పేట, మార్చి 11: మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగాల పేరుతో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, అర్హత ఉన్న అభ్యర్థులకు కాకుండా లంచాలు బాగా ఇచ్చిన వారికి పోస్టులు అమ్ముకున్నారని సీపీఎం సీనియర్ నేత దోనేపూడి కాశీనాథ్ ఆరోపించారు. సోమవారం స్థానిక శ్రీ శ్రీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగాలు అమ్ముకోవడంలో రూ.4కోట్లు చేతులు మారాయని, ఇప్పటి వరకు పశ్చిమ ఎమ్మెల్యేగా ఉండి, ఇప్పుడు సెంట్రల్ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తి హస్తం పూర్తిగా ఉందని ఆరోపించారు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.2లక్షలు డిమాండ్ చేసి మరీ గుంజుకున్నారన్నారు. ప్రజాప్రతినిధికి చిత్తశుద్ధి ఉంటే కొత్తగా వచ్చిన దరఖాస్తుల నుంచి పారదర్శకతతో కూడిన నియామకాలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ స్కామ్‌లో కార్పొరేషన్ ఏసీ (ప్రాజెక్టు) హస్తం కూడా ఉందని, దిగువ స్థాయి ఉద్యోగులు మీడియేటర్లుగా మారి బేరాలు కుదిర్చారన్నారు. ఈ అంశాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

కాంగ్రెస్ విజయం చారిత్రక అవసరం

● మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు తాంతియా

గవర్నర్‌పేట, మార్చి 11: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం చారిత్రక అవసరమని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు లాం తాంతియా కుమారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే దేశంలో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రానున్న ఐదేళ్లల్లో 30 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలివ్వాలని ప్రణాళికను ఏర్పాటు చేసిందన్నారు.

జపాన్‌లో ఉద్యోగావకాశాలు

కృష్ణలంక, మార్చి 11: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), నావిస్ హెచ్ఆర్ (ఎన్ఏవీఐఎస్ హెచ్ఆర్) సంయుక్త ధ్వర్యంలో ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదువుకున్న వారికి జపాన్‌లో కేర్ వర్కర్స్ ఇన్ హాస్పిటల్స్/కేర్ హోం ఫెసిలిటీ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సాహవంతులైన అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ / హోమ్ / ఆన్‌లైన్ ప్రోగ్రాం రిజిస్ట్రేషన్ లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9988853335 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

15న షాపుల వేలంపాట

వన్‌టౌన్, మార్చి 11: దేవదాయశాఖ పరిధిలోని గులాబ్‌చంద్ వీధిలోని శ్రీ లక్ష్మీనారాయణ మందిరానికి చెందిన రెండు షాపులకు ఈ నెల 15న మందిరం వద్దే బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్టు కార్యనిర్వాహణాధికారి (ఈవో) మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఒక షాపునకు రూ.25వేలు, మరో షాపునకు రూ.5వేల ధరావత్తు చెల్లించాలని, కాలపరిమితి మూడేళ్లన్నారు. 13, 14న టెండర్ ఫారాలు ఈవో కార్యాలయం నుంచి కొనుగోలు చేయాలన్నారు. వివరాలకు 9440272577 నెంబర్‌ను సంప్రదించాలని ఈవో కోరారు.

సిద్ధార్థ ఫార్మశీ కళాశాలకు నాక్ గ్రేడ్ ఏ

మొగల్రాజపురం, మార్చి 11: స్థానిక కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాలకు నాక్ గ్రేడ్ ఏ గుర్తింపు లభించింది. నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ తరపున త్రిసభ్య కమిటీ కళాశాలలోని మౌలిక సదుపాయాలు, విద్యాప్రమాణాలు, పరిశోధన వంటి పలు అంశాలను పరిశీలించి ఈ గుర్తింపు ప్రకటించారు. ఇది ఐదేళ్లు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో జరిగిన సభలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్, అధ్యాపకులను, సిబ్బందిని అభినందించారు.

బ్లేడ్‌తో రౌడీషీటర్ దాడి, ఒకరికి గాయాలు

పాయకాపురం, మార్చి 11: అకారణంగా ఓ వ్యక్తిని రౌడీ షీటర్ బ్లేడ్‌తో దాడిచేసి గాయపరచిన ఘటన పాయకాపురం కండ్రిక కాలనీలో చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం నున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాలనీకి చెందిన కొత్తపల్లి రమేష్ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఆదివారం రాత్రి భోజనానంతరం ఆరు బయటకు వచ్చి బీడీ తాగుతున్నాడు. అదేవీధిలో నివాసముంటున్న రౌడీ షీటర్ షేక్ హుస్సేన్ అలియాస్ చోటు రమేష్ దగ్గరకు వచ్చి అగ్గిపెట్టె కావాలనడం, పైగా గంజాయి మత్తులో ఉండటంతో భయపడిన రమేష్ అతడికి స్వయంగా సిగిరెట్ వెలిగించబోయాడు. కానీ చోటు మాత్రం తన వద్ద ఉన్న బ్లేడ్‌తో రమేష్‌పై దాడి చేయడంతో రమేష్ పొట్టకు తీవ్రగాయమైంది. దీంతో బాధితుడు తప్పించుకుని ఆసుపత్రికి వెళ్లాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రౌడీషీటర్‌పై ఇప్పటికే అనేక కేసులున్నాయి.

నమ్మి.. నిండా మునిగాం!

▸ జగన్ సర్కార్ నిలువునా ముంచేసిందంటున్న సెర్ప్ ఉద్యోగులు

▸ వైసీపీ పెద్దలతో ఉద్యోగ సంఘ నేతలు కుమ్మక్కయ్యారని ఆగ్రహం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)


(ఫైల్ ఫొటో)

"మా ఉద్యోగ సంఘ నేతలే మమ్మల్ని ముంచేశారు. వైసీపీ నేతల అడుగులకు మడుగులొత్తుతూ ఉద్యోగుల ప్రయోజనాలను కాలరాశారు. టీడీపీ హయాంలో కేడర్ ఫిక్సేషన్ చేస్తామంటూ అప్పట్లో సెర్ప్(గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) సీఈవో పిలుపునిస్తే మాకు కేడర్ ఫిక్సేషన్ వద్దు క్రమబద్ధీకరణే కావాలంటూ పట్టుబట్టారు. జగన్ వచ్చిన తర్వాత క్రమబద్ధీకరణ సాధిస్తామని చెప్పారు. ఇప్పుడేమో క్రమబద్ధీకరణ సంగతి సరే సరి.. కనీసం కేడర్ ఫిక్సేషన్ చేయకుండా మొండిచేయి చూపారు" అంటూ సెర్ప్ ఉద్యోగులు మండిపడుతున్నారు. రాయలసీమకు చెందిన కొందరు ఉద్యోగ సంఘాల నేతలు వైసీపీ నేతలతో కుమ్మక్కై సుమారు 4 వేల మందికిపైగా ఉన్న సెర్ప్ సిబ్బందికి అన్యాయం చేశారని వాపోతున్నారు. క్రమబద్ధీకరణ చేస్తామని మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారని, రెండేళ్ల నుంచి ఒక్క సారి కూడా సంఘం సమావేశం కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో ఆఫర్..

దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలంటూ సెర్ప్ ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారు. గత ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుచేసి సెర్ప్ ఉద్యోగులకు రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టడం సాధ్యం కాదని తేల్చేసింది. అందుకే వారికి ఉపశమనం కలిగించేందుకు గతంలో ఎప్పుడూ లేని విధంగా మిగతా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఒక్కసారి 43 శాతం ఫిట్‌మెంట్ అమలు చేశారు. దీంతో సెర్ప్ ఉద్యోగులకు భారీగా జీతాలు పెరిగాయి. దీంతోపాటు కేడర్ ఫిక్సేషన్ చేస్తామంటూ అప్పట్లో సెర్ప్ సీఈవోగా ఉన్న కృష్ణమోహన్ ఉద్యోగ సంఘాల నేతలను పిలిచారు. అయితే కొంత మంది ఉద్యోగ సంఘాల నేతలు ఆయన చేసిన ఆఫర్‌ను కాలదన్నుకున్నారు. క్రమబద్ధీకరణ చేయాలని, లేకపోతే జగన్ సర్కార్ వచ్చిన తర్వాత రెగ్యులరైజేషన్ చేయించుకుంటామని తెగేసి చెప్పారు. దీంతో అప్పట్లో సెర్ప్ ఉద్యోగుల కేడర్ ఫిక్సేషన్ ఆగిపోయింది.

వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత....

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని 2019 ఎన్నికల ముందు జగన్ ప్రతి సమావేశంలోనూ హామీ ఇచ్చారు. సెర్ప్ ఉద్యోగ సంఘాల నేతలు ఆ హామీపై ఉద్యోగులను నమ్మించారు. తీరా జగన్ సీఎం అయిన తర్వాత కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియే ప్రహసనంగా మారింది. సెర్ప్ ఉద్యోగులు కాంట్రాక్టు ఉద్యోగుల కిందకు రారని జగన్ సర్కార్ తేల్చేసింది. దీంతో కనీసం కేడర్ ఫిక్సేషన్ చేయాలంటూ సెర్ప్ ఉద్యోగులు మొరపెట్టుకున్నారు. మరికొన్ని సమస్యలనూ ఏకరవు పెట్టారు. వాటిని ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. నెలనెలా జీతాలే సక్రమంగా ఇచ్చిన పరిస్థితులు లేకపోవడంతో విసిగిపోయిన సెర్ప్ ఉద్యోగుల జేఏసీ సెర్ప్ సీఈవోకు సమ్మె నోటీసు ఇచ్చింది. ప్రభుత్వం స్పందించకపోవడంతో సెర్ప్ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. వారి క్రమబద్ధీకరణ కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఒక్కసారి కూడా సమావేశం కాలేదని వాపోతున్నారు.

ఇవీ డిమాండ్లు..

సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించి అందులో పని చేస్తున్న ఉద్యోగులకు కేడర్ ఫిక్స్ చేస్తూ పేస్కేల్ అమలుచేసి క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. వారి సర్వీసు క్రమబద్ధీకరణకు ఆర్థికశాఖ ద్వారా సెర్ప్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలో శాంక్షన్ పోస్టులుగా ఇచ్చిన మెమోను జీవో రూపంలోకి తీసుకురావాలన్నారు. ప్రస్తుతం అమలవుతున్న ఈపీఎఫ్ సీలింగ్ విధానం తీసేసి మూలవేతనంపై 100 శాతం ఈపీఎఫ్‌ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌సీసీలకు 12వ సెర్ప్ ఈసీ సమావేశంలో తీర్మానం ప్రకారం హెచ్‌ఆర్ పాలసీని అమలు చేస్తూ... పేస్కేల్ వర్తింపచేయాలని, సపోర్టింగ్ స్టాఫ్, ఎల్2, ఎల్3తో పాటు అన్ని కేడర్లకు పదోన్నతి, ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. సెర్ప్ హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు వర్తింపచేస్తూ అర్హులైన ఉద్యోగులందరికీ పదోన్నతులు కల్పించాలని కోరారు. కారుణ్య నియామకాలు జరిపి మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని, సెర్ప్ సిబ్బంది పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులకు అమలుచేస్తున్న గ్రాట్యుటీ రూ.16 లక్షలు, హెచ్‌ఆర్‌ఏ జీవోను సెర్ప్ ఉద్యోగులకూ అమలు చేయాలనే డిమాండ్ చేస్తున్నారు.

సజ్జల మాటలు నమ్మి సమ్మె విరమణ..

23 ఏళ్లుగా సెర్ప్‌లో పనిచేస్తున్న ఈ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కీలక పథకాలన్నీ అమలు చేస్తున్నారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, నాడు-నేడు, సున్నా వడ్డీ, జగనన్న తోడు, జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణం, పేదలకు సుస్థిర జీవనోపాధుల పెంపుదల వంటి సంక్షేమ పథకాలు సెర్ప్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి జోక్యం చేసుకుని సెర్ప్ ఉద్యోగుల డిమాండ్లను అన్నీ పరిష్కరిస్తామని, విధుల్లోకి చేరాలని సూచించారు. వైసీపీ నేతలతో అంటకాగిన ఉద్యోగ సంఘం నేతలు సజ్జల మాటలు నమ్మి సమ్మెను విరమింపచేశారు.

తాడేపల్లి ప్యాలెస్ వద్దకే రానీయట్లేదు..

ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాయ మాటలు చెప్పి సెర్ప్ ఉద్యోగులను సమ్మె విరమింపచేశారని, ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్ వద్దకు రానీయడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ ఉద్యోగ నేతల కారణంగానే తాము ఈ దుస్థితి ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిని ప్రతినిధులుగా ఎంచుకున్నందున దారుణంగా మోసపోయామని మండిపడుతున్నారు. ఇప్పటికైనా వైసీపీ మాటున ఉద్యోగులకు చేసిన మోసం గ్రహించాలంటూ సెర్ప్ ఉద్యోగులు వాట్సప్ సందేశాలు పంపుతున్నారు.

రుషికొండ ప్యాలెస్ దారిలో.. బస్‌షెల్టర్లు కూల్చివేత


రుషికొండ ప్యాలెస్‌కు కొత్తగా రహదారి నిర్మాణం

విశాఖపట్నం/సాగర్‌నగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రుషికొండలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నిర్మాణం కోసం అధికారులు రెండు బస్ షెల్టర్లను కూల్చివేశారు. రుషికొండలో గీతం, గాయత్రీ విద్యా సంస్థలకు రోజూ పది వేల మందికిపైగా విద్యార్థులు, సిబ్బంది బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. వీరి కోసం గీతం కాలేజీ ఎదురుగా ఒకటి, గాయత్రీ కాలేజీ ఎదురుగా మరొకటి బస్ షెల్టర్లు ఉండేవి. రుషికొండపై హరిత రిసార్ట్స్‌ను కూల్చివేసిన సమయంలోనే గీతం కాలేజీ బస్ షెల్టర్‌ను పడగొట్టి ఆ స్థలాన్ని ప్యాలెస్ నిర్మాణంలో కలిపేసుకున్నారు. మరికొద్ది రోజులకు గాయత్రీ బస్ షెల్టర్‌ను కూడా కూల్చేసి ఆ స్థానంలో రేకులతో ప్రహరీ ఏర్పాటుచేశారు. ఇప్పుడు రాత్రికిరాత్రి ఆ రేకులన్నీ తీసేసి రహదారి నిర్మాణం చేపట్టారు. సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లే మార్గంలో దానిని కూడా కలిపేశారు. ప్రత్యామ్నాయంగా ఆ పరిసరాల్లో ఎక్కడా కొత్త బస్‌షెల్టర్ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

ఎన్నికల తర్వాత విచారణ జరపండి

▸ హైకోర్టును కోరిన ఎంపీ రఘురామ

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఆయన ఆప్తులకు అనుచిత లబ్ధి చేకూర్చేలా వైసీపీ ప్రభుత్వం రూపొందించిన వివిధ పాలసీలు, తీసుకున్న నిర్ణయాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. రఘురామ తరఫున సీనియర్ న్యాయవాది మురళీధరరావు వాదనలు వినిపిస్తూ కేవలం ప్రచారం కోసమే పిల్ దాఖలు చేసినట్లు 80శాతం ప్రతివాదులు ఆరోపిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పిల్‌పై ఎన్నికల తర్వాత విచారణ జరిపినా అభ్యంతరం లేదన్నారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం.. పిల్‌ను వాయిదా వేయాలని కోరడానికిగల కారణాలను పేర్కొంటూ మెమో దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దుర్గా ప్రసాదరావు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశాలిచ్చింది. గతంలో పిల్ విచారణ సందర్భంగా ఈ వ్యాజ్యం విచారణార్హతపై ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. దీంతో పిల్ అడ్మిషన్‌కు ముందు ప్రతివాదులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. సోమవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా.. సీఎస్ తరఫున ఏజీ వాదనలు వినిపిస్తూ పిల్‌ను పెండింగ్‌లో ఉంచాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం దానిని ఉపసంహరించుకొని ఎన్నికల తర్వాత దాఖలు చేసుకొనేలా ఆదేశించాలన్నారు. మరోవైపు పిటిషనర్ రఘురామ కూడా హైకోర్టుకు హాజరయ్యారు. కేసు విచారణ వాయిదా పడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌ని ఓడించడానికి ఎలాంటి వ్యూహాలు అవసరం లేదని, ఆయన చేసిన మోసాలను ప్రజలకు తెలియజేస్తే చాలని అన్నారు.

ఇండియా కూటమితోనే స్వేచ్ఛ

▸ బెదిరించడమే బీజేపీకి తెలిసిన పాలన: రామకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల నేతృత్వంలోని ఇండియా కూటమి విజయంతోనే దేశంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వెల్లివిరుస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం జరిగిన పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. 'దేశంలో గత పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కరువైంది. మరోసారి అధికారంలోకి వస్తే అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం స్థానంలో మను వాదాన్ని అమలులోకి తెస్తుంది. రాష్ట్రానికి తీవ్ర నష్టం చేసిన బీజేపీకి టీడీపీ, జనసేన, వైసీపీలు ఎందుకు మద్దతు ఇస్తున్నాయో ప్రజలకు చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

బీజేపీకి లొంగిపోయారు: సీపీఎం

పాలకొల్లు టౌన్, మార్చి 11: రాష్ట్ర విభజనకు కారణమైన బీజేపీతో రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి భాగస్వామ్యం కావడం దురదృష్టకరమని రాష్ట్ర సీపీఎం పేర్కొంది. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి, అన్యాయం చేసిన బీజేపీకి టీడీపీ, జనసేన లొంగిపోయాయంటూ మండిపడింది. 'రాష్ట్రానికి ప్రధాన శత్రువైన బీజేపీపై రాష్ట్రంలోని 2 ప్రధాన పార్టీలు గత ఐదేళ్లలో ఒక్క విమర్శ కూడా చేయలేదు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కు, రాజధాని నిధులు గురించి నిలదీయలేదు' అని సీపీఎం విమర్శించింది.

ప్రత్తిపాటి, ఇతరులను అరెస్టు చేయబోం



▸ హైకోర్టుకు హామీ ఇచ్చిన సీఐడీ అధికారులు

▸ పుల్లారావు, 'బీఎస్ఆర్'లను నిందితులుగా చూపలేదు

▸ మిగతా వారి పట్లా తొందరపాటు చర్యలుండవు: సీఐడీ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధులు మళ్లించారని ఆరోపిస్తూ నమోదు చేసిన కేసులో నిందితులు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తదితరులను అరెస్టు చేయబోమని సీఐడీ అధికారులు సోమవారం హైకోర్టుకు హామీ ఇచ్చారు. సీఐడీ తరఫు న్యాయవాది అభ్యర్థన మేరకు న్యాయస్థానం ఈ కేసుల విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు సోమవారం ఆదేశాలిచ్చారు. జీఎస్టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధులు మళ్లించారని ఆరోపిస్తూ ఏపీ స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.సీతారామిరెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 24న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విజయవాడ మాచవరం పోలీసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మాజీమం త్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన సతీమణి వెంకాయమ్మ, కుమార్తె స్వాతి, కుర్రా జోగేశ్వరరావు, బొగ్గవరపు అంకమ్మరావు, బొగ్గవరపు నాగమణి, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఇండియా ఎండీ బలుసు శ్రీనివాసరావు వేర్వేరుగా హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలు సోమవారం విచారణకు వచ్చాయి. సీఐడీ తరఫు న్యాయవాది వైఎల్ శివకల్పనారెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసును పోలీసుల నుంచి సీఐడీకి బదిలీ చేశారన్నారు. రికార్డులను అధ్యయనం చేసి వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. విచారణను గురువారానికి వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది బి ఆదినారాయణరావు, న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర, కిలారు నితిన్‌కృష్ణ, వీవీ సతీశ్ వాదనలు వినిపించారు. పిటిషనర్లను అరెస్టు చేసే ప్రమాదం ఉందన్నారు. సీఐడీ తరఫు న్యాయవాది జోక్యం చేసుకుంటూ.. ప్రత్తిపాటి పుల్లారావు, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాను ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా చేర్చలేదన్నారు. ఈ నేపథ్యంలో వారిని అరెస్టు చేస్తామనే ఆందోళన అవసరం లేదన్నారు. ఇతర పిటిషనర్ల విషయంలో సీఐడీ పోలీసులు అరెస్టుతోపాటు ఎలాంటి తొందరపాటు చర్యలూ తీసుకోబోరని హామీ ఇస్తున్నామని తెలిపారు. ఈ వివరాలు నమోదు చేసిన న్యాయమూర్తి... వాదనల కోసం విచారణను గురువారానికి వాయిదా వేశారు.

రాతపూర్వక వాదనలకు హైకోర్టు ఆదేశం

జీఎస్టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధుల మళ్లింపు కేసులో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ కస్టడీకి విజయవాడ ఫస్ట్ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించడంపై పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. రాతపూర్వక వాదనలు సమర్పించాలని సీఐడీ, నిందితుడు శరత్ తరఫున న్యాయవాదులను న్యాయస్థానం ఆదేశించింది. అందుకు వీలుగా పోలీసులు వేసిన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌ను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు సోమవారం ఆదేశాలిచ్చారు. బుధవారం తగిన ఆదేశాలు ఇస్తామని పేర్కొన్నారు. అంతకుముందు సీఐడీ తరఫు న్యాయవాది వైఎల్ శివకల్పనారెడ్డి వాదనలు వినిపించారు. "రాజధాని అమరావతి ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనుల టెండర్‌ను బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా చేజిక్కించుకుంది. టెండర్ నిబంధనలకు విరుద్ధంగా అవెక్సా కంపెనీకి 'బీఎస్ఆర్' సబ్ కాంట్రాక్ట్‌కు ఇచ్చింది. దీనికోసం అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏడీసీఎల్) నుంచి ముందస్తు అనుమతి తీసుకోలేదు. బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా నుంచి అవెక్సాకు, అక్కడ నుంచి మరికొన్ని షెల్ కంపెనీలకు నిధులు మళ్లించారు. ఈ సమయంలో నిందితుడు అవెక్సా కంపెనీలో అదనపు డైరెక్టర్‌గా ఉన్నారు. మళ్లించిన నిధులు ఎక్కడకు చేరాయో తేల్చాలంటే లోతైన విచారణ అవసరం. ఈ నేపథ్యంలోనే శరత్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతున్నాం" అని వివరించారు. శరత్ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు స్పందిస్తూ.... ప్రైవేటు కంపెనీల మధ్య జరిగిన లావాదేవీలకు కుట్రకోణం ఆపాదించడంలో అర్థం లేదన్నారు. "రోడ్డు నిర్మాణం విషయంలో బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు, ఏడీసీఎల్‌కు మధ్య ఒప్పందం జరిగింది. రోడ్డు నిర్మాణం పూర్తి అయినట్లు అధికారులు నిర్ధారించారు. బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు అదనంగా ఎలాంటి సొమ్ము చెల్లించలేదు. అవెక్సా కంపెనీ, ప్రభుత్వం మధ్య ఎలాంటి ఒప్పందమూ జరగలేదు. పనులు చేసిందనే కారణంతో కేసు పెట్టడం ఏమిటి? ఈ విషయంలో పోలీసులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదు. పోలీసు కస్టడీని నిరాకరించాలి" అని వాదించారు.

ప్రత్తిపాటి శరత్ కేసులో సీఐడీకి ఝలక్

▸ మెమో రిటర్న్ చేసిన విజయవాడ కోర్టు

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ కేసులో సీఐడీకి విజయవాడ కోర్టు ఝలక్ ఇచ్చింది. కేసును మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు నుంచి ఏసీబీ (మూడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్) కోర్టుకు బదిలీ చేయడానికి నిరాకరించింది. ఈ మేరకు సీఐడీ పీపీ సత్యనారాయణ, ఉమాదేవి దాఖలు చేసిన మెమోను కోర్టు రిటర్న్ చేసింది. సోమవారం కోర్టు ప్రారంభమైన తర్వాత సీఐడీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, ఉమాదేవి మెమో దాఖలు చేశారు. ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారని, అందువల్ల దీన్ని ఏసీబీ కోర్టుకు బదిలీ చేయాలని మెమోలో పేర్కొన్నారు. దీనికి కిలారు బెనర్జీ అభ్యంతరం వ్యక్తం చేశారు. మాచవరం పోలీసులు నమోదు చేసిన కేసును సీఐడీకి బదిలీ చేయడమన్నది డీజీపీకి, సీఐడీ అదనపు డీజీకి మధ్య జరిగిన అంతర్గత వ్యవహారమని వాదించారు. కేసు బదిలీ చేయాలంటే ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని స్పష్టంచేశారు. బెనర్జీ వాదనలతో ఏకీభవించిన న్యాయాధికారి కరీముల్లా...సీఐడీ దాఖలు చేసిన మెమోను రిటర్న్ చేశారు. ఆ తర్వాత సీఐడీ పీపీ సత్యనారాయణ సీఆర్పీసీ 322 కింద పిటిషన్ దాఖలు చేశారు. దీనిపైనా బెనర్జీ అభ్యంతరం తెలిపారు. నిందితుడికి పెద్దపెద్ద శిక్షలు పడే అవకాశం ఉందని నిర్ధారణ అయినప్పుడే కింది కోర్టు నుంచి పైస్థాయి కోర్టుకు కేసును బదిలీ చేస్తారన్నారు. అప్పుడు మాత్రమే సీఆర్పీసీ 322 సెక్షన్ వర్తిస్తుందన్నారు.

అనంతలో ఆరుగురు పోలీసుల డిస్మిస్

▸ అవినీతి, అక్రమాలు నిరూపణ కావడంతో చర్యలు

అనంతపురం క్రైం, మార్చి 11: పోలీసు శాఖలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఆరుగురిని డిస్మిస్ చేశారు. అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్ సోమవారం రాత్రి ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. డిస్మిస్ అయినవారిలో ఒక హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు, జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ జూనియర్ అసిస్టెంట్ ఉన్నారు. 2019లో తాడిపత్రి పట్టణంలో పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర, కానిస్టేబుళ్లు రమణ, నాగరాజు, ప్రతాప్ నాయక్, మోహన్ బాబు.. మట్కా, పేకాట నిర్వాహకులు, బీటర్లు, గంజాయి విక్రేతల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకునేవారు. ఈ ఆరోపణల నేపథ్యంలో ఐదుగురినీ అప్పట్లో సస్పెండ్ చేశారు. విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో వారిని ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేశారు. అలాగే, అనంతపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ జ్ఞానేశ్వరి చిట్టీలు నిర్వహించి ప్రజలను మోసగించారు. రూ.లక్షల్లో వసూలు చేసి ఎగ్గొట్టినట్లు విచారణలో తేలడంతో ఆమెను డిస్మిస్ చేశారు. తప్పు చేస్తే ఎవరినీ వదలబోమని ఎస్పీ పేర్కొన్నారు.

మేదరమెట్ల సిద్ధం సభ అభాసుపాలు: వర్ల

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మేదరమెట్లలో 4వ సిద్ధం సభకు 15 లక్షల మంది వస్తారని ప్రచారం చేసుకుని వైసీపీ అభాసులపాలయిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఎద్దేవా చేశారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'మేదరమెట్ల సిద్ధం సభను ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా మయసభలా మార్చారు. సిద్ధం సభలో ఇద్దరు చనిపోయారు. ఇంకొకరు చావు బతుకుల్లో ఉన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వైవీ సుబ్బారెడ్డిని అరెస్టు చేయాలి' అని వర్ల డిమాండ్ చేశారు. కాగా, లోకేశ్ సభకు భద్రతపై ఆయన మాట్లాడుతూ.. 'టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కల్యాణదుర్గం, రాయదుర్గం శంఖారావం సభలకు తగిన భద్రత ఏర్పాట్లలో పోలీసుల వైఫల్యముంది. ఆయన సభలకు తగిన భద్రతా ఏర్పాట్లు కల్పించాలి' అని వర్ల రామయ్య డీజీపీకి లేఖ రాశారు.

వాసుదేవరెడ్డిని బదిలీ చేయాలి: అచ్చెన్న

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డిని బదిలీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. 'తెలంగాణకు చెందిన ఐఆర్‌టీఎస్ అధికారి వాసుదేవరెడ్డికి రాష్ట్రంలోని అధికారపార్టీ లిక్కర్ మాఫియాతో దగ్గర సంబంధాలున్నాయి. రాష్ట్రంలో జరుగుతున్న లిక్కర్ కుంభకోణంలోను ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారు. రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే లిక్కర్ మాఫియాతో సంబంధాలున్న వాసుదేవరెడ్డిని ఉన్నపళంగా బదిలీ చేయాలి. రాష్ట్రంలో జరుగుతున్న లిక్కర్ అమ్మకాలు, రవాణాపై నిఘా పెట్టాలి' అని అచ్చెన్న కోరారు.

పొన్నలూరు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి: షరీఫ్

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ కార్యకర్తలను వైసీపీలో చేరాలంటూ, అందుకు మంత్రి ఆదిమూలం సురేశ్‌ను కలవాలంటూ పొన్నలూరు ఎస్ఐ రాజేశ్ బెదిరిస్తున్నారు. లేకపోతే రౌడీషీట్ ఓపెన్ చేస్తామంటున్నారు' అని శాసన మండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మంత్రి సురేశ్‌కు ఎస్ఐ రాజేశ్‌తో సన్నిహిత సంబంధాలుండటంతో ఎర్రగొండపాలెం నుంచి కొండెపి నియోజకవర్గంలోని పొన్నలూరుకు రాజేశ్ బదిలీ అయ్యారన్నారు. ఎస్ఐ రాజేశ్‌ను పొన్నలూరు పోలీసుస్టేషన్‌కు పోస్టింగ్ చేయడంపై సమగ్ర విచారణ జరిపించాలి. ఆ మేరకు పోలీసుశాఖకు తగు ఆదేశాలివ్వాలి' అని ఎన్నికల కమిషన్‌ను ఆ లేఖలో కోరారు.

ఆధార్ ఉంటేనే రిజిస్ట్రేషన్లు.. ఇబ్బందుల్లో ఎన్నారైలు

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన రిజిస్ట్రేషన్ విధానంలో ఆధార్ కార్డును తప్పనిసరి చేసింది. ఈ నిబంధనతో విదేశాల్లో ఉంటున్నవారు ఇబ్బంది పడుతున్నారు. రిజిస్ట్రేషన్లకు వారి పాస్‌పోర్టులనూ పరిగణలోకి తీసుకోవడం లేదు. గతంలో ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు.. ఇలా మొత్తం ఐదు గుర్తింపు కార్డులో ఏ ఒక్కటి చూపినా రిజిస్ట్రేషన్ జరిగిపోయేది. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ఆధార్ తప్పనిసరి కాదని కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు చెప్పినా జగన్ సర్కార్ పట్టించుకోవడం లేదు.

నూతన ఆర్టీఐ కమిషనర్లు ప్రమాణ స్వీకారం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార కమిషన్‌లో నూతనంగా నియమితులైన ముగ్గురు సమాచార కమిషనర్లు.. చావలి సునీల్, రెహానా బేగం, అల్లారెడ్డి ఉదయ భాస్కర్‌రెడ్డిలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ మేరకు సోమవారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయంలో సమాచార కమిషనర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార కమిషన్ ముఖ్య సమాచార కమిషనర్ బాషా, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సమాచార కమిషనర్లు రాజా, శామ్యూల్ జొనాతన్, చెన్నారెడ్డి సమాచార కమిషన్ లా సెక్రటరీ చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ వర్సిటీ ఈసీ గడువు పెంపు


అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): హెల్త్ వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ గడువు మరో మూడు నెలల పాటు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021 మార్చి నెలలో వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఏడాది మార్చితో రెండు ఏళ్ల గడువు పూర్తి అయింది. నిబంధనల ప్రకారం కొత్త కౌన్సిల్‌ను నియమించాలి. కానీ ప్రభుత్వం ఉన్న కౌన్సిల్‌కు మరో మూడు నెలల పాటు పొడిగింపు ఇచ్చింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్‌కు ప్రభుత్వం సూచించింది.



ప్రపంచవ్యాప్తంగా ప్రతి వంద మందిలో పది మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఇందుకు కారణం మూత్రపిండాల వ్యాధుల పట్ల తగినంత అవగాహన లేకపోవడమే! కాబట్టి మూత్రపిండాల సంరక్షణ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం అవసరం.

కిడ్నీలు కీలకం

కిడ్నీలు రక్తాన్ని వడగట్టి, వ్యర్థాలను శరీరం నుంచి తొలగిస్తాయనే విషయం అందరికీ తెలిసిందే! ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేసే హార్మోన్లు, ఎముకల పెరుగుదలకు ఉపయోగపడే డి విటమిన్ తయారీపరంగా కిడ్నీలు తోడ్పడతాయి. రక్తపోటును నియంత్రణలో ఉంచుతూ గుండె సక్రమ పనితీరుకు సహాయపడతాయి. అలాగే శరీరంలోని, క్యాల్షియం, పొటాషియం మొదలైన పోషకాల నియంత్రణలో కూడా సహాయపడతాయి.



కిడ్నీలు దెబ్బతినే అవకాశాలు ఇవే!

- మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బుల సమస్యలు ఉన్నవాళ్లలో మూత్రపిండాల సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువ.
- ఊబకాయులు, అరవై ఏళ్లు పైబడినవాళ్లు, ధూమపానం అలవాటు ఉన్న వాళ్లకు కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఎక్కువ
- దీర్ఘకాలం పాటు పెయిన్ కిల్లర్స్, ఇన్సులిన్ వాడేవాళ్లకు కూడా ముప్పు పొంచి ఉంటుంది.
- కిడ్నీలో రాళ్లు, దీర్ఘకాలిక మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు మూత్రపిండాల వ్యాధికి దారి తీస్తాయి

లక్షణాలు ఇవే!

- నురగతో కూడిన మూత్రం
- తరచూ లేదా ఆగి ఆగి మూత్రవిసర్జన చేయడం
- మూత్రంలో రక్తం
- ఆకలి మందగించడం, వికారం, వాంతులు
- త్వరగా అలసిపోవడం
- చర్మం పొడిబారి, దురదగా ఉండడం

కిడ్నీ వ్యాధి నిర్ధారణ ఇలా...

మూత్రపిండాల వ్యాధిని ముందుగానే కనిపెట్టడం కోసం క్రమం తప్పకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధి తీవ్రం కాకుండా వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. మూత్రపిండాల వ్యాధిని నిర్ధారించే పరీక్షల ఖర్చు తక్కువే! రెండు పరీక్షలతో వ్యాధిని నిర్ధారించుకోవచ్చు.

- మూత్రంలో ప్రొటీన్‌ను పసిగట్టే పరీక్ష ప్రధానమైనది. మూత్రంలో తక్కువ ప్రొటీన్ పోవడం మూత్రపిండ వ్యాధికి సంకేతం. యూరిన్ అల్బ్యూమిన్ క్రియాటినిన్ రేషియో పరీక్ష ద్వారా కిడ్నీ సమస్యను కనిపెట్టవచ్చు.
- కిడ్నీలో రక్తం ఏ మేరకు శుద్ధి అవుతుందో తెలిపే పరీక్ష జిఎఫ్ఆర్ పరీక్ష. ఈ పరీక్షతో కిడ్నీ పనితీరు తెలుస్తుంది. ఈ రెండు పరీక్షల్లో అవకతవకలు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.

కిడ్నీ కేర్

- మధుమేహం, అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలి.
- మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లను, మూత్ర వ్యవస్థలో సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలి.
- తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో కూడిన సంతులన ఆహారం తీసుకోవాలి.
- క్రమం తప్పక వ్యాయామం చేయడంతో పాటు, సరిపడా విశ్రాంతి తీసుకోవాలి
- మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి.

ఇవి కూడదు

- మరీ ముఖ్యంగా అధిక రక్తపోటు ఉన్నవాళ్లు ఉప్పును పరిమితంగా వాడుకోవాలి.
- ధూమపానం కిడ్నీ ఫెయిల్యూర్ సమస్యను పెంచుతుంది. కాబట్టి ఈ అలవాటు మానుకోవాలి
- వైద్యులు సూచించకపోయినా పెయిన్ కిల్లర్స్ వాడుకోకూడదు
- ఆరోగ్యానికి హాని చేసే పసరు మందులు వాడకూడదు
- తరచూ అధిక ప్రొటీన్‌తో కూడిన రెడ్ మీట్, ప్రాసెస్డ్ ఫుడ్ తినకూడదు

డయాలసిస్ - కిడ్నీ మార్పిడి

కిడ్నీ వ్యాధి ఉన్న ప్రతి ఒక్కరికీ డయాలసిస్ అవసరం ఉండదు. వ్యాధి ప్రారంభ దశలో సమర్థమైన చికిత్స, వ్యాయామం, ఆహారంతో వ్యాధి ముదరకుండా, అదుపులోకి తెచ్చుకోవచ్చు. క్రియాటిన్ పెరుగుదలను మందులతో అరికట్టవచ్చు. వ్యాధి తీవ్రత పెరిగి కిడ్నీలు పూర్తిగా పని చేయడం మానేసినప్పుడు మాత్రమే డయాలసిస్ లేదా కిడ్నీ మార్పిడి అవసరమవుతుంది. సరైన జాగ్రత్తలు, ఆహార నియమాలు పాటించగలిగితే, డయాలసిస్‌తో సగటు ఆయుర్దాయం 15 నుంచి 20 సంవత్సరాల వరకూ పెరిగిన దాఖలాలు ఉన్నాయి. అయితే మూత్రపిండాల వ్యాధికి డయాలసిస్ నివారణ కాదు. మూత్రపిండాల మార్పిడి చేసుకునేవరకూ డయాలసిస్ మీద ఆధారపడక తప్పదు. అయితే కిడ్నీ మార్పిడి క్లిష్టమైన వ్యవహారం. సరైన డోనార్ దొరికే వరకూ ఎదురుచూడవలసి ఉంటుంది. కాబట్టి మూత్రపిండాలు వ్యాధులకు గురి కాకుండా కాపాడుకోవాలి. మధుమేహం, అధిక రక్తపోటులను అదుపులో ఉంచుకుంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలి. మధుమేహులు, అధిక రక్తపోటు ఉన్నవారు, 50 ఏళ్లు పైబడినవాళ్లు, గుండె జబ్బులు ఉన్నవాళ్లు, ఊబకాయులు క్రమం తప్పకుండా కిడ్నీ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను కలవాలి.

డాక్టర్ హిమదీప్తి ఆళ్ల
నెఫ్రాలజిస్ట్ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్,
ఎరిటి హాస్పిటల్స్, గచ్చిబౌలి, హైదరాబాద్.



షేక్ హ్యాండ్ ఇవ్వడానికి కొంతమంది తటపటాయిస్తూ ఉంటారు. లేదంటే చేతులు తుడుచుకుని ఆ తర్వాతే షేక్ హ్యాండ్ ఇస్తూ ఉంటారు. విపరీతంగా చమట పడుతూ చేతులు తడిగా ఉండడమే ఇందుకు కారణం. అర చేతులు, పాదాలు, బాహుమూలలు, ముఖం, తల... ఈ ప్రదేశాల్లో విపరీతంగా చమట పట్టే పరిస్థితి 'హైపర్ హైడ్రోసిస్'. దీన్ని చిన్నపాటి సర్జరీతో సరిదిద్దవచ్చు అంటున్నారు వైద్యులు.

హైపర్ హైడ్రోసిస్

చమటలో తడిచిపోతున్నారా?

మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్... ఈ సమస్యలున్న కొందర్లో చమట ఎక్కువగా పడుతూ ఉంటుంది. ఈ సమస్యలేవీ లేని కొందర్లో, అకారణంగా విపరీతంగా చమట పట్టే పరిస్థితి ఉంటుంది. ఆ చమట చుక్కలుగా కారేటంత తీవ్రంగా ఉంటుంది. వాతావరణంలో స్వల్ప మార్పు చోటు చేసుకున్నా, ఆందోళన, ఒత్తిడులకు గురైనా కొందరికి విపరీతంగా చమట పడుతూ ఉంటుంది. ఈ పరిస్థితి ఏకంగా ఒకటి నుంచి రెండు గంటల పాటు కొనసాగుతూ ఉంటుంది. 20 నుంచి 30 ఏళ్ల వయస్కులు ఎదుర్కొనే ఈ సమస్య ప్రమాదకరమైనది కాకపోయినా, దైనందిన జీవితాన్ని ఇబ్బంది పెడుతూ ఉంటుంది. నడుస్తున్న బస్సెక్కబోతూ చమట పట్టిన చేతి నుంచి హ్యాండిల్ జారిపోయి కిందపడిపోతూ ఉంటారు. పరీక్ష రాసేటప్పుడు అరచేతుల్లో అధిక చమట వల్ల ఆన్సర్ పేపర్ తడిచిపోయే పరిస్థితి వస్తూ ఉంటుంది. ఐటి ఉద్యోగులు ఉద్యోగరీత్యా ప్రెజెంటేషన్ సమయంలో అందరికీ షేక్ హ్యాండ్ ఇవ్వవలసి వస్తూ ఉంటుంది. కానీ అరచేతుల్లో చమట కారణంగా షేక్‌హ్యాండ్ ఇవ్వలేక, ఉద్యోగమే పోగొట్టుకునే పరిస్థితిని ఎదుర్కొనే వాళ్లూ ఉంటారు.

హైపర్ హైడ్రోసిస్

అధిక చమటకు మూలకారణాన్ని కనిపెట్టడం ముఖ్యం. అధిక రక్తపోటు, థైరాయిడ్, మధుమేహం కారణమైతే, వాటిని మందులతో అదుపులో పెట్టుకుంటే సమస్య సర్దుకుంటుంది. ఇవేవీ కారణం కానప్పుడు, హైపర్ హైడ్రోసిస్‌గా నిర్ధారించుకోవాలి. కొందరికి అర చేతుల్లో (పామర్), ఇంకొందరికి పాదాల్లో (ప్లాంటార్), మరికొందరికి బాహుమూలల్లో (యాక్సిలరీ), ఇంకొందరికి ముఖం, తలలో (క్రేనియో ఫేసియల్) విపరీతంగా చమట పట్టేస్తూ ఉంటుంది. అరుదుగా కొందరికి ఈ నాలుగు ప్రదేశాల్లో విపరీతంగా చమట పట్టేస్తూ ఉంటుంది. ఈ పరిస్థితికి కారణమైన నాడులు పక్కటెముకల దగ్గర ఉంటాయి. చిన్నపాటి సర్జరీతో వాటి పనితీరును నియంత్రించడం ద్వారా అధిక చమట సమస్యను సరిదిద్దవచ్చు.

ప్రధాన దుష్ప్రభావాలు

సర్జరీతో అరచేతుల్లో చమటను ఆపేసినప్పుడు, తొడ వెనక ఎక్కువగా చమట పట్టే అవకాశాలు కొందర్లో ఉంటాయి. సర్జరీ తర్వాత కొందర్లో నెల వరకూ అధిక చమట కొనసాగి, క్రమేపీ తగ్గిపోవచ్చు. అలాగే అధిక చమటకు ఆస్కారం ఉండే ఆందోళన, భయాలు, ఒత్తిడులను కూడా తగ్గించుకోవాలి.



డాక్టర్ మంజునాథ్ బాలే
సీనియర్ మినిమల్లీ ఇన్వేసివ్ అండ్ రోబోటిక్ థొరాసిక్ సర్జన్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్.

కొందరికి అర చేతుల్లో (పామర్), ఇంకొందరికి పాదాల్లో (ప్లాంటార్), మరి కొందరికి బాహుమూలల్లో (యాక్సిలరీ), ఇంకొందరికి ముఖం, తలలో (క్రేనియో ఫేసియల్) విపరీతంగా చమట పట్టేస్తూ ఉంటుంది.



సింపథెక్టమీతో...

ఇది ఒక్క గంటలో పూర్తయ్యే తేలికపాటి సర్జరీ. ఉదయం సర్జరీ చేయించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లిపోవచ్చు. పక్కటెముకల దగ్గర ఐదు మిల్లీమీటర్ల రంధ్రాలు చేసి కెమెరా సహాయంతో సదరు ప్రాంతంలో చమట పట్టడానికి కారణమైన నాడికి క్లిప్ వేయడం జరుగుతుంది. ముఖం, తల, చేతులు, పాదాల్లో చమటను నియంత్రించడానికి వెన్నులో రెండవ పక్కటెముక దగ్గరున్న నరానికీ, అరచేతులు, పాదాలు, బాహుమూలల్లో చమటను నియంత్రించడం కోసం మూడవ పక్కటెముక దగ్గరున్న నరానికీ, అరచేతులు, పాదాల్లో చమట నియంత్రణ కోసం నాల్గవ పక్కటెముక దగ్గరున్న నరానికీ, కేవలం పాదాల్లో చమటను నియంత్రించడం కోసం ఐదవ పక్కటెముక దగ్గరున్న నరానికీ క్లిప్ వేయవలసి ఉంటుంది. సర్జరీ తర్వాత కొందరికి అరచేతులు బాగా పొడిబారిపోవచ్చు, కానీ పాదాల్లో చమట కొంత మేరకు కనిపిస్తూ ఉండవచ్చు. పాదాల్లో చమటను నియంత్రించడానికి నరానికి బలంగా క్లిప్ వేస్తే, వాళ్లకు వెన్నులో ఎక్కువగా చమట పట్టే పరిస్థితి మొదలవుతుంది. కాబట్టి వైద్యులు చేతుల్లో చమటను తగ్గించడమే ప్రధానంగా సర్జరీ చేస్తారు.



ప్లానింగ్

పెళ్లికి ముందు పరీక్షలు

పెళ్లికి ముందు అటు ఆరు తరాలూ, ఇటు తరాలూ గమనించాలి అంటారు. పెళ్లి నూరేళ్ల పంటగా వర్థిల్లడం కోసమే ఈ ముందు జాగ్రత్తలు. అయితే దంపతుల ఆరోగ్యాలతో పాటు, పిల్లలు పుట్టే అవకాశాలు, జన్యుపరంగా సంక్రమించే వ్యాధులు లాంటి వివరాలను కూడా ముందుగా తెలుసుకోవడం కూడా అవసరమే! అందుకోసం పెళ్లి చేసుకోబోయే జంట కొన్ని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలి. అవేంటంటే...

రక్తపరీక్షలు:

అనీమియా లాంటి అంతర్గత ఆరోగ్య సమస్యలు, ఇన్‌ఫెక్షన్లు తెలుసుకోవడం కోసం ఈ పరీక్ష చేయించుకోవాలి.
ఈ పరీక్షతో ఇద్దరి బ్లడ్‌గ్రూప్ కూడా తేటతెల్లమవుతుంది.



జెనెటిక్ స్క్రీనింగ్:

వంశపారంపర్యంగా సంక్రమించే జన్యు సమస్యలు, ముప్పులను ఈ పరీక్షతో పసిగట్టవచ్చు. ఈ పరీక్ష ఫలితాన్ని బట్టి దంపతులు పిల్లల ప్లానింగ్ చేసుకోవచ్చు. అలాగే అవసరమైన ముందు జాగ్రత్తలు, చికిత్సలను ఆశ్రయించవచ్చు.

ఎస్‌టిఐ:

లైంగికంగా సంక్రమించే కొన్ని వ్యాధులు శాశ్వత వంధత్వాన్ని తెచ్చిపెడతాయి. కాబట్టి పెళ్లికి ముందు ఈ పరీక్ష తప్పనిసరిగా చేయించుకుని, అవసరాన్ని బట్టి చికిత్స తీసుకోవాలి.

ఫెర్టిలిటీ పరీక్షలు:

పునరుత్పత్తి సామర్థ్యాన్ని అంచనా వేసే పరీక్షలు ఇద్దరూ చేయించుకోవాలి. స్త్రీలల్లో అండాశయాలు, గర్భాశయ లోపాలు, పురుషుల్లో వీర్యకణాలు, కదలికల వివరాలు ఈ పరీక్షతో తెలుస్తాయి. లోపం ఎవరిలో ఉన్నా చికిత్సతో సరిదిద్దుకుంటే, తర్వాత పిల్లలను కనడంలో ఎలాంటి సమస్యలూ ఎదురవకుండా ఉంటాయి.

మీకు తెలుసా?


పాప్‌కార్న్ బ్రెయిన్

మొక్కజొన్న గింజలను వేయించేటప్పుడు అవి చిన్నపాటి టపాసుల్లా పేలుతూ చెల్లాచెదురుగా ఎగిరి పడిపోతూ ఉంటాయి. అదే పనిగా ఇంటర్నెట్, సోషల్ మీడియా ఉపయోగించే వాళ్ల ఆలోచనలు కూడా పాప్‌కార్న్‌లా ఒక దగ్గరి నుంచి ఇంకో దగ్గరకి ఎగిరి పడుతూ ఉంటాయి.



ఈ పరిస్థితినే పాప్‌కార్న్ బ్రెయిన్ అంటారు. ఈ స్థితికి చేరుకున్న వారి సామాజిక అనుబంధాలు దెబ్బతింటాయి. సహనం తగ్గడంతో పాటు మానసిక సంతులనాన్ని కూడా కోల్పోతారు.
ఆందోళన పెరిగి ఉత్పాదకత కూడా తగ్గుతుంది. దేని మీద మనసు కేటాయించలేకపోవడం, అప్రమత్తత లోపించడం కూడా పాప్‌కార్న్ బ్రెయిన్ లక్షణాలే! ఈ పరిస్థితి వృత్తిపరమైన, వ్యక్తిగతమైన జీవితాలను దెబ్బతీస్తుంది. కాబట్టి ఇంటర్నెట్, సోషల్ మీడియా వాడకాలను పరిమితం చేసుకోవాలి.

అవగాహన



ఆ గీతకు అర్థం?

మందుల స్ట్రిప్‌ల మీద అడ్డుగా ఉండే ఎర్రని గీతను ఎప్పుడైనా గమనించారా? అలాంటి గీతలను చాలా మందుల స్ట్రిప్‌ల మీద చూశాం కదా? దాన్లో విచిత్రమేముంది? అనుకోకండి. ఆ గీతకు ఒక అర్థం ఉంది. యాంటీబయాటిక్స్ విచక్షణా రహితంగా వాడడం వల్ల యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ పెరుగుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎప్పటి నుంచో గగ్గోలు పెడుతోంది. ఈ పరిస్థితి సూక్ష్మజీవుల మ్యుటేషన్‌కు దారి తీస్తుందనీ, మందులకు లొంగని వ్యాధికారక వైరస్‌లు, బ్యాక్టీరియాల సంఖ్యను పెంచుతుందని మనందరికీ తెలుసు. కాబట్టే వైద్యులు సూచించినప్పుడు, సూచించినంత కాలం మాత్రమే యాంటీబయాటిక్స్ వాడుకోవాలి. ఈ మందులను తేలికగా గుర్తించడం కోసమే యాంటిబయాటిక్స్ స్ట్రిప్‌ల మీద ఎర్రని గీతను ముద్రిస్తూ ఉంటారు. ఈ గీత ఆధారంగా మందుల షాపుల్లో విక్రయించే యాంటీబయాటిక్స్‌ను తేలికగా గుర్తించవచ్చు. తలనొప్పి, జలుబు లాంటి స్వల్ప రుగ్మతలకు ఓవర్ ది కౌంటర్ మెడికేషన్ కొనే సమయంలో అవగాహన లేమితో యాంటీబయాటిక్స్‌ను కొనేసి విచక్షణారహితంగా వాడకుండా ఉండడం కోసమే ఈ ఏర్పాటు.

రంజాన్

పవిత్ర మాసంలో నిండైన ఆరోగ్యం

ముస్లిం క్యాలెండర్‌లో తొమ్మిదో నెల రంజాన్ మాసాన్ని ఏడాది మొత్తంలో ఎంతో పవిత్రమైన నెలగా పరిగణిస్తారు. ఈ నెలలో ప్రపంచవ్యాప్తం ముస్లింలు అందరూ ఉపవాసం ఉంటారనే విషయం అందరికీ తెలిసిందే! రోజాలో ఉన్నప్పుడు, తెల్లవారుఝాము నుంచి పొద్దు కుంగేవరకూ ఉపవాసం చేసే సమయంలో ఆరోగ్యం దెబ్బ తినకుండా ఉండడం కోసం ప్రతి ఏటా, ప్రపంచ ఆరోగ్య సంస్థ ముస్లింలకు కొన్ని ఆహార నియమాలను సూచించడం పరిపాటి. అవేంటంటే...

సంతులన భోజనం
ఉపవాసానికి ముందూ, తర్వాత సంతులన ఆహారం తీసుకోవడంతో పాటు నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండాలి. ఉపవాసం ముగిసిన తర్వాత వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగాలి.

ఉప్పు ఇలా
పదార్థాల్లో ఉప్పుకు బదులుగా మూలికలను చేర్చుకోవాలి. సహజసిద్ధమైన మూలికలు ఆహారం రుచిని పెంచడంతో పాటు, ఆరోగ్యాన్ని సమకూరుస్తాయి.

శారీరక వ్యాయామం
ఉపవాసంలో ఉంటున్నప్పటికీ వ్యాయామాన్ని మానవలసిన అవసరం లేదు. వ్యాయామంతో జీర్ణశక్తి మెరుగ్గా ఉండడంతో పాటు, ఆరోగ్యం కూడా భేషుగ్గా ఉంటుంది.

వంట ఇలా
ఆహారంలోని పోషకాలను నష్టపోకుండా ఉండడం కోసం, పదార్థాలను నూనెలో వేయించడానికి బదులుగా, బేక్ చేయడం ఆవిరి మీద ఉడికించడం చేయాలి.



ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 12 మార్చి 2024

ఎయిమ్స్‌లో నర్సింగ్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)-డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్లు విడుదల చేసింది. నర్సింగ్, పారామెడికల్, మెడికల్ విభాగాల్లో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. న్యూఢిల్లీ సహా ఇతర ఎయిమ్స్ క్యాంపస్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. అభ్యర్థులు ముందుగా కోర్సులో ప్రవేశం కోరుతూ ప్రాథమికంగా నమోదు చేసుకోవాలి. ఇందుకు సంస్థ అంగీకారం తెలుపుతూ కోడ్ పంపుతుంది. దీని ద్వారా తుది రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తరవాత ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. ఇది పూర్తయ్యాక ఎంట్రెన్స్ ఎగ్జామ్‌కు హాజరు కావాల్సిందిగా అభ్యర్థులకు అడ్మిట్ కార్డు పంపుతారు.



డిగ్రీ కోర్సులు

బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్(పోస్ట్ బేసిక్), బీఎస్సీ(పారామెడికల్ కోర్సులు) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

అర్హత: బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియెట్/ పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు వస్తే చాలు. బీఎస్సీ(పారామెడికల్) కోర్సుకు ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/ పన్నెండో తరగతి/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు.

బీఎస్సీ నర్సింగ్ (పోస్ట్ బేసిక్) కోర్సుకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా(జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ) కోర్సు పూర్తిచేసి ఉండాలి. నర్సు, మిడ్‌వైఫ్‌గా స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి. పురుషులు మిడ్‌వైఫరీ ట్రెయినింగ్‌కు బదులు ఆర్నెల్ల వ్యవధి గల ఓటీ టెక్నిక్స్/ఆప్తాల్మిక్ నర్సింగ్/ లెప్రసీ నర్సింగ్/టీబీ నర్సింగ్/సైకియాట్రిక్ నర్సింగ్/న్యూరోలాజికల్ అండ్ న్యూరో సర్జికల్ నర్సింగ్/కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్/క్యాన్సర్ నర్సింగ్/ఆర్థోపెడిక్ నర్సింగ్ కోర్సు పూర్తిచేసి ఉండాలి.

పీజీ కోర్సులు

ఎమ్మెస్సీ(నర్సింగ్), ఎమ్మెస్సీ కోర్సులు, ఎం.బయోటెక్నాలజీ ప్రోగ్రాములు ఉన్నాయి. ఎమ్మెస్సీ కోర్సుల్లో మెడికల్ అనాటమీ, మెడికల్ బయోకెమిస్ట్రీ, బయో ఫిజిక్స్, మెడికల్ ఫిజియాలజీ, మెడికల్ ఫార్మకాలజీ, రీప్రొడక్టివ్ బయాలజీ అండ్ క్లినికల్ ఎంబ్రియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ, కార్డియోవాస్క్యులర్ ఇమేజింగ్ అండ్ ఎండోవాస్క్యులర్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు.

అర్హత: ఎమ్మెస్సీ(నర్సింగ్) కోర్సుకు కనీసం 60 శాతం మార్కులతో బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ(నర్సింగ్) పోస్ట్ బేసిక్/బీఎస్సీ(నర్సింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. నర్సు, మిడ్‌వైఫ్‌గా స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి. ఎమ్మెస్సీ కోర్సుల్లో కార్డియోవాస్క్యులర్ ఇమేజింగ్‌కు బీఎస్సీ(రేడియోగ్రఫీ); న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీకి బీఎస్సీ(న్యూక్లియర్ మెడిసిన్/ రేడియో డయాగ్నసిస్/రేడియోథెరపీ)/బీఎస్సీ (ఎంపీసీ/ఫిజిక్స్-లైఫ్ సైన్సెస్)ఉత్తీర్ణులై ఉండాలి. మిగిలిన స్పెషలైజేషన్లకు కనీసం 55 శాతం మార్కులతో ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీఫార్మసీ/బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ పూర్తిచేసి ఉండాలి. ఎం.బయోటెక్నాలజీకి బీటెక్(బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **బేసిక్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 4
- **కోడ్ జనరేషన్‌కు ప్రక్రియ ప్రారంభం:** మార్చి 12 నుంచి
- **కోడ్ జనరేషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 12
- **ఫైనల్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 12
- **వెబ్‌సైట్:** aiimsexams.ac.in

మైసూరు ఏఐఐఎస్‌హెచ్‌లో అకడమిక్ ప్రోగ్రామ్‌లు

మైసూర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ (ఏఐఐఎస్‌హెచ్)-వివిధ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ, స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి.

డిప్లొమాలు

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. హియరింగ్ ఎయిడ్ అండ్ ఇయర్ మౌల్డ్ టెక్నాలజీ, ఎర్లీ ఛైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్(హియరింగ్ ఇంపెయిర్‌మెంట్), హియరింగ్ లాంగ్వేజ్ అండ్ స్పీచ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో 30 సీట్లు ఉన్నాయి. హియరింగ్ లాంగ్వేజ్ అండ్ స్పీచ్ స్పెషలైజేషన్‌కు సంబంధించి సంస్థ స్టడీ సెంటర్లలో ఒక్కోదానిలో 28 సీట్లు ఉన్నాయి.

స్టడీ సెంటర్లు: పీజీఐఎంఈఆర్ డా.రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్-న్యూఢిల్లీ, ఇందిరాగాంధీ మెడికల్ కాలేజ్-సిమ్లా, ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్(ఏఐఐపీఆర్) -ముంబై. అర్హత వివరాలు త్వరలో ప్రకటిస్తారు. ఆర్‌సీఐ నిర్వహించే ఆలిండియా ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు పది నెలలపాటు నెలకు రూ.250 స్టయిపెండ్ ఇస్తారు.

పీజీ డిప్లొమా

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇందులో 12 సీట్లు ఉన్నాయి. స్టయిపెండ్ ఇవ్వరు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: డిగ్రీ(ఆడియాలజీ/స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ/స్పీచ్ అండ్ హియరింగ్/స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ) ఉత్తీర్ణులై ఉండాలి. ఆర్‌సీఐ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.

బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ (బీఏఎస్ఎల్‌పీ)

ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో 80 సీట్లు ఉన్నాయి. ఇందులో ఆరు సెమిస్టర్లతోపాటు ఏడాది ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. ప్రవేశం పొందిన అభ్యర్థులకు మొదటి మూడేళ్లు ఏడాదికి పదినెలలపాటు నెలకు రూ.800 స్టయిపెండ్ ఇస్తారు. ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.5,000 చెల్లిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్/ బయాలజీ/కంప్యూటర్ సైన్స్/స్టాటిస్టిక్స్/ఎలక్ట్రానిక్స్/సైకాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ఎంపిక: సంస్థ నిర్వహించే ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ఎగ్జామ్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్/బయాలజీ సబ్జెక్టుల నుంచి 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ సీబీఎస్ఈ పదకొండు, పన్నెండు తరగతుల సిలబస్ ప్రకారం ఉంటాయి. ప్రశ్నకు 1 మార్కు. చొప్పున మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం రెండున్నర గంటలు.

బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్-స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపెయిర్‌మెంట్)

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఏడాదికి పది నెలలపాటు నెలకు రూ.400 స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఏదేని (డిగ్రీ/పీజీ)(సైన్స్/సోషల్ సైన్సెస్/హ్యూమానిటీస్) ఉత్తీర్ణులు లేదా కనీసం 55 శాతం మార్కులతో (బీఈ/బీటెక్)(సైన్స్, మేథమెటిక్స్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. స్పీచ్-లాంగ్వేజ్ పాథాలజీ, ఆడియాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 44 సీట్లు ఉన్నాయి. రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) నిబంధనల ప్రకారం సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఏడాదికి పది నెలలపాటు నెలకు రూ.1300ల స్టయిపెండ్ చెల్లిస్తారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బీఏఎస్ఎల్‌పీ/బీఎస్సీ(స్పీచ్ అండ్ హియరింగ్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: రెండు స్పెషలైజేషన్‌లకు వేరుగా సీబీటీ విధానంలో ఎగ్జామ్ నిర్వహిస్తారు. ఎగ్జామ్‌లో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం 100 నిమిషాలు.

- **దరఖాస్తు ఫీజు:** డిప్లొమా ప్రోగ్రామ్‌లకు రూ.525(దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300); బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లకు రూ.1100 (రిజర్వ్‌డ్ వర్గాలకు 700); బీఏఎస్ఎల్‌పీ, ఎమ్మెస్సీ, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లకు రూ.1625(దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1225)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 19
- **వెబ్‌సైట్:** www.aiishmysore.in

మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపెయిర్‌మెంట్)

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో 20 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఏడాదికి పది నెలలపాటు నెలకు రూ.650 స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్(హియరింగ్ ఇంపెయిర్‌మెంట్)/ బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపెయిర్‌మెంట్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఈడీ జనరల్ కోర్సు ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్-స్పెషల్ ఎడ్యుకేషన్(హెచ్ఐ) పూర్తిచేసినవారు కూడా అర్హులే. సంస్థ నిర్వహించే ఆఫ్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

లిటిల్స్



సోదర ప్రేమ

ఒక ఊరిలో రాముడు, భీముడు అనే అన్నదమ్ములు ఉండేవారు. ఇద్దరూ స్నేహితుల్లా ఉండేవారు. కలసి మెలసి ఉండేవాళ్లు. రాముడు మాత్రం బలహీనుడు, భయస్తుడు, దుర్బలుడు, పిరికివాడు. భీముడు అయితే పేరుకు తగినట్లు బలాఢ్యుడు, ధీశాలి, కోపిష్టి, గర్వి. ఈ ఇద్దరు అన్నదమ్ముల ఆప్యాయత చూసి అందరూ ఆశ్చర్యపోయేవారు. విషయమేంటంటే అన్న పేరు రాముడు. తమ్ముడి పేరు భీముడు. అన్నను ఎప్పుడూ కాపాడుకునే బాధ్యత తమ్ముడు తీసుకున్నాడు.

చూస్తుండగానే రాజ్యంలో ఒక రోజు దండోరా వచ్చింది. చుట్టు పక్కన గ్రామాల వాళ్లు అంతా రాజు దగ్గరకు తరలి వెళ్లారు. రాజుగారు ఇలా సెలవిచ్చారు.. 'మనదేశంలోని భాండాగారం తరిగిపోయింది. ధనమే లేకుంటే మిమ్ములను చూడలేను కదా. పైగా నాకు పన్నులు వేయడం ఇష్టం ఉండదు' అంటూ బాధపడ్డారు. రాజు బాధ చూసి అందరూ బాధపడ్డారు. వెంటనే మంత్రి కలగజేసుకుని.. 'మీరంతా బాగా పనిచేయాలి. కష్టపడి పని చేస్తే డబ్బులు ఇస్తాం. భాండాగారాన్ని సరిచేయటానికి మీరు అధిక గంటలు ఇక్కడే పని చేయాలి. అయితే తక్కువ డబ్బులు ఇస్తాం. మీరు సర్దుకోవాల్సిందే. ఈ రాజ్యంకోసం.. మన రాజుగారి కోసం చేయలేమా?' అన్నాడు. అందరూ తలలూపారు. రాజ్యంలోని పేదలంతా కష్టపడుతున్నారు. కట్టుబానిసల్లా పని చేస్తున్నారు. పని చేయకపోతే వారిని బందిఖానాలో వేసేవారు. రాముడు పని చేయలేకపోవటంతో బంధీ చేశారు. వెయ్యి రూపాయలు కష్టపడి ప్రతిరోజూ పన్నెండు గంటలు పని చేస్తే కూలి ఇస్తాం అన్నారు రాజ్యాధికారం ఉన్న అక్కడ అధికారులు. రాముడుకి అంత పని చేతకాదు. దీంతో భీముడు రెట్టింపు పని చేశాడు. ఎంతో కష్టపడ్డాడు. చివరికి డబ్బులు సంపాదించాడు. భీముడి దగ్గరకు ఒక రోజు రాజు వచ్చాడు. ఏ గ్రామం నుంచి వచ్చావు? అని అడిగాడు. 'ఇంతలా కష్టపడుతున్నావు. నువ్వు ఇక చేసింది చాలు వెళ్లిపో' అన్నాడు. 'అయ్యా.. సంతోషం. మా తమ్ముడు రాముడు కష్టపడలేడు. ఈ డబ్బులు తీసుకుని తమ్ముడిని వదిలేయి' అన్నాడు. 'వదలను' అన్నాడు రాజుగారు. కష్టపడలేని వాడు రాజ్యంలో ఎందుకన్నట్లు మాట్లాడారు రాజుగారు. వెంటనే భీముడు ఇలా అన్నాడు.. 'ఎవరి కర్మ వాళ్లు అనుభవించాలి. అందరూ గొప్పవారు కాదు. కాలేరు. నా తమ్ముడుకోసమే ఇంతలా కష్టపడ్డాను. నన్ను గుర్తించారు. నా తమ్ముడిని వదలండి.. ఇక్కడ నేను శాశ్వతంగా పని చేస్తా' అన్నాడు. 'ఏమీ ఆలోచించకుండా.. తన సోదరుడి మీద ఉన్న ప్రేమను గుర్తించారు రాజుగారు. ఆ ఇద్దరినీ వదిలేయమని ఆదేశించాడు.




సరైన నీడ ఏది?



10 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 252

1	8	4	3	6		9		2
	5		1				8	
2					8	7		
	9				4	6		
		7	8		9	1		
		1	6				4	
		2	4					5
	1				5		3	
3		5		8	1	2	9	6

సుడోకు - 251 సమాధానం

9	3	6	2	4	7	1	5	8
5	7	8	1	6	9	3	4	2
1	4	2	8	5	3	7	6	9
3	6	9	7	2	1	4	8	5
7	1	5	9	8	4	2	3	6
2	8	4	6	3	5	9	7	1
6	2	7	3	9	8	5	1	4
4	9	3	5	1	6	8	2	7
8	5	1	4	7	2	6	9	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.



బెల్‌లో సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్లు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 24

పోస్టు: సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు 15 ఏళ్ల పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ.30,000 - రూ.1,20,000 వరకు

వయోపరిమితి: 50 సంవత్సరాలు మించకూడదు

పని ప్రదేశాలు: గువాహటి, ఢిల్లీ, శ్రీనగర్, ముంబై, కోచ్చి, కార్వార్, పోర్ట్‌బ్లెయిర్, విశాఖపట్నం

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: మార్చి 20

వెబ్‌సైట్: https://belindia.in/

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఇంజనీర్లు

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్)...రామగుండం ప్లాంట్(తెలంగాణ), కార్పొరేట్ ఆఫీస్(నోయిడా)లో రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 25

పోస్టుల వివరాలు

1. ఇంజనీర్(ఇ-1): 19 పోస్టులు
2. సీనియర్ కెమిస్ట్: 2 పోస్టులు
3. అకౌంట్స్ ఆఫీసర్(ఇ-1): 5 పోస్టులు
4. మెడికల్ ఆఫీసర్(ఇ-1): 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి బీఈ, బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎమ్మెస్సీ, ఎంబీఏ, సీఏ/సీఎంఏ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 35 ఏళ్లు. ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.

బేసిక్ పే: పే స్కేల్ రూ.40,000- రూ.1,40,000.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలు, పని అనుభవం, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.700. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31

వెబ్‌సైట్: https://rfcl.co.in/

ఎంవోఐఎల్‌లో గ్రాడ్యుయేట్ ట్రెయినీలు

మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్, నాగ్‌పూర్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 44

1. గ్రాడ్యుయేట్ ట్రెయినీ(గనులు): 13
2. గ్రాడ్యుయేట్ ట్రెయినీ(మెకానికల్): 5
3. గ్రాడ్యుయేట్ ట్రెయినీ(ఎలక్ట్రికల్): 4
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(జియాలజీ), గ్రాడ్యుయేట్ ట్రెయినీ(ప్రాసెస్): 1
5. గ్రాడ్యుయేట్ ట్రెయినీ(కెమికల్, మెటలర్జీ, మినరల్ ప్రాసెసింగ్): 3
6. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(మెటీరియల్స్): 5
7. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్): 1
8. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(పర్స్/వెల్): 5
9. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఫైనాన్స్): 5
10. మేనేజర్(సర్వే): 2

విభాగాలు: మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, జియాలజీ, ప్రాసెస్, మెటీరియల్స్, కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్, పర్సనల్, ఫైనాన్స్, సర్వే

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంటెక్, గ్రాడ్యుయేట్, ఎంబీఏ, డిప్లొమా, పీజీ, డిగ్రీ, ఇంజనీరింగ్‌లలో ఉత్తీర్ణత.

వేతనం: నెలకు రూ.50,000 - రూ.1,60,000

వయోపరిమితి: 53 సంవత్సరాలు మించరాదు

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 21

వెబ్‌సైట్: https://www.moil.nic.in/



ఐటీడీసీలో అసిస్టెంట్ మేనేజర్లు

భారత టూరిజం డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐటీడీసీ)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ మేనేజర్: 6 పోస్టులు
2. చెఫ్: 3 పోస్టులు
3. అసిస్టెంట్ మేనేజర్(ఈవెంట్స్): 2 పోస్టులు
4. అసిస్టెంట్ మేనేజర్(సివిల్): 3 పోస్టులు
5. అసిస్టెంట్ మేనేజర్(ఈఅండ్ఎం): 3 పోస్టులు
6. అసిస్టెంట్ మేనేజర్(లీగల్): 1 పోస్టు
7. అసిస్టెంట్ లెక్చరర్స్: 4 పోస్టులు

అర్హత: లా డిగ్రీ, హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, హాస్పిటాలజీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్/మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీతో పాటు సంబంధిత పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 14

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

వెబ్‌సైట్: https://itdc.co.in/

సీబీఎస్ఈలో గ్రూప్- ఎ, బి, సి పోస్టులు

న్యూఢిల్లీలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్...డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 118

1. అసిస్టెంట్ సెక్రటరీ(అడ్మినిస్ట్రేషన్): 18 పోస్టులు
2. అసిస్టెంట్ సెక్రటరీ(అకడమిక్): 16 పోస్టులు
3. అసిస్టెంట్ సెక్రటరీ(స్కిల్ ఎడ్యుకేషన్): 8 పోస్టులు
4. అసిస్టెంట్ సెక్రటరీ(ట్రెయినింగ్): 22 పోస్టులు
5. అకౌంట్స్ ఆఫీసర్: 3 పోస్టులు
6. జూనియర్ ఇంజనీర్: 17 పోస్టులు
7. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: 7 పోస్టులు
8. అకౌంటెంట్: 7 పోస్టులు
9. జూనియర్ అకౌంటెంట్: 20 పోస్టులు

అర్హతలు: పోస్టును అనుసరించి విద్యార్హతలు, అనుభవం తదితర పూర్తి సమాచారం మార్చి 12న సంస్థ వెబ్‌సైట్‌లో లభ్యమవుతుంది.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: మార్చి 12

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 11

వెబ్‌సైట్: https://www.cbse.gov.in/

ఐకార్‌లో రీసెర్చ్ మేనేజ్‌మెంట్ పోస్టులు

దేశవ్యాప్తంగా ఐకార్ పరిశోధన సంస్థల్లో...ఒప్పంద కాల ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 11

1. అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్: 3 పోస్టులు
2. డైరెక్టర్: 6 పోస్టులు
3. జాయింట్ డైరెక్టర్: 2 పోస్టులు

విభాగాలు: యానిమల్ హెల్త్, ఇన్‌లాండ్ ఫిషరీస్, ప్లాంట్ ప్రొటెక్షన్ అండ్ బయోసేఫ్టీ తదితరాలు.

అర్హత: సంబంధిత విభాగంలో డాక్టోరల్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 60 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు రుసుము: రూ.1500

ఎంపిక ప్రక్రియ: ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18

వెబ్‌సైట్: http://asrb.org.in/vacancy